www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI


సెప్టెంబరులోనూ అధిక వర్షాలే!

దీర్ఘకాల సగటులో 109 శాతం నమోదుకు చాన్స్
పర్వత ప్రాంతాలకు కొండ చరియల ముప్పు
ఉత్తర కోస్తా, సీమల్లో సాధారణం కంటే తక్కువ
భారత వాతావరణ విభాగం అంచనా 9

రేపు బంగాళాఖాతంలో అల్పపీడనం
2-3 రోజులు మోస్తరు నుంచి భారీ వర్షాలు
రానున్న రెండు వారాల్లో ఏపీ, తెలంగాణకు
భారీ వర్షాలు, వరద ముప్పు: వెదర్ మ్యాన్

సోమవారం | 1-9-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 137 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, శుక్లపక్షం, తిథి: నవమి రా.2:43 తదుపరి దశమి, నక్షత్రం: జ్యేష్ఠ రా.7:55 తదుపరి మూల, వర్జ్యం: తె.4:33-6:17, దుర్ముహూర్తం: మ.12:39-1:29, మ.3:07-3:57, అమృతఘడియలు: ఉ.10:12-11:58, రాహుకాలం: ఉ.7:30-9:00, సూర్యోదయం: 6:04, సూర్యాస్తమయం: 6:25 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



బిజినెస్

విజయవాడ ● సోమవారం 1 సెప్టెంబరు 2025

టాటా క్యాపిటల్ 17,200 కోట్ల ఐపీఓ

న్యూఢిల్లీ: టాటా గ్రూప్ నుంచి మరో కంపెనీ మెగా పబ్లిక్ ఇష్యూకి వస్తోంది. గ్రూప్ కంపెనీ టాటా క్యాపిటల్ ఈ నెలాఖరులోగా పబ్లిక్ ఇష్యూ జారీ చేయనుంది. ఈ ఇష్యూ సైజు 200 కోట్ల డాలర్ల (సుమారు రూ.17,200 కోట్లు) వరకు ఉంటుందని మార్కెట్ వర్గాల అంచనా. దీంతో కంపెనీ వాల్యుయేషన్ 1,100 కోట్ల డాలర్ల (సుమారు రూ.96,800 కోట్లు) వరకు ఉండే అవకాశం ఉందని భావిస్తున్నారు.. ఈ ఐపీఓ ఈ నెల 22న ప్రారంభమవుతుందని సమాచారం. ఈ ఐపీఓ మదుపరుల ఆదరణకు నోచుకుంటే భారత క్యాపిటల్ మార్కెట్లో అతి పెద్ద ఫైనాన్షియల్ ఐపీఓ కానుంది.

ఎఫ్‌పీఐల అమ్మకాలు రూ.35,000 కోట్లు

న్యూఢిల్లీ: భారత స్టాక్ మార్కెట్లో విదేశీ పోర్టుఫోలియో మదుపరులు (ఎఫ్‌పీఐ) మళ్లీ అమ్మకాలతో హోరెత్తిస్తున్నారు. గత నెల (ఆగస్టు)లో ఈ సంస్థలు గత ఆరు నెలల్లో ఎన్నడూ లేని విధంగా రూ.34,993 కోట్ల విలువైన షేర్లను విక్రయించాయి. జూలైలో జరిపిన రూ.17,741 కోట్ల అమ్మకాలతో పోలిస్తే ఇది దాదాపు రెట్టింపు. తాజా అమ్మకాలతో ఈ సంవత్సరం ఇప్పటి వరకు మన మార్కెట్లో ఎఫ్‌పీఐలు జరిపిన అమ్మకాల విలువ రూ.1.3 లక్షల కోట్లకు చేరింది. అమెరికా సుంకాలతో జీడీపీ వృద్ధి రేటు మసకబారుతుందనే అంచనాలు, మన స్టాక్ మార్కెట్ ఇంకా అధిక వాల్యుయేషన్లతో ట్రేడవుతుందనే అభిప్రాయం, డాలర్‌తో క్షీణిస్తున్న రూపాయి మారకం విలువ ఇందుకు ప్రధాన కారణమని భావిస్తున్నారు.

ఈ ఏడాది ప్రైవేట్ పెట్టుబడుల జోరు

21.5% వృద్ధితో రూ.2.67 లక్షల కోట్లు ఉండే చాన్స్: ఆర్‌బీఐ



ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) దేశంలో ప్రైవేట్ పెట్టుబడులు (క్యాపెక్స్) పుంజుకునే ఆస్కారం కనిపిస్తోంది. 2024-25 ఆర్థిక సంవత్సరంతో పోల్చితే ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రైవేట్ పెట్టుబడులు 21.5% వృద్ధితో రూ.2,67,432 కోట్ల స్థాయిలో ఉండొచ్చని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) అంచనా వేసింది. గత ఆర్థిక సంవత్సరంలో కార్పొరేట్ పెట్టుబడులు రూ.2,20,132 కోట్లుగా ఉన్నాయి. అంతర్జాతీయ అస్థిరతలు వెన్నాడుతున్నప్పటికీ కార్పొరేట్ సంస్థలు అధిక నగదు నిల్వలు, మెరుగైన లాభదాయకత, విభిన్న రుణ వసతుల అందుబాటుతో 2025-26 ఆర్థిక సంవత్సరంలోకి ఎంతో బలంగా అడుగు పెట్టాయని "ప్రైవేట్ కార్పొరేట్ పెట్టుబడులు: 2024-25లో వృద్ధి; 2025-26 అంచనాలు" పేరిట ఆగస్టు బులెటిన్‌లో ప్రచురించిన వ్యాసంలో ఆర్‌బీఐ తెలిపింది. కార్పొరేట్ రంగం ప్రకటించిన పెట్టుబడి ప్రణాళికలు సమీప భవిష్యత్తులో క్యాపెక్స్ ధోరణులకు అద్దం పడుతున్నట్టు పేర్కొంది.

ముఖ్యాంశాలు..

- మౌలిక వసతుల అభివృద్ధికి విధానపరమైన నిరంతర చర్యలు, నిలకడగా అదుపులో ఉన్న ద్రవ్యోల్బణం, తగ్గిన వడ్డీ రేట్లు, తేలిగ్గా నగదు లభ్యత, పెరిగిన సామర్థ్యాల వినియోగం ప్రైవేట్ పెట్టుబడులకు అనుకూలమైన అంశాలు.
- ప్రైవేట్ పెట్టుబడుల్లో అధిక భాగం మౌలిక వసతుల రంగం ఆకర్షిస్తుంది. ప్రధానంగా విద్యుత్ రంగం అగ్రస్థానంలో నిలుస్తుంది.
- సరికొత్త ప్రాజెక్టులపై పెట్టుబడి ప్రణాళికలు ప్రకటించడంతో వ్యవస్థలో కాలానుగుణంగా ఏర్పడే రికవరీతో పాటు సామర్థ్యాల నిర్మాణం జరుగుతున్న సంకేతం వెలువడింది. కార్పొరేట్ సంస్థలు తాము ప్రకటించిన పెట్టుబడి లక్ష్యాలను వాస్తవిక పెట్టుబడులుగా మార్చేందుకు ఇది సానుకూల సంకేతం.
- భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలతో పాటు ప్రపంచ దేశాల్లో అస్థిరతలు, మందగించిన డిమాండ్ పెట్టుబడి సెంటిమెంట్‌ను దెబ్బ తీసే ప్రమాదం ఉంది

సుంకాల ప్రభావిత రంగాలను ఆదుకుంటాం

డీఈఏ కార్యదర్శి అనురాధ ఠాకూర్

న్యూఢిల్లీ: అమెరికా సుంకాలతో కష్టాల్లో పడిన రంగాలను ఆదుకునేందుకు కట్టుబడి ఉన్నట్టు ప్రభుత్వం మరోసారి ప్రకటించింది. ఇందుకోసం త్వరలోనే కార్యాచరణ ప్రణాళికను ప్రకటిస్తామని కేంద్ర ఆర్థిక వ్యవహారాల శాఖ (డీఈఏ) కార్యదర్శి అనురాధ ఠాకూర్ తెలిపారు. 'అమెరికా సుంకాలతో ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉండే కొన్ని రంగాలు ప్రభావితం అవుతాయి. ఈ ప్రభావం ఏ మేరకు ఉంటుందనే విషయాన్ని అంచనా వేసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం' అని అన్నారు. దేశీయ వినియోగాన్ని పెంచడం ఇందుకు ఒక మార్గమన్నారు. దీంతో పాటు సుంకాలతో దెబ్బతినే రంగాలను ఆదుకునేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఠాకూర్ చెప్పారు. సుంకాల పోటు ఉన్నా మన ఆర్థిక పునాదులు ఇంకా గట్టిగానే ఉన్నట్టు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం (2025-26)లో ద్రవ్య లోటు బడ్జెట్‌లో పేర్కొన్న విధంగా జీడీపీలో 4.4 శాతం మించదన్నారు.

అనిశ్చితిలో 'ఆటో' అమ్మకాలు

బీఎండబ్ల్యూ ఇండియా సీఈఓ హర్దీప్ సింగ్ బ్రార్

న్యూఢిల్లీ: ప్రతిపాదిత జీఎస్‌టీ సంస్కరణలపై వెంటనే స్పష్టత ఇవ్వాలని ఆటోమొబైల్ పరిశ్రమ కోరుతోంది. కార్లపైనా జీఎస్‌టీ రేట్లు తగ్గుతాయనే వార్తలతో ప్రస్తుతం కొనుగోలుదారులు ఎవరూ కొనుగోళ్లకు ముందుకు రావడం లేదని బీఎండబ్ల్యూ గ్రూప్ ఇండియా ప్రెసిడెంట్, సీఈఓ హర్దీప్ సింగ్ బ్రార్ చెప్పారు. 'కొనుగోలుదారుల ఆసక్తి, డిమాండ్ బాగానే ఉంది. అయితే జీఎస్‌టీ రేట్లపై సందిగ్ధతతో వారు కార్లు కొనకుండా వేచి చూసే వైఖరిలో ఉన్నారు. కొత్త వాహనాల అమ్మకాలపై ఇది కొంత వరకు ప్రభావం చూపిస్తోంది' అని బ్రార్ తెలిపారు. వచ్చే పండగల సీజన్‌లో వాహనాల అమ్మకాలు పుంజుకోవాలంటే ప్రభుత్వం వెంటనే దీనిపై స్పష్టత ఇవ్వాలని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆటోమొబైల్ వాహనాలపై 28 శాతం జీఎస్‌టీ అమల్లో ఉంది. ఈ నెల 3-4 తేదీల్లో జరిగే జీఎస్‌టీ మండలి సమావేశంలో దీన్ని 18 శాతానికి కుదిస్తారనే వార్తలు షికారు చేస్తున్నాయి.

24,800 పైన బుల్లిష్

(సెప్టెంబరు 1-5 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

టెక్ వ్యూ

నిఫ్టీ గత వారం 25,022-24,405 పాయింట్ల మధ్యన కదలాడి 445 పాయింట్ల నష్టంతో 24,405 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 24,800 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 24,613, 24,842, 24,745, 24,786 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.

బ్రేకౌట్ స్థాయి: 24,800 బ్రేక్‌డౌన్ స్థాయి: 24,000

నిరోధ స్థాయిలు : 24,600, 24,700, 24,800 (24,500 పైన బుల్లిష్)

మద్దతు స్థాయిలు : 24,200, 24,100, 24,000 (24,300 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



1 తేదీ			
హైదరాబాద్	525	విజయవాడ	560
వరంగల్	527	గోదావరి	560
చిత్తూరు	578	విశాఖపట్నం	565
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	95	విజయవాడ	117
వరంగల్	95	గుంటూరు	112
కరీంనగర్	95	ఒంగోలు	112
మహబూబ్‌నగర్	95	చిత్తూరు	100
కర్నూలు	95	నెల్లూరు	105
విశాఖపట్నం	121	అనంతపురం	105
గోదావరి	117		

ఆచితూచి అడుగేయండి!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం తీవ్ర ఒడుదొడుకులకు లోనయ్యే అవకాశం ఉంది. అయితే జూన్ త్రైమాసికంలో దేశ జీడీపీ అంచనాలను మించటం, ట్రంప్ టారిఫ్స్‌ను అమెరికా ఫెడరల్ కోర్టు అడ్డుకోవటం వంటి వార్తలు సానుకూల సెంటిమెంట్‌ను నింపే వీలుంది. అదే జరిగితే మార్కెట్లో పుల్‌బ్యాక్ ర్యాలీకి అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఆటోమొబైల్, యాన్సిలరీస్, ఎఫ్ఎంసీజీ, కన్‌స్ట్రక్షన్ మెటీరియల్స్, రిటైల్, ఎలక్ట్రికల్స్ వంటి రంగాలు మాత్రమే కొంత బలం ప్రదర్శిస్తున్నాయి.

స్టాక్ రికమండేషన్స్

ఎల్ అండ్ టీ: కొన్ని నెలలుగా ఈ షేరు సైడ్‌వేస్‌లో చలిస్తోంది. ఇప్పుడిప్పుడే మూమెంటమ్, రిలేటివ్ స్ట్రెంత్ మెరుగవుతున్నాయి. వాల్యూమ్ పెరుగుతోంది. గత శుక్రవారం రూ.3,061 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.3,570 ఎగువన పొజిషన్ తీసుకుని రూ.3,850 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. రూ.3,500 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

కోల్గేట్ పామోలివ్: గత ఏడాది సెప్టెంబరు నుంచి డౌన్‌ట్రెండ్‌లో పయనిస్తున్న ఈ షేరు ప్రస్తుతం అక్యుములేషన్ జోన్‌లో ఉంది. వాల్యూమ్ క్రమంగా పెరుగుతోంది. స్వల్పకాలిక మూమెంటమ్‌ను బట్టి రివర్సల్‌కు అవకాశం కనిపిస్తోంది. గత శుక్రవారం రూ.2,331 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.2,300 స్థాయిలో ప్రవేశించి రూ.2,700 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. రూ.2,260 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

వోల్టాస్: గత ఏడాది సెప్టెంబరు నుంచి ఈ షేరు డౌన్‌ట్రెండ్‌లో పయనిస్తోంది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి మంచి బేస్ ఏర్పడింది. ప్రస్తుతం కన్స్యూమర్ డ్యూరబుల్స్ విభాగం క్రమంగా పుంజుకుంటోంది. గత శుక్రవారం రూ.1,374 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.1,350 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.1,500 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. అయితే రూ.1,325 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

సీజీ పవర్: ప్రస్తుతం ఈ షేరు ఆకర్షణీయమైన ధరలో లభిస్తోంది. చక్కటి బేస్ ఏర్పడింది. పైగా అక్యుములేషన్ జోన్‌లో ఉంది. రిలేటివ్ స్ట్రెంత్ సైతం మెరుగవుతోంది. గత శుక్రవారం రూ.694 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.680 శ్రేణిలో ప్రవేశించి రూ.740 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. రూ.660 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఐటీసీ: రెండేళ్లుగా ఈ షేరు డౌన్‌ట్రెండ్‌లో కొనసాగుతోంది. ఎఫ్ఎంసీజీ, కన్స్యూమర్ డ్యూరబుల్స్ రంగాలకు మక్కువ పెరుగుతున్న నేపథ్యంలో ఈ షేరు ఆకర్షణీయంగా మారింది. గత శుక్రవారం రూ.409 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.400 శ్రేణిలో ఎంటరై రూ.445 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. రూ.385 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

24, 500 వద్ద నిలదొక్కుకోవడం కీలకం

టెక్ వ్యూ



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం కీలక స్థాయి 25,000 వద్ద విఫలమై వారం అంతా కరెక్షన్ ట్రెండ్ లోనే ట్రేడయి 445 పాయింట్లు నష్టపోయింది. ప్రస్తుతం 24,300 స్థాయి (ఇక్కడే పలు బాటమ్‌లు ఏర్పడ్డాయి) కన్నా స్వల్పంగా పైన ఉంది. మిడ్‌క్యాప్-100 (1900 పాయింట్లు), స్మాల్‌క్యాప్-100 (690 పాయింట్లు) సూచీలు కూడా గత వారం భారీగా నష్టపోయాయి. గత కొద్ది వారాల్లో నిఫ్టీ 750 పాయింట్లకు పైగా నష్టపోయిన కారణంగా మార్కెట్లో ప్రస్తుతం టెక్నికల్ రికవరీకి ఆస్కారం ఉంది. అదే సమయంలో మానసిక అవధి 24,500కి చేరువవుతోంది. అంతే కాదు..ఆగస్టు నెలవారీ చార్టులు బలహీనంగా క్లోజ్ కావడం మరింత అప్రమత్తతను సూచిస్తోంది. సానుకూలత కోసం మార్కెట్ ప్రస్తుత స్థాయిల్లో టెక్నికల్‌గా కన్సాలిడేట్ కావడం అవసరం.

బుల్లిష్ స్థాయిలు: గత వారం మార్కెట్ నిట్టనిలువుగా పతనమైనందు వల్ల మొదట నిలదొక్కుకోవాలి. తదుపరి నిరోధం 24,500 కన్నా పైన నిలదొక్కుకుంటే మైనర్ పాజిటివ్ ట్రెండ్ ఏర్పడుతుంది. ప్రధాన నిరోధం 24,700. స్వల్పకాలిక నిరోధం 25,000.

బేరిష్ స్థాయిలు: బలహీనత ప్రదర్శించినా ట్రెండ్‌లో సానుకూలత కోసం కీలక మద్దతు స్థాయి, గతంలో ఏర్పడిన బాటమ్ 24,300 వద్ద రికవర్ అయి తీరాలి. విఫలమైతే మరింత బలహీనపడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 24,000.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ కూడా గత వారం భారీ డౌన్‌ట్రెండ్‌లో ట్రేడయి 1,600 పాయింట్లు నష్టపోయి 53,600 వద్ద ముగిసింది. గత కొద్ది వారాల్లో 4,000 పాయింట్ల మేరకు నష్టపోయింది. ట్రెండ్‌లో సానుకూలత కోసం నిరోధస్థాయి 54,000 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం 54,600. గత వారం కనిష్ఠ స్థాయి 53,600 వద్ద విఫలమైతే మరింత బలహీనత తప్పదు. ప్రధాన మద్దతు స్థాయి 53,000.

పాటర్న్: నిఫ్టీ ప్రస్తుతం స్వల్పకాలిక 100 డీఎంఏకు చేరువవుతోంది. సానుకూలత కోసం ఇక్కడ నిలదొక్కుకుని తీరాలి. 24,300 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" వద్ద ప్రధాన మద్దతు ఇంది. ఇక్కడ నిలదొక్కుకోవడం తప్పనిసరి. విఫలమైతే మరింత బలహీనత ఏర్పడుతుంది.

టైమ్: ఈ సూచీ ప్రకారం గురువారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	24,500, 24,560
మద్దతు	24,380, 24,300

స్పోర్ట్స్

సూపర్-4కు భారత్



- హర్మన్‌ప్రీత్ డబుల్
- 3-2తో జపాన్‌పై గెలుపు
- ఆసియాకప్ హాకీ

రాజ్‌గిర్ (బిహార్): కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ రెండు గోల్స్‌తో అదరగొట్టడంతో.. ఆసియాకప్ హాకీలో భారత జట్టు వరుసగా రెండో విజయంతో సూపర్-4 బెర్త్‌ను ఖరారు చేసుకొంది. పూల్-ఎలో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 3-2తో జపాన్‌ను ఓడించింది. డ్రాగ్‌ఫ్లికర్ హర్మన్‌ప్రీత్ (5వ, 46వ నిమిషం) రెండు పెనాల్టీ కార్నర్‌లను గోల్స్‌గా మలిచాడు. 4వ నిమిషంలో మన్‌దీప్ ఫీల్డ్ గోల్‌తో భారత్‌కు తొలి గోల్ అందించాడు. జపాన్ తరఫున కోసి కవాబే (38వ, 58వ) రెండు గోల్స్ సాధించాడు. తొలి మ్యాచ్‌లో చైనాపై గెలిచిన భారత్ మొత్తం ఆరు పాయింట్లతో పూల్-ఎలో అగ్రస్థానంలో నిలిచింది. సోమవారం లీగ్ ఆఖరి మ్యాచ్‌లో కజకిస్థాన్‌తో భారత్ తలపడనుంది. ఇక, సూపర్-4లో స్థానం కోసం జపాన్, చైనా అమీతుమీ తేల్చుకోనున్నాయి. ఇదే గ్రూప్‌లో జరిగిన మరో మ్యాచ్‌లో చైనా 13-1తో కజకిస్థాన్‌ను చిత్తు చేసింది.

బుమ్రా, రోహిత్, గిల్ 'ఫిట్‌నెస్' పాసయ్యారు

బెంగళూరు: టీమిండియా టెస్ట్ కెప్టెన్ గిల్, వన్డే సారథి రోహిత్ శర్మతోపాటు పేసర్ బుమ్రా ఫిట్‌నెస్ పరీక్షలో పాసయ్యారు. రాబోయే సీజన్‌ను పురస్కరించుకుని టీమిండియా క్రికెటర్లకు ఇక్కడి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీలో బీసీసీఐ ఆదివారం ఫిట్‌నెస్ టెస్ట్ నిర్వహించింది. ఆ ముగ్గురితోపాటు జితేశ్ శర్మ, సిరాజ్, జైస్వాల్,సుందర్, శార్దూల్ కూడా టెస్ట్‌లో పాల్గొన్నారు. యోయో టెస్ట్‌తోపాటు కొత్తగా ఎముకల సాంద్రతను కొలిచే 'డీఎక్స్‌ఏ' స్కాన్ కూడా ఆటగాళ్లకు నిర్వహించారు.

నీ బ్యాటింగ్ టెస్ట్ క్రికెట్‌కు అందం

- పుజారపై ప్రధాని ప్రశంసలు

న్యూఢిల్లీ: టెస్ట్ క్రికెట్ సొబగు చటేశ్వర్ పుజార బ్యాటింగ్‌తో మరింత గుబాళించిందని ప్రధాని మోదీ కొనియాడారు. అతడి బ్యాటింగ్ శైలి సుదీర్ఘ ఫార్మాట్ అందానికి అద్దం పడుతుందని ప్రశంసించారు. ఇటీవల టెస్ట్ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన సౌరాష్ట్ర ఆటగాడికి ప్రధాని లేఖ రాశారు. 'పొట్టి క్రికెట్ ఆధిపత్యం చెలాయిస్తున్న కాలంలో..సుదీర్ఘ ఫార్మాట్ ఆట అందం ఎలా ఉంటుందో చెప్పేందుకు నువ్వే తార్కాణం. వెన్నుచూపని నీ తత్త్వం, గొప్ప సంకల్పంతో గంటలకొద్దీ బ్యాటింగ్ చేయగల సామర్థ్యంతో భారత బ్యాటింగ్‌కు అండగా నిలిచావు' అని ఆ లేఖలో ప్రధాని పొగిడారు. ఈమేరకు మోదీ పంపిన లేఖను పుజార ఆదివారం నాడు సోషల్‌మీడియాలో పోస్ట్ చేశాడు.


రెండో వన్డే కూడా లంకదే

హరారే: జింబాబ్వేతో రెండు వన్డేల సిరీస్‌ను పర్యాటక శ్రీలంక 2-0తో క్లీన్‌స్వీప్ చేసింది. పథుం నిస్సంక (122) శతకంతో చెలరేగడంతో.. ఆదివారం జరిగిన రెండో వన్డేలో లంక 5 వికెట్లతో జింబాబ్వేపై గెలిచింది. మొదట జింబాబ్వే 50 ఓవర్లలో 277/7 స్కోరు చేసింది. బెన్ కర్రాన్ (79), సికందర్ రజా (59) అర్ధ శతకాలు సాధించారు. ఛేదనలో లంక 49.3 ఓవర్లలో 5 వికెట్లకు 278 పరుగులు చేసి గెలిచింది. చరిత్ అసలంక (71) రాణించాడు.

జ్వెరెవ్ అవుట్

యూఎస్ ఓపెన్

- ప్రీక్వార్టర్స్‌కు సినర్, స్వియటెక్



జ్వెరెవ్

ఫెలిక్స్

న్యూయార్క్: యూఎస్ ఓపెన్‌లో మూడో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్‌కు మూడో రౌండ్‌లో చుక్కెదురైంది. ఆదివారం జరిగిన ఉత్కంఠ పోరులో జ్వెరెవ్ (జర్మనీ) 6-4, 6-7 (7/9), 4-6, 4-6తో 25వ సీడ్ ఫెలిక్స్ అలియసిమ్ (కెనడా) చేతిలో ఓడాడు. 2018 తర్వాత జ్వెరెవ్ నాలుగో రౌండ్‌కు చేరకపోవడం ఇదే తొలిసారి. ఇక ఆదివారం తెల్లవారుజామున ముగిసిన మూడో రౌండ్‌లో వరల్డ్ నెంబర్ వన్ యానిక్ సినర్ 5-7, 6-4, 6-3, 6-3తో షపోవలోవ్‌పై గెలిచి ప్రీక్వార్టర్స్ చేరాడు. మరో మ్యాచ్‌లో రుబ్లెవ్ 2-6, 6-4, 6-3, 4-6, 6-3తో కొలెమాన్ వాంగ్‌పై పోరాడి గెలిచాడు. మహిళల సింగిల్స్ మూడో రౌండ్‌లో రెండో సీడ్ స్వియటెక్ 7-6, 6-4తో అన్నా కలిన్‌స్కయపై, నాలుగో సీడ్ జెస్సికా పెగుల 6-1, 6-1తో ఆన్ లీపై, 8వ సీడ్ ఎనిమిసోవా 6-4, 4-6, 6-2తో క్రిస్టియాన్‌పై గెలిచి ప్రీక్వార్టర్స్‌లో ప్రవేశించారు.

రెండో రౌండ్‌లో యుకీ జోడీ: పురుషుల డబుల్స్‌లో భారత ఆటగాళ్లకు మిశ్రమ ఫలితాలు లభించాయి. తొలిరౌండ్లో రోహన్ బోపన్న/అర్నెడో జంట ఓడగా.. యుకీ భాంబ్రీ/మైకేల్ వీనస్ జంట ప్రత్యర్థిని ఓడించింది.

తలైవాస్‌పై యు ముంబా గెలుపు

ప్రొ కబడ్డీ లీగ్



విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): ప్రొ కబడ్డీ లీగ్‌లో తమిళ్ తలైవాస్‌కు యు ముంబా ఝలక్ ఇచ్చింది. ఆదివారం ఇక్కడ జరిగిన తొలి మ్యాచ్‌లో యు ముంబా 36-33తో తమిళ్ తలైవాస్‌పై నెగ్గింది. తలైవాస్ రైడర్లు అర్జున్ దేశ్వాల్, కెప్టెన్ పవన్ సెహ్రావత్ 17 పాయింట్లు రాబట్టి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. అనంతరం జరిగిన రెండో మ్యాచ్‌లో బెంగాల్ వారియర్స్ 54-44తో హరియాణా స్టీలర్స్‌పై విజయం సాధించింది. ఇక, సోమవారం జరిగే పోటీలో పట్నా పైరేట్స్‌తో యూపీ యోధాస్, గుజరాత్ జెయింట్స్‌తో పుణెరి పల్టన్ జట్లు తలపడనున్నాయి.

అద్వితీయం

- మరో కాంస్యంతో మెరిసిన సాత్విక్, చిరాగ్ జోడీ
- ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్



పారిస్: నిరుడు పారిస్ వేదికగా జరిగిన ఒలింపిక్స్‌లో ఫేవరెట్‌గా బరిలోకి దిగిన భారత బ్యాడ్మింటన్ డబుల్స్ స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ షెట్టి క్వార్టర్‌ఫైనల్లోనే పరాజయం పాలై నిరాశగా వెనుదిరిగింది. సరిగ్గా ఏడాది తిరిగే సరికి.. అదే వేదిక.. కానీ టోర్నీ ప్రపంచ చాంపియన్‌షిప్.. ఈసారి ఫలితం కూడా మారింది. విశ్వక్రీడల్లో పతకం దూరమైనా, ప్రపంచ టోర్నీలో కాంస్యం సాధించి సాత్విక్, చిరాగ్ జంట అబ్బురపరిచింది. శనివారం అర్ధరాత్రి ఇక్కడ జరిగిన పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో ప్రపంచ తొమ్మిదో ర్యాంక్ జోడీ సాత్విక్/చిరాగ్ 19-21, 21-18, 12-21తో ప్రపంచ 11వ ర్యాంకరైన చైనా జంట చెన్ బో యాంగ్/లియు యీ చేతిలో పోరాడి ఓడింది. సెమీస్ ఓటమితో సాత్విక్ ద్వయం కంచు పతకానికే పరిమితమైనా.. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో రెండోసారి పతకం నెగ్గి అ'ద్వితీయ'ం అనిపించుకుంది. ఈ మెగా టోర్నీలో రెండు పతకాలు సాధించిన భారత డబుల్స్ జోడీగా సరికొత్త చరిత్ర సృష్టించింది. 2022 టోక్యోలో జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో సాత్విక్/చిరాగ్ జంట కాంస్యం సాధించిన సంగతి తెలిసిందే.

15 ఇప్పటిదాకా ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భారత షట్లర్లు సాధించిన పతకాలు. మహిళల సింగిల్స్‌లో సింధు (ఓ స్వర్ణం, రెండు రజతాలు, రెండు కాంస్యాలు), సైనా నెహ్వాల్ (ఓ రజతం, ఓ కాంస్యం), మహిళల డబుల్స్‌లో జ్వాల/అశ్విని (కాంస్యం), పురుషుల సింగిల్స్‌లో కిడాంబి శ్రీకాంత్ (రజతం), ప్రకాశ్ పదుకోన్ (కాంస్యం), సాయి ప్రణీత్ (కాంస్యం), ప్రణయ్ (కాంస్యం), లక్ష్య సేన్ (కాంస్యం), పురుషుల డబుల్స్‌లో సాత్విక్/చిరాగ్ (రెండు కాంస్యాలు) పతకాలు గెలిచారు.

షి యుకి, యమగూచిలకు సింగిల్స్ టైటిళ్లు: ప్రపంచ చాంపియన్‌షిప్ సింగిల్స్ టైటిళ్లను షి యుకి (చైనా), అకానె యమగూచి (జపాన్) దక్కించుకున్నారు. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో షి యుకి 19-21, 21-10, 21-18తో కున్లావత్ వితిసార్న్ (థాయ్‌లాండ్)పై గెలిచి విజేతగా నిలిచాడు. ఆండెర్స్ ఆంటోన్సెన్ (డెన్మార్క్), విక్టర్ లాయ్ (కెనడా) కాంస్య పతకాలతో సరిపెట్టుకున్నారు. మహిళల సింగిల్స్ టైటిల్ పోరులో యమగూచి 21-9, 21-13తో చైనా స్టార్ చెన్ యుఫీని చిత్తుచేసి స్వర్ణం అందుకుంది. అన్ సే యంగ్ (కొరియా), క్వార్టర్స్‌లో సింధును ఓడించిన పుత్రి కుసుమ వర్దాని (ఇండోనేసియా) కాంస్య పతకాలు సాధించారు. కొరియా జంట సియో సంగ్ జే/కిమ్ వోన్ హొ 21-17, 21-12తో చైనా జోడీ చెన్ బో యాంగ్/లూ యికి షాకిచ్చి పురుషుల డబుల్స్ చాంపియన్‌గా నిలిచింది.

అడ్డంకులు అధిగమించి..

గతేడాది పారిస్ విశ్వక్రీడల వైఫల్యం నుంచి కోలుకోవడానికి అమలాపురం కుర్రాడు సాత్విక్, ముంబై షట్లర్ చిరాగ్‌కు చాలా రోజులే పట్టింది. ఒలింపిక్స్ తర్వాత ఏకంగా మూడున్నర నెలలపాటు విశ్రాంతి తీసుకొన్నారు. ఆ తర్వాత 2024 నవంబరులో చైనా మాస్టర్స్ బరిలోకి దిగిన సాత్విక్ జంట సెమీస్ చేరింది. అయితే, చిరాగ్ వెన్నునొప్పితో బాధపడడంతో మళ్లీ రెండు నెలలు ఆటకు దూరమైంది. జనవరిలో రీఎంట్రీ ఇచ్చిన ఈ జోడీ.. మలేసియా ఓపెన్, ఇండియా ఓపెన్‌లో సెమీస్ చేరింది. క్రమంగా పరిస్థితులు గాడిలో పడుతున్న సమయంలో ఫిబ్రవరిలో సాత్విక్ తండ్రి మరణం విషాదాన్ని మిగిల్చింది. చిరాగ్‌తో కలిసి ఖేల్‌రత్న అవార్డు అందుకునేందుకు వెళ్తున్న సమయంలో సాత్విక్ తండ్రి కాశీ విశ్వనాథం గుండెపోటుతో మరణించాడు. ఈ విషాదం నుంచి తేరుకొని బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ ఫైనల్స్‌లో సాత్విక్ జంట పోటీపడ్డా.. ఆ టోర్నీలో రాణించలేకపోయింది. ఇలా ఎన్నో అడ్డంకులను అధిగమిస్తూనే సాత్విక్, చిరాగ్ ద్వయం వరల్డ్ చాంపియన్‌షిప్‌నకు సిద్ధమైంది. కానీ, ఈ టోర్నీలో మాత్రం ఎక్కడా తడబడకుండా సెమీస్‌దాకా చేరి పతకాన్ని ఖాయం చేసుకుంది. ప్రీక్వార్టర్స్‌లో ఆరో సీడ్, చైనా జోడీ లియాంగ్-వాంగ్ చాంగ్‌లను ఓడించిన సాత్విక్ ద్వయం.. క్వార్టర్స్‌లో ఆరోన్ చియా-సో వూ యిక్ జోపై నెగ్గిన తీరు అద్భుతం. ఇక, సెమీస్‌లో ఓడినా, ఓవరాల్‌గా రెండో ప్రపంచ పతకంతో సాత్విక్ జంట కెరీర్‌లో మరో మెట్టు పైకెక్కింది.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

నీరజ్ నేతృత్వంలో..

- ప్రపంచ అథ్లెటిక్స్‌కు 19 మందితో భారత జట్టు

న్యూఢిల్లీ: ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో తలపడే భారత జట్టును ఆదివారం ప్రకటించారు. 19 మంది సభ్యుల బృందానికి స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా నాయకత్వం వహిస్తాడు. ఈ చాంపియన్‌షిప్ సెప్టెంబరు 13 నుంచి 21 వరకు టోక్యోలో జరగనుంది. అయితే దేశ చరిత్రలో తొలిసారి నలుగురు జావెలిన్ త్రోయర్లు..నీరజ్, సచిన్ యాదవ్, యశ్వీర్ సింగ్, రోహిత్ యాదవ్ ప్రపంచ పోటీల బరిలో దిగుతుండడం విశేషం. ఇక మొత్తం జట్టులో నలుగురు మహిళా అథ్లెట్లున్నారు. గత..2023 హంగేరి వరల్డ్ చాంపియన్‌షిప్‌లో భారత్‌నుంచి 28 మంది పోటీపడ్డారు.

సెమీస్‌లో నార్త్, సెంట్రల్ జోన్లు

బెంగళూరు: దులీప్ ట్రోఫీలో నార్త్ జోన్, సెంట్రల్ జోన్ జట్లు తమ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం ద్వారా సెమీస్‌లో ప్రవేశించాయి. ఆదివారం ఈస్ట్ జోన్‌తో ముగిసిన క్వార్టర్స్‌ను నార్త్ జోన్ డ్రాగా ముగించింది. మూడో రోజే 563 పరుగుల భారీ ఆధిక్యం దక్కించుకున్నప్పటికీ నార్త్ తమ ఆటను కొనసాగించింది. ఈ క్రమంలో ఆయుష్ బదోని (204) డబుల్ సెంచరీ సాధించగా, కెప్టెన్ అంకిత్ (198) తృటిలో ఈ ఫీట్ మిస్సయ్యాడు. ఇక రెండో ఇన్నింగ్స్‌లో 658/4 స్కోరు వద్ద నార్త్ జోన్‌డిక్లేర్ చేయడంతో ఇరుజట్లు డ్రాకు అంగీకరించాయి. దీంతో తొలి ఇన్నింగ్స్ 833 పరుగుల ఆధిక్యంతో నార్త్ సెమీస్ చేరింది. ఈస్ట్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 230 రన్స్ చేసింది. సెంట్రల్ జోన్-నార్త్ ఈస్ట్ జోన్ మధ్య క్వార్టర్స్ కూడా డ్రాగా ముగిసింది. అయితే 478 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో సెంట్రల్ జోన్ సెమీస్‌లో అడుగుపెట్టింది. ఆదివారం ఆఖరి రోజు నార్త్ ఈస్ట్ రెండో ఇన్నింగ్స్‌లో 200/6 స్కోరు చేసింది.

రషీద్‌కు చోటు: స్పిన్నర్ సాయి కిశోర్ గాయంతో దూరమవడంతో అతని స్థానంలో ఆంధ్ర యువ బౌలర్ షేక్ రషీద్‌ను సౌత్ జోన్ జట్టులోకి తీసుకున్నారు. ఇక, తిలక్ వర్మ ఆసియా కప్‌లో ఆడనుండడంతో.. అతని స్థానంలో సెమీస్‌కు సౌత్ జోన్ కెప్టెన్‌గా అజారుద్దీన్‌ను నియమించారు.

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 1-9-2025

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | విజయవాడ సిటీ**

నిమజ్జన వేడుకల్లో అపశ్రుతులు

వేర్వేరు జిల్లాల్లో 9 మంది దుర్మరణం

నరసాపురంలో ట్రాక్టర్ ఢీకొని నలుగురు..

పాడేరులో స్కార్పియో ఢీకొని ఇద్దరు..

నెల్లూరు జిల్లాలో ఇద్దరు, అనంతలో ఒకరు..

12



అల్లూరి జిల్లా పాడేరులో జనంపైకి దూసుకొచ్చిన స్కార్పియో

సీఎం సీబీఎన్ @30

నారా చంద్రబాబునాయుడు అనే నేను..



తొలిసారి ముఖ్యమంత్రి అయి నేటికి ముప్పై ఏళ్లు

పలుమార్లు పడిలేచిన కెరటంగా సంచలనం

సంక్షోభాల నుంచి ప్రపంచ స్థాయికి ఎదిగిన వైనం

పాతాళానికి పడినా.. ఆకాశమే హద్దుగా ఎదిగే తత్వం

విద్యార్థి దశ నుంచే రాటుదేలిన నాయకుడు

ఎక్కడున్నా కింగ్ మేకర్ పాత్ర.. సీఎంగా టెక్నాలజీని కొత్త పుంతలు తొక్కించిన ఘనత

ఫ్యూచర్ విజన్‌తో ఎన్నెన్నో వినూత్న పథకాలు

నాటి హైటెక్ సిటీ నుంచి నేటి క్వాంటమ్ వ్యాలీ దాకా

నేడు విధ్వంస ఏపీని గాడినపెట్టేందుకు కృషి

అదే సమయంలో సంక్షేమానికి పెద్దపీట

అన్నీ అనుకూలిస్తే అధికార పీఠంపై కూర్చోవడం పెద్ద కష్టమేమీ కాదు. కానీ ప్రతికూల పరిస్థితులను కూడా అనుకూలంగా మలచుకుంటూ అధికార పీఠాన్ని అధిష్ఠించగలగడమే అసలైన విజయం. ఓటములను, అవమానాలను ఎదుర్కొంటూ అధికార మంత్రదండాన్ని అందుకోవడం ఆషామాషీ కాదు. అన్నింటినీ అధిగమించి లక్ష్యాన్ని చేరుకున్నవాడే అసలైన విజేత. అలా లక్ష్య ఛేదన చేసిన నాయకుడు నారా చంద్రబాబు నాయుడు. ఆయన మొదటిసారి 1995 సెప్టెంబరు 1న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎంగా పదవీప్రమాణం చేశారు. అది జరిగి నేటికి ముచ్చటగా మూడు దశాబ్దాలు పూర్తయ్యాయి. ఈ ప్రయాణంలో ఎన్నో విజయాలు.. మరెన్నో సంచలనాలు. నాటి హైటెక్ సిటీ నుంచి నేటి 'స్వర్ణాంధ్ర విజన్ -2047' వరకు చేపట్టే ప్రతి ప్రాజెక్టూ ఆయన ముందుచూపునకు దర్పణాలే. సంక్షోభాలకు ఎదురీది.. అవకాశాలను అందిపుచ్చుకుని రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగడం ఆయన నైజం. ఓటములెదురైనా మొక్కవోని ధైర్యంతో, ప్రతిసారీ మరింతగా బలాన్ని కూడగట్టుకొని పైకి లేవడం ఆయనకే చెల్లింది!!

ప్రత్యేక కథనం.. 11లో

ఈ స్టేజ్ నుంచి..



ఎస్వీ యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థి నాయకుడిగా చంద్రబాబు

ఈ స్టేజ్‌కు..



1995 సెప్టెంబరు 1న చంద్రబాబుతో సీఎంగా ప్రమాణస్వీకారం చేయిస్తున్న నాటి గవర్నర్ కృష్ణకాంత్



ఎస్‌సీవో సదస్సులో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో మోదీ కరచాలనం

స్వదేశీ ఉత్పత్తులే ముద్దు!

సుంకాల వేళ మోదీ పిలుపు

ఆత్మనిర్భరతతో అగ్రదేశంగా మారదాం!

బహుమతులు, వస్త్రాలు, అలంకార సామగ్రి, దేశీయ వస్తువులనే వాడండి

'మన్ కీ బాత్'లో ప్రధాని

9

సరిహద్దు లేని బంధం

సమస్యను సహేతుకంగా తేల్చుకుందాం

సరిహద్దు సమస్య మన బంధానికి అడ్డురావొద్దు

ఇరుదేశాల మధ్య వాణిజ్యం పెంచుకుందాం

శత్రువుల్లా కాదు.. అభివృద్ధి భాగస్వాములుగా

రాజకీయ, వ్యూహాత్మక కోణంలో సాగుదాం

ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ నిర్ణయం

బంధం బాగుండాలంటే శాంతి, స్థిరత్వం ముఖ్యం

పరస్పర నమ్మకం, గౌరవంతో ముందుకెళదాం

మన బంధాలను మూడో దేశం కోణంలో చూడొద్దు

భారత్, చైనా మధ్య సహకారం

మానవాళి సంక్షేమానికి మార్గం వేస్తుంది: మోదీ

భారత్-చైనా స్నేహితులుగా ఉండడమే మంచిది

డ్రాగన్, ఏనుగు కలిసి డ్యాన్స్ చేయాలి: జిన్‌పింగ్

వచ్చే ఏడాది భారత్‌లో జరిగే బ్రిక్స్ సదస్సుకు రావాలని జిన్‌పింగ్‌కు మోదీ ఆహ్వానం

బ్రిక్స్ అధ్యక్షత కోసం భారత్‌కు జిన్‌పింగ్ మద్దతు

టియాంజిన్ (చైనా), ఆగస్టు 31: భారత్, చైనా మధ్య సరిహద్దు వివాదాలకు సహేతుకమైన, పరస్పర అంగీకారంతో కూడిన పరిష్కారం కనుగొనేందుకు కృషి చేయాలని ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ నిర్ణయానికి వచ్చారు. ఇరుదేశాల వాణిజ్య బంధాన్ని మరింత బలోపేతం చేసుకునే చర్యలపై అంగీకారానికి వచ్చారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీరుతో ప్రపంచవ్యాప్తంగా వాణిజ్య అస్థిరత నెలకొన్న సమయంలో మోదీ, జిన్‌పింగ్ భేటీలో వాణిజ్యంపై ప్రత్యేకంగా చర్చించడం ప్రాధాన్యం సంతరించుకుంది. షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సీవో) సదస్సులో పాల్గొనేందుకు చైనా వెళ్లిన

మిగతా 9వ పేజీలో...

అమెరికా కాలేజీలు కుదేలు!

విదేశీ విద్యార్థుల రాకకు బ్రేక్

రూ.61 వేల కోట్ల రాబడికి గండి

ట్రంప్ విధానాలతో తీవ్ర నష్టం

బైరాగి సంశయ పథం

"నాకు తెలుసు నాకు తెలుసు
ప్రళయవేదనా పంకిల ప్రపంచ పథం మధ్య
ప్రేమలు పొసగవనీ
ఈ బండరాళ్లపైన ఏ మొక్కలూ ఎదగవనీ
మనమంతా చీకటిలో ఆకటితో పోరాడే
అస్వతంత్ర సైనికులమనీ..." అంటూ అసమ జీవితాలను కవిత్వంగా మలచినవాడు ఆలూరి బైరాగి. ఆయనకు ఇది శత జయంతి సంవత్సరం. వెంకట్రాయుడు సరస్వతమ్మ దంపతులకు 1925 సెప్టెంబర్ 5న తెనాలి దగ్గర ఐతానగరంలో జన్మించాడు బైరాగి. పాఠశాలకు వెళ్లి చదువుకున్నది రెండవ తరగతి వరకు మాత్రమే. తండ్రి దేశభక్తుడు అవడంతో బైరాగిని హిందీ చదువుకోమని ప్రోత్సహించాడు. ఎలమంచిలి వెంకటప్పయ్య స్థాపించిన హిందీ పాఠశాలలో చదువుకుంటూ తరువాత హిందీలో ఉన్నత విద్యను అభ్యసించడానికి ఉత్తర భారతం వెళ్ళాడు బైరాగి. హిందీ భాషా సాహిత్యాలను చదువుకుంటున్న ప్రాథమిక దశలోనే హిందీలో కవిత్వం రాయడం ప్రారంభించాడు. బిహార్ లోని ముజఫర్‌పూర్‌లో జరిగిన కవి సమ్మేళనంలో 15వ కేటనే పాల్గొని హిందీ సాహిత్య ప్రముఖులతో ప్రశంసలు అందుకున్నాడు. తొలి నాళ్లలో రాసిన హిందీ కవితలు అన్నింటిని కలిపి 'పలాయన్' పేరుతో కవితా సంపుటిని ప్రచురించాడు. తెనాలి తిరిగి వచ్చిన బైరాగి గుంటూరుకు సమీపంలోని పత్తిపాడులో హిందీ ఉపాధ్యాయుడుగా చేరాడు. 1942లో స్వాతంత్ర్యం కోసం గాంధీజీ పిలుపుమేరకు జరుగుతున్న క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నాడు. ఆ తరువాత ఎం.ఎన్. రాయ్ రాడికల్ హ్యూమనిజం ప్రభావానికి లోనై రాడికల్ డెమోక్రటిక్ పార్టీలో కొంత కాలం పనిచేశాడు.

తెలుగులో పిల్లల మాసపత్రికగా అత్యంత ఆదరణ పొందిన 'చందమామ'ను హిందీలో కూడా ప్రచురించాలని నిర్వాహకులు అనుకున్నప్పుడు, వారిలో ఒకరైన ఆలూరి చక్రపాణి తన అన్న కుమారుడైన బైరాగిని ఆ పత్రికకు సంపాదకత్వ బాధ్యతలు నిర్వహించడానికి ఆహ్వానించాడు. అలా బైరాగి హిందీ 'చందమామ'కు తొలి సంపాదకుడయ్యాడు. అయితే తొలి నుంచి ఎటువంటి కట్టుబాట్లకు నియమ నిబంధనలకు లొంగి ఉండే అలవాటు లేని కారణాన, ఆ పత్రికలో ఎక్కువ కాలం కొనసాగ లేకపోయాడు. నెల పొడవునా చేయాల్సిన పనిని వారం రోజుల్లో ముగించి తనకి ఇష్టమైనవి చదువుకుంటూ గడపడం బైరాగి బాబాయి చక్రపాణికి నచ్చలేదు. దానితో చందమామకు రాజీనామా చేసి తిరిగి తెనాలి చేరుకున్నాడు. 'చందమామ'లో పనిచేసిన కాలంలో బాలల కోసం అనేక రచనలు చేశాడు. పిల్లల గేయాలు రాసేటప్పుడు బైరాగి భాష సులభ గ్రాహ్యంగా, అలతి అలతి పదాలతో ఉండడం గమనార్హం: "చీకటి పడింది తల్లి దీపం చూపవేలనే/ మాకై దీపం చూపవేలనే/ ఆటపాటల ప్రొద్దు బుచ్చినవి/ పిట్టలు గూటికి తిరిగి వచ్చినవి/ రెక్కలార్చి పవలెల్ల నొచ్చినవి/ సంజమసక నిన్ను దరియ వచ్చితిమి కోపమేలనే/ మాకై దీపం చూపవేలనే/ పాపపుణ్యములు పరిచిన బాటలు/ కూడని వేడుక కూడిన చోటులు/ పయనించాం మా పసి చెలగాటాల/ మలిన దేహంలము చల్లని చేతులు చూపవేలనే" ఇలా ఉంటుంది ఆ శైలి.

జీవించి ఉన్నంతకాలం బైరాగి కవితా లోకానికి దూరంగానే ఉండిపోయాడు. దానికి ప్రధాన కారణం ఆయన కవిత్వంలో చూపిన స్వతంత్ర, స్వేచ్ఛాతత్వం. ఆయనది ఏ ఇజానికీ లొంగని నవ్య మానవతా దృక్పథం అనుకోవచ్చు. పత్తిపాడులో పని చేస్తున్నప్పుడూ, అంతకంటే ముందు కాలం లోనూ రాసిన కవితలు అన్నింటినీ 'చీకటి నీడలు' పేరుతో కవితా సంపుటిగా తెచ్చాడు. బైరాగి కవిత్వం ఆధునిక నవ్య కవిత వాదాన్ని ముందుకు తెచ్చింది. శ్రీశ్రీ అభ్యుదయ కవితా జ్వాలలు, కృష్ణశాస్త్రి భావ కవితా వీచికలకు భిన్నంగా బైరాగి తనదైన కవిత్వాన్ని పాఠక లోకానికి అందజేశారు. అప్పటికే ఉగాది, దీపావళి లాంటి పండుగలకు సందర్భోచిత కవిత్వం రాయడం కవులకు పరిపాటి అయింది. అయితే బైరాగి కొత్త ధోరణితో దీపావళి కవితను రాశారు: "దీపావళి ఉత్సవమండి/ దీపావళి చేద్దాం రండి/ ఆకాశం మండిద్దామా/ పాతాళం తగలేద్దామా/ దీపావళి చేద్దామా/ నరకాసురు డెందుకు ప్రపంచ/ నరకాన్నే మసీ చేద్దామా/ కాటుకలా నల్లని చీకటి/ జ్యోతుల బంధించిన వాకిటి/ తలుపులు పగలేద్దామా" ఇలా– ఇక్కడ దీపావళి ఏ ఆనందాల కోసం జరుపుకుంటున్నామో అవి అందరివీ కాదనీ, ప్రపంచమంతా ఇంకా నరక కూపం లోనే ఉందనీ, ఆ నరకాన్ని మసి చేసే దీపావళిని జరుపుకుందామనీ ఇక్కడ పిలుపు ఇస్తున్నాడు.

బైరాగి 'నూతిలో గొంతుకలు' ఒక సంశయాత్మక కావ్యం. దీనిలో మానవుడు "ఏది త్రోవ?" అని అడుగుతాడు. అనేక ఆవేదనలతో నడుస్తున్న జీవితంలో ఏది కర్మ, ఏది కర్మ క్షేత్రంలో తక్షణికం, ఏది కర్మ తరువాత బాధ అనే అంశాలను షేక్స్పియర్ నాటకంలోని 'హామ్లెట్', మహాభారతంలోని 'అర్జునుడు', క్రైమ్ అండ్ పనిష్మెంట్ నవలలోని 'రాస్కోల్నికోవ్' పాత్రల ద్వారా చర్చకు పెడతాడు.

బైరాగి కవితలలో నైరాశ్యం, నిస్పృహ, ఆత్మ చింతన ప్రస్ఫుటంగా కనబడుతుంది. అయితే ఆయన నైరాశ్యం మనసును కిందకు లాగివేసేది కాదు. అంతరాత్మను తొలగించే ప్రభంజనం లాంటిది అంటాడు పాలగుమ్మి పద్మరాజు. ఆనాటి కవిత్వావరణంలో తాను ఇమడలేనని, తన బాట వేరని అంటూ, "నేను మీ కవిని కాను" అని ప్రకటించుకున్నాడు బైరాగి. "నాదాల, నినాదాల, వివాదాల బాణ సంచాలు ప్రేల్చడానికి/ రంగు రంగుల మతాబాలు కాల్చడానికి/ చిలుకలాగు సూక్తులు పలకడానికి/ శాక్రిన్ తేనె సోన లొలకడానికి/ మహామహులకు అభినందన వందనలు తెలపటానికి/ ఇష్టం లేని కృపణప్రశంసల తీయని విషం కలపటానికి/ నేను మీ కవిని కాదు" అంటాడు.

జీవించి ఉన్నంత కాలం బైరాగి కవితా లోకానికి దూరంగానే ఉండిపోయాడు. దానికి ప్రధాన కారణం ఆయన కవిత్వంలో చూపిన స్వతంత్ర, స్వేచ్ఛాతత్వం. ఆనాటి కవిత్వావరణంలో తాను ఇమడలేనని, తన బాట వేరని అంటూ, "నేను మీ కవిని కాను" అని ప్రకటించుకున్నాడు.

"నిధనం వంటి ధనం చేసే సత్కారాలు, సన్మానాలు/ జరీ అంచుల శాలువాలు, చందన తాంబూలాలు, పూలగుత్తులు, హారాలు/ కవితాసతి శవసంస్కృతి క్రతువులోన తీరని అవమానాలు/ నేవలచిన ఈ మృణాలదేహానికి చేజేతుల నిప్పుపెట్టలేను నేను/... /జీవిత మహిత జనక దుహిత స్వయంవర సమరంలోన/ పినాకాన్ని తృణంలాగ త్రుంచిన నేను/.../ దీనంగా మౌనంగా నేడు వేడుకుంటున్నాను. /నేను మీ కవిని కాను," అంటాడు.

బైరాగి మరణం తరువాత ఆయన పెట్టె లోని రచనలన్నీ వెలికితీసి 'ఆగమగీతి' పేరుతో ప్రచురించారు. దీనికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. ఒంటరితనాన్ని ప్రేమించిన బైరాగి మిత్రులు ఎవరినీ దగ్గరకు రానిచ్చేవాడు కాదు. చివరి రోజుల్లో హైదరాబాద్‌లో తమ్ముని దగ్గర ఉన్నప్పుడు గదిలోంచి బయటకు వచ్చేవాడు కాదు. అప్పటి తన స్థితిని గూర్చి 'త్రిశంకు స్వర్గం' అనే కవితలో: "గాలిరాని చీకటి గదిలో/ మారుమూల మదిలో/ నిర్మించిన మహా ప్రపంచం; నేను విరించిని –/ భారంగా వ్రేలాడే సిగరెట్ పొగ, పారాడే బండరాయి/ చీకటితో పోరాడే వెలుతురులో నోరాడని కటిక దుమ్ము/ భూమ్యాకాశాలమధ్య అ త్రిశంకు స్వర్గంలో/ తారాడే సాలీడుకు ఈడు జోడు వాడు వీడు/ చాప మీద పొరలాడే నరాధముడు" అంటూ తన ఉనికిని ప్రకటించుకున్నాడు. బైరాగి కవిత్వం, ఆయన భాషాపటిమ, వాక్యనిర్మాణం ఈనాటి తరానికి ఒక గైడ్ లాగా ఉపయోగపడతాయి.

(సెప్టెంబర్ 5న ఆలూరి బైరాగి శతజయంతి)

■ బండ్ల మాధవరావు



సోమవారం 1 సెప్టెంబరు 2025

వివిధ

vividha@andhrajyothy.com

సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్

'త్రివేణి' కవిత్వ సంపుటి

వారాల ఆనంద్ కవితా సంపుటి 'త్రివేణి' (మూడు పంక్తుల కవిత్వం) ఆవిష్కరణ సెప్టెంబర్ 1 న కరీంనగర్ లోని కార్ఖానగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతుంది. పాఠశాల ఉపాధ్యాయుడు, సాహితీ గౌతమి అధ్యక్షుడు నంది శ్రీనివాస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. పుస్తకాన్ని హిందీ ఉపాధ్యాయుడు ఉడుత రాజేశం ఆవిష్కరిస్తారు. పలువురు కవులు హాజరవుతారు.

వి. ఇందిరా రాణి

ఉదారి నాగదాసు కవితా పురస్కారం

ఉదారి నాగదాసు స్మారక కవితా పురస్కారాన్ని 2025 సంవత్సరానికిగాను ప్రముఖ కవయిత్రి తోట నిర్మలారాణి స్వీకరిస్తారు. సెప్టెంబర్ 7న ఆదిలాబాద్‌లో అవార్డు ప్రదానోత్సవం జరుతుంది. అవార్డు కింద రూ.5వేల నగదు, ప్రశంసా పత్రం అందజేస్తారు. మరిన్ని వివరాలకు: 9441413666.

ఉదారి నారాయణ

దీర్ఘకవితల పోటీలు

రాయలసీమ సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో దీర్ఘ కవితల పోటీలను తిమ్మాపురం బాలకృష్ణారెడ్డి స్మారకంగా నిర్వహిస్తున్నాం. రాయలసీమ నేపథ్యంగా, దీర్ఘ కవితా లక్షణాలతో నవంబర్ 1 లోపు కవితలను పంపాలి. మరిన్ని వివరాలకు 9963917187నంబరులో సంప్రదించగలరు. న్యాయనిర్ణేతల నిర్ణయం మేరకు మొత్తంగా రూ.15వేల నగదును బహుమతులుగా అందచేస్తాం.

అప్పిరెడ్డి హరినాథరెడ్డి

విశ్వనాథ నవలలపై సదస్సు

విశ్వనాథ సాహిత్య అకాడమి – వివిఐటి విశ్వవిద్యాలయం, నంబూరు సంయుక్త నిర్వహణలో 'విశ్వనాథ పథంలో యువత' శీర్షికతో విశ్వనాథ సత్యనారాయణ నవలా సాహిత్యంపై నేటి యువత దృక్పథం – పత్ర సమర్పణ సదస్సు సెప్టెంబర్ 7 ఉ.9.45ని.ల నుండి శ్రీ త్యాగరాజ సాంస్కృతిక సంఘం, లక్ష్మీపురం, గుంటూరులో జరుగుతుంది. మద్దినేని సింహకౌటిల్య చౌదరి, విశ్వనాథ సత్యనారాయణ (విశ్వనాథ మనుమడు), పిన్నమనేని మృత్యుంజయరావు, అబ్బరాజు మైథిలి, హేలీకళ్యాణ్ తదితరులు పాల్గొంటారు.

మోదుగుల రవి

అనిశెట్టి రజితపై సమాలోచన

అనిశెట్టి రజిత జీవితం-సాహిత్యంపై సమాలోచన కార్యక్రమం సెప్టెంబరు 2 సా.5గంటలకు రవీంద్ర భారతి కాన్ఫరెన్స్‌హాల్, హైదరాబాద్‌లో జరుగుతుంది. సభాధ్యక్షుడు నామోజు బాలాచారి, ముఖ్య అతిథి ముదిగంటి సుజాతా రెడ్డి, గౌరవ అతిథి నందిని సిధారెడ్డి, విశిష్ట అతిథి సంగిశెట్టి శ్రీనివాస్, ఆత్మీయ అతిథి జూపాక సుభద్ర, వక్తలు తిరునగరి దేవకీ దేవి, నెల్లుట్ల రమాదేవి, బ్రహ్మచారి, గిరిజ పైడిమర్రి.

భండారు విజయ

సాహిత్యకారులు సినిమాకి రాస్తే...

మంచి సాహిత్యం అనేది మానవ అనుభవాల, భావోద్వేగాల, తాత్త్విక ఆలోచనల సమాహారం. అది కేవలం పుస్తకాల్లో మాత్రమే బంధించబడదు. ఒక అద్దంలా గతాన్ని ప్రతిబింబించి, వర్తమానం మీద నిలబెట్టి, భవిష్యత్తుకు మార్గదర్శనం చేస్తుంది. అదే విధంగా సినిమా కూడా సమాజానికి అద్దం లాంటిది. అది సాహిత్యం కంటే బలమైన ప్రభావాన్ని సమాజం మీద చూపిస్తుంది. దృశ్యరూపంలో, శ్రవ్య రూపంలో, తక్షణ ప్రభావంతో మనసును కదిలిస్తుంది. ఈ రెండు కళా మాధ్యమాలు కలిసినప్పుడు పుట్టేది ఒక బలమైన సృష్టి. అది వినోదానికో విలాసానికో పరిమితం కాకుండా కాలానికి సాక్ష్యంగా నిలిచి కదలి కదిలించే గొప్ప కృతి అవుతుంది.

తెలుగు సినీ చరిత్రలో సాహిత్యకారుల పాత్ర ఆరంభం నుంచే ఉంది. భావుకత నిండిన గీతాలతో ఆత్రేయ, పద మాంత్రికతతో రాసిన పాటలతో ఆరుద్ర, దాశరథి, శ్రీశ్రీ, సినారె మొదలైన వారు సినిమాలకు వచ్చి తమదైన ముద్ర వేసి ప్రేక్షకుల మనసు దోచుకున్నారు. చలం, పాలగుమ్మి పద్మరాజు, కారా, అంపశయ్య నవీన్ వంటి వారి రచనలు సినిమాలుగా మారాయి. ఉన్నవ, తాపీ ధర్మారావు, గురజాడ, దేవులపల్లి, మల్లాది, త్రిపురనేని, విశ్వనాథ వంటి వారి సాహిత్యం ప్రత్యక్షంగానో పరోక్షంగానో సినిమాల్లో ప్రతిబింబించింది. సాహిత్యపు పద ప్రయోగ నైపుణ్యమైన జంధ్యాల హాస్యం, వ్యంగ్యం వెండితెరపై మెరిసింది.

మొదట భక్తిరస ప్రధానంగా ప్రారంభమైన తెలుగు సినిమా, క్రమంగా రైతుజీవితం, మధ్యతరగతి సమస్యలు, మానవ సంబంధాలను చూపింది. 1980లలో సంగీత భరితమైన భక్తి రస చిత్రాలు మళ్లీ పుంజుకున్నాయి. అప్పటివరకు సాహిత్యకారులు సినిమా వెంటే నడిచారు. కానీ తర్వాతి కాలంలో కమర్షియల్ ధోరణులు బలపడ్డాయి. ఫైట్లు, పాటలు, గ్లామర్, హీరోయిజం ప్రధానమయ్యాయి. సీరియస్ సాహిత్యం వెనుకబడ్డది. మంచి సాహిత్యం రాసే రచయితలకు సినిమాలకు మధ్య దూరం పెరిగింది. హీరో అభిమానం, వందల కోట్ల బడ్జెట్, వ్యక్తి పూజ ఇవన్నీ కొత్త ధోరణులుగా వెలిశాయి. ఈ మార్పులతో తెలుగు సినిమా రూపమే మారిపోయింది. జీవితాలను చూపకుండా వినోదం పేరుతో రొటీన్ ప్రేమ ఫార్ములాతో, హింస, మసాలాలు దట్టించిన సినిమాలే విజయాలను సాధించాయి. అలాంటి తెలుగు సినిమా నేల దిగడానికి చాలా సంవత్సరాలు పట్టింది.

ఐతే ఇన్ని వ్యాపార వాణిజ్య ఒత్తిళ్ల మధ్యలో కూడా టి. కృష్ణ, ముత్యాల సుబ్బయ్య బి.నర్సింగరావు లాంటి ఎందరో దర్శకులు సాహిత్య విలువలు నిలబెట్టారు. టి. కృష్ణ సినిమాలు సామాజిక న్యాయం, వర్గపోరాటం, సమానత్వం అంశాలను కేంద్రీకరించగా, ముత్యాల సుబ్బయ్య తన సినిమాల్లో మానవ సంబంధాల సున్నిత కోణాలను చూపించారు. బి. నర్సింగరావు తెలంగాణ వాస్తవిక జీవితాలను, భాషను తెరకెక్కించాడు. అప్పుడప్పుడు చుక్క తెగిపడ్డట్టు కొన్ని సినిమాలు సామాజిక స్పృహను కలిగి సంభాషణల్లో కవిత్వ మాధుర్యాన్ని భావుకతను అందించాయి.



ఓటీటీ ప్లాట్‌ఫారమ్‌ల ఆవిర్భావం తెలుగు సినిమాకు కొత్త దిశను చూపింది. ప్రపంచ సినిమాలను చూడగల అవకాశం ప్రేక్షకులకు లభించింది. వారి అభిరుచి మారింది. దీంతో రచయితలు దర్శకులు పూర్తి స్వేచ్ఛతో సాహిత్య విలువలు ఉన్న సినిమాలను తీసే అవకాశం వచ్చింది. ఇది సాహిత్య ఆధారిత చిత్రాలకూ రచయితలకు ఒక కొత్త దారిని చూపింది.

తెలుగుతో పోల్చి చూసినప్పుడు తమిళ చిత్రసీమలో సినిమాకీ సాహిత్యానికీ సంబంధం మరింత బలంగా ఉంది. జయకాంతన్ నవలలు సామాజిక వాస్తవాలను అద్దంలా చూపించాయి. భారతిరాజా గ్రామీణ సాహిత్య సుగంధం అద్దిన కథలతో సినిమాలు తీశారు. మణిరత్నం చిత్రాల్లో జయమోహన్ రాసిన సంభాషణలు తాత్త్విక లోతును, మానవ సంబంధాల సంక్లిష్టతను ఆవిష్కరించాయి. మలయాళ సినీ రంగం సాహిత్యాధారిత చిత్రాలకు ఆదర్శంగా నిలిచింది. ఎం.టి. వాసుదేవన్ నాయర్ స్క్రిప్టులు మానవ జీవితాల సంఘర్షణను లోతుగా చూపించాయి. వయలార్, బషీర్ రచనలు సినిమాల్లో మానవతా విలువలను నింపాయి. అక్కడి సినిమాలు కేవలం వినోదపు సినిమాలు కావు. వాస్తవికత, మానవత్వం సమానంగా కలిసిన జీవన వాస్తవ చిత్రాలు.

కరోనా తర్వాత ఓటీటీ ప్లాట్‌ఫారమ్‌ల ఆవిర్భావం తెలుగు సినిమాకు కొత్త దిశను చూపింది. ప్రపంచ సినిమాలను చూడగల అవకాశం ప్రేక్షకులకు లభించింది. తమిళం, మలయాళం చిత్రాల బలమైన కథనశైలిని నూతనత్వాన్ని, జీవన వాస్తవికతను మన ప్రేక్షకులు ఆస్వాదించారు. వారి అభిరుచి మారింది. దీంతో చిన్న సినిమాలు, చిన్న దర్శకులు కూడా వెండితెర మీద నిలబడే అవకాశం పొందారు. రచయితలు దర్శకులు పూర్తి స్వేచ్ఛతో సాహిత్య విలువలు ఉన్న సినిమాలను తీసే అవకాశం వచ్చింది. ఇది సాహిత్య ఆధారిత చిత్రాలకూ రచయితలకు ఒక కొత్త దారిని చూపింది. కథా బలం ఉన్న 'కంచరపాలెం', 'మల్లేశం' లాంటి సినిమాలు, మానవతా విలువలకు పట్టంగట్టిన 'బలగం'లాంటి సినిమాలు ఎలాంటి ప్రచారాల ఆర్భాటం లేకుండా ప్రేక్షకుల మన్ననలను పొందాయి. సాహిత్యకారులు సినిమాలకు రాస్తే ఎలాంటి సినిమాలు వస్తాయో చెప్పడానికి వీటి విజయమే ఒక ఉదాహరణ.

ఓటీటీతో ప్రపంచవ్యాప్త ప్రేక్షకులు అందుబాటు లోకి వచ్చారు. మార్కెట్ పరిమితులు తగ్గుతున్నాయి. ఈ కాలంలో ఒక గొప్ప సాహిత్యకారుడు సినిమాకి రాస్తే, కథలో మానవీయ లోతు, సంభాషణల్లో కవిత్వం, పాత్రల్లో ఆత్మ, దృశ్యాల్లో సాంస్కృతిక వైభవం తప్పక ప్రతిబింబిస్తాయి. అయితే కొన్ని అడ్డంకులు లేకపోలేదు. వాణిజ్య ఒత్తిళ్లు, నిర్మాతల లాభనష్టపు లెక్కలు, తక్షణ వినోదం కోరే ధోరణి, ఏండ్లకేండ్లుగా రొటీన్ ప్రేమ కథల ఫార్ములాలు ఉన్నాయి. ఇవే తెలుగు సినిమాలో మంచి రచయితలను లేకుండా చేసాయి. కానీ సాహిత్యానికి ప్రాధాన్యం ఇచ్చే ప్రేక్షకులు పెరిగితే, పుస్తక పఠనం అలవాటు విస్తరించితే, నిర్మాతలు కూడా వెనుకడుగు వేయరు. ప్రభుత్వం, సాంస్కృతిక సంస్థలు సాహిత్య ఆధారిత చిత్రాలకు ప్రోత్సాహం అందిస్తే, భవిష్యత్తులో తెలుగు సినిమాకు మరో సువర్ణయుగం సాధ్యం.

సాహిత్యం లేని సినిమా బలహీనమవుతుంది. సాహిత్యం ఉన్న సినిమా యుగాలను దాటి నిలుస్తుంది. దూరమైన సాహిత్యం – సినిమా కలయిక నేటికీ సాధ్యమే. సాహిత్యకారులు తెరమీద అడుగుపెడితే భాష గౌరవం పెరిగి, లోతు పెరుగుతుంది. ప్రేక్షకులు ఆమోదిస్తే, నిర్మాతలు ప్రోత్సహిస్తే తెలుగు సినీ ప్రపంచం మరోసారి సాహిత్య సువాసనతో పరిమళించే రోజులు ఎంతో దూరంలో లేవు.

■ పెద్దింటి అశోక్ కుమార్
✆ 94416 72428

విమర్శ నన్ను విశాలం చేసింది!

రెంటాల శ్రీ వెంకటేశ్వర రావు కవిత్వం, గజళ్ళు, సమీక్షలు, అనేక విమర్శా వ్యాసాలు రాశారు. 'ఫౌంటెన్ హెడ్', 'అట్లాస్ ష్రగ్‌డ్' వంటి పాపులర్ అనువాదాలు చేశారు. సునిశిత పరిశీలనకు ఆయన ప్రసంగాలు పెట్టింది పేరు. ఆయన పీహెచ్‌డీ పరిశోధనా గ్రంథం 'ఆధునిక తెలుగు సాహిత్యంలో అధిక్షేప ధోరణులు' విలక్షణమైనది. 'వౌలుపు', 'లోపలికి', 'వెలుతురు' అనే ఆయన వ్యాస సంపుటాలు ప్రతి ఒక్కరు చదవాల్సినవి. రెంటాల ఈ సెప్టెంబరు 7న కాకినాడలో అద్దేపల్లి రామమోహనరావు సాహిత్య విమర్శా పురస్కారం అందుకుంటున్న సందర్భంగా ఆయనతో ఈ సంభాషణ.



మీరు అనేక సాహిత్య ప్రక్రియల్లో కృషి చేశారు కదా. మీకు ఏది బాగా ఇష్టమైనది ?

రాసినవన్నీ ఇష్టం గానే రాశాను. ఎక్కువగా రాసింది మటుకు విమర్శే హైస్కూలు రోజుల్లో కథా రచయితని కావాలని ఉండేది. కాలేజీ రోజుల్లో అదే పనిగా పద్యాలు రాశాను. ఎంఫిల్ పీహెచ్డీ చేసేప్పుడు మాత్రం పరిశోధనా వ్యాసంగంలో సృజనను పక్కన పెట్టాల్సి వచ్చింది.

వర్తమాన తెలుగు సాహిత్యంలో విమర్శ ప్రభావాన్ని ఎలా అంచనా వేయాలి?

ఒక కొత్త సమస్యను గుర్తించినప్పుడు దాని నుంచి కొత్త పోరాటాలు వస్తాయి. అవే సాహిత్యంలో ప్రతిఫలిస్తాయి. ఇది కవిత్వంలో ముందుగా జరుగుతోంది మనకు. దాని వెన్నంటే విమర్శ వచ్చి దాన్ని పరిపుష్టం చేస్తోంది. కానీ బయట నుండి ఏదన్నా ఒక కొత్త ప్రక్రియ వచ్చినప్పుడు మాత్రం విమర్శే ముందుండి అవగాహన కలిగిస్తుంది. ఇందుకు గజల్, హైకూ వంటి ప్రక్రియలే ఉదాహరణ.

ఉర్దూ గజల్‌కి తెలుగు గజల్‌కి తేడా ఏమిటి?

ఆ రెండు భాషలకి, సంస్కృతులకీ ఉన్న తేడానే ఆ గజల్స్‌కి కూడా ఉంది. ఉర్దూ గజల్స్‌లోని కాఫియా, రదీఫ్‌లూ, ప్రతీకలు ఉన్నవి ఉన్నట్టుగా తెలుగులో వాడటం కుదరదు. తెలుగులో గజల్ ఒక సంప్రదాయంగా స్థిరపడే అవకాశం లేదు. మనం కాఫియా బదులు సరైన అంత్యప్రాస వాడుకుంటే చాలు. పైగా మనకి బహార్‌లు (ఉర్దూ లయ యూనిట్లు) పాటించి తీరాల్సిన పనేమీ లేదు. మన మాత్రా ఛందస్సు సరిపోతుంది. తెలుగు గజల్ రచయితలు వస్తువును విస్తరించడం లేదు. కృతకమైన ప్రేమతో తృప్తిపడిపోతున్నారు

మీకు నచ్చిన విమర్శకుడెవరు?

కట్టమంచి మొదలుకొని కృష్ణశాస్త్రి, రాళ్ళపల్లి, సుదర్శనం, రారా, శేషేంద్ర, ఇస్మాయిల్, చేరా ఇలా చాలామంది నాకు ఇష్టం. వీళ్ళందరూ సాహిత్యం పట్ల పాఠకుడి దృష్టిని, రచయిత దృక్పథాన్నీ మలిచిన వాళ్ళు.

కృష్ణశాస్త్రిని విమర్శకుడిగా భావించడం సబబేనా?

తప్పకుండా సబబు. ఆయన 'కృష్ణశాస్త్రి వ్యాసాలు' పుస్తకం చదవండి. ఆయనది కావ్యభాష కావడం చేత, విమర్శ పరిభాష వాడకపోవడం చేత విమర్శకుడిగా గుర్తింపబడ లేదు గానీ, తిరుపతి వేంకట కవులు, పెద్దన, వేమన, బసవరాజు అప్పారావు, ఎడ్గార్ ఎలెన్ పో వంటి వారిపై ఆయన వ్యాసాలు ఎంతో లోచూపు గలవి.

మీ సాహిత్య ప్రస్థానంలో విమర్శ పాత్ర ఏమిటి?

చాలా విషయాలు నాకు విమర్శ వల్లనే స్పష్టమయ్యాయి. కొత్త రచనల్ని అర్థం చేసుకోవడంలో కొత్త అప్రోచ్ అవసరమనే అవగాహనని విమర్శే విశాలం చేసింది. ఆయా రచనల మీద, రచయితల మీద విశ్లేషణలు రాసిన సందర్భాలన్నీ నాకు ఎన్నో పాఠాలు నేర్పాయి. విమర్శ రాయడమంటే ఆలోచించడం, ఎన్నో తెలుసుకోవడం. ఏమి రాసినా వెనుక నుంచి నన్ను ముందుకు నడిపించింది నాలోని విమర్శకుడే.

సాహిత్య విమర్శకుడిగా అద్దేపల్లి రామమోహన రావుని ఎక్కడ స్థిరపరుస్తారు

ఆయన చూపు ఎప్పుడూ వర్తమాన సాహిత్యం పై ఎక్కువగా ఉండేది. సమకాలీన ప్రగతిశీల భావధారలకి గచ్ఛత్ వ్యాఖ్యలవంటి ఎన్నో వ్యాసాలను వెలువరించారు. ఆయన రాసినన్ని పీఠికలు ఇంకెవరైనా రాసి ఉంటారని నేను అనుకోను. అదీగాక అద్దేపల్లి రామమోహన రావు గారి విషయ గంభీర ఉపన్యాసాలు ఆయన కృషిలో పేర్కొనదగ్గవి. యువ కవుల్ని ఆయనలా ప్రోత్సహించిన వాళ్ళు తక్కువ.

ఇంటర్వ్యూ ■ శ్రీరాం పుప్పాల



రెక్కలు విప్పిన దృశ్యం కోసం

ఒకరు గాయపడినపుడల్లా ఓదార్చి
నెమలీక స్పర్శతో మందు రాస్తుంది
వర్షం యొక్క సన్నని సంభాషణలా ధ్వనిస్తుంది
ఆత్మవిశ్వాసంతో ఉంటూ
నిలువెల్లా ఒక ఎదురీత పటుత్వంతో
ప్రతి కుంగదీత తర్వాత త్వరగా లేస్తూ
పోరాడుతూ, బలపడుతూ
"వి వాంట్ జస్టిస్" అంటూ స్వరం కలుపుతూ
రెక్కలు విప్పిన దృశ్యంకోసం పిడికిలి బిగించి
అణచివేతల కట్లు తెంపుతోంది

ఆమెకు ఆమె గుర్తుగా ఏదో చేయాలని వుంది
ఏది పువ్వో, ఏది ముల్లో
ఏది వానో, ఏది వడగళ్ళో
ఒక స్పర్శలో ఎన్ని స్పర్శలున్నవో
ఒక వానలో ఎన్ని వానలున్నవోననే
రెక్కలుండి వెలుగుండి
బంకమట్టికి అతికించిన మిణుగురులాంటి
అవస్థ నుండి బయటపడుతోంది

చేతిరేఖలరగదీసి బతుక్కి తిలకందిద్ది
పునాదిరాతిలా నిలిచిన ఆమె
ఏ గోడల వెనుకో దాక్కోకుండా
దారి అంతటా ఒకరు తోడుకావాలనే
కొన్ని గింజలేసి పట్టుకోజూస్తే లొంగిపోకుండా
వెలుగులోకొస్తోంది

స్వేచ్ఛను మాట్లాడటానికి
తన కథకు స్వరాలిస్తూ
చెదిరిన కలల రోజుల్నిదాటి
సాధికారతా సంతకం పెడుతూ
మోసిన తట్టెడు సర్వనామాల్ని
కీబోర్డుమీద కొనగోటితో చెరిపేస్తోంది
తనని ఒక గుర్తింపులేని చిరునామాగా
ఉంచిన రోజుల్ని ధిక్కరిస్తూ
తరాల నిశ్శబ్దాన్ని బద్దలుకొడుతోంది.

■ శాంతయోగి యోగానంద
✆ 96522 71520


ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

3

ఎన్.టి.ఆర్ జిల్లా వార్తలు

సోమవారం 1 సెప్టెంబరు 2025





బతుకంతా బురదై..



ఊరంతా చెరువై..

శాశ్వత పరిష్కారం అవసరం

బుడమేరు వరద ముంపునకు శాశ్వత పరిష్కారం లభించాలంటే వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ దిగువ భాగం నుంచి ఎనికేపాడు యూటీ వరకూ ఇప్పుడున్న కాల్వకు సమాంతరంగా మరో 25 కిలోమీటర్ల మేర ప్రత్యామ్నాయంగా మరో కాల్వ తవ్వాలి. ఎనికేపాడు యూటీ సామర్థ్యాన్ని 4 వేల క్యూసెక్కుల నుంచి 20 వేల క్యూసెక్కులకు పెంచాలి. కొల్లేరు నుంచి ఉప్పుటేరు మీదుగా బుడమేరు డ్రెయిన్ నీరు సముద్రంలోకి పోయేలా డీసిల్టింగ్ పనులు చేయాలి. ఎనికేపాడు నుంచి కొల్లేరు వరకు 57 కిలోమీటర్ల పొడవునా బుడమేరు డ్రెయినేజీ పూడిక తీయాలి. ఇందుకు రూ.5,800 కోట్ల నిధులు కావాలని జలవనరుల శాఖ అధికారులు డీపీఆర్ తయారుచేసి ప్రభుత్వానికి పంపారు.

మరువని విలయం

2024, ఆగస్టు 31 అర్ధరాత్రి.. తెల్లవారితే సెప్టెంబరు 1.. అందరికీ కేవలం నెల మాత్రమే మారితే, విజయవాడ వాసుల జీవితాలు మాత్రం పూర్తిగా మారిపోయాయి. బుడమేరు సృష్టించిన బీభత్సానికి నగరంలోని 50 శాతం ప్రాంతంతో పాటు రూరల్ మండలాలు, మైలవరంలోని ప్రాంతాలు నీటమునిగిపోయాయి. 4.5 లక్షల మంది ప్రజలు నిలువనీడ లేకుండాపోయారు. రూ.కోట్లలో ఆస్తినష్టం సంభవించింది. తినడానికి తిండిలేక, కట్టుకునేందుకు దుస్తులులేక సుమారు 15 రోజుల పాటు నరకయాతన అనుభవించారు. ప్రభుత్వం అందించిన సాయం, దాతల దాతృత్వం కాస్త చేయూతనిచ్చినా.. ఈ విలయానికి నేటికీ కోలుకోని అభాగ్యులెందరో ఉన్నారు. అందుకే.. చిన్నపాటి వర్షానికి కూడా బుడమేరు ఎప్పుడొస్తుందోనని బెజవాడవాసులు నేటికీ భయంతోనే బిక్కుబిక్కుమంటున్నారు. భవిష్యత్తులో ఇలాంటి భయంకరమైన రోజులు పునరావృత్తం కాకుండా ఉండాలన్నా.. బెజవాడవాసుల భయం తొలగిపోవాలన్నా.. బుడమేరు వరద నివారణకు శాశ్వత పరిష్కారం చూపించాల్సిన అవసరం ఉంది. ఆ జల ప్రళయానికి నేటికి ఏడాది అయిన సందర్భంగా ప్రత్యేక కథనం..

బుడమేరు వరద బీభత్సానికి ఏడాది

- బెజవాడ సహా రూరల్ ప్రాంతాలు నీటమునక
- 4.5 లక్షల మందిపై ముంపు ప్రభావం.. రూ.కోట్లలో నష్టం
- ఇళ్లు నీటమునిగి సర్వం కోల్పోయిన వారెందరో..
- షాపులు, గోడౌన్లు నాశనమై నష్టపోయిన వారెందరో..
- ఏడాది అవుతున్నా నేటికీ బుడమేరు అంటేనే ఓ భయం
- వర్షం వస్తే వరద వస్తుందేమోనని వణుకు
- వెలగలేరు వద్ద రిటైనింగ్ వాల్ నిర్మాణంతో కాస్త ఉపశమనం
- శాశ్వత పరిష్కారం చూపించాలంటున్న బెజవాడవాసులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/ఇబ్రహీంపట్నం) : 1964 నాటి వరద బీభత్సాన్ని గుర్తుచేస్తూ సరిగ్గా 60 ఏళ్ల తర్వాత 2024, సెప్టెంబరు 1న బుడమేరు మహోగ్రరూపం దాల్చి బెజవాడను ముంచేసింది. మైలవరంతో పాటు విజయవాడ రూరల్ గ్రామాల్లోకి పరుగులు పెట్టింది. గత ఏడాది ఆగస్టు 31 రాత్రి సుమారు 30 సెంటీమీటర్ల వర్షం కురవడంతో పాటు కొండవాగు, కోతులవాగు, పులివాగుతో పాటు అనేక వాగులు పొంగడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ వద్దకు సుమారు 40 వేల క్యూసెక్కుల వరద చేరింది. రెగ్యులేటర్ గేట్ల పైనుంచి వరద ప్రవహించింది. ఈ దశలో రెగ్యులేటర్ నుంచి బుడమేరు వరద మిగతా 4లో..



వరదకు అడ్డంకులు తొలగించాలి

బుడమేరు డైవర్షన్ చానల్ (బీడీసీ) ద్వారా కృష్ణానదిలో వరద నీరు కలిసేందుకు ఎలాంటి అడ్డంకులు లేకుండా చూడాలి. ఎన్టీటీపీఎస్ మీదుగా వెళ్తున్న బీడీసీ కాల్వను 1.5 కిలోమీటర్ల మేర 1.5 మీటర్ల లోతు పూడిక తీయాలి. ఈ పనులు చేస్తే బీడీసీ ద్వారా సుమారు 37 వేల క్యూసెక్కుల వరద నీటిని నేరుగా కృష్ణానదిలోకి ఎలాంటి అవరోధాలు లేకుండా కలిపే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఈ పనులు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉండటం వల్ల బీడీసీ ద్వారా కేవలం 15 వేల క్యూసెక్కుల నీరు మాత్రమే నదిలోకి మళ్లిస్తున్నారు.



బైబై గణేశా..

- నగరంలో ఘనంగా వినాయక నిమజ్జనాలు

వినాయక నిమజ్జనాలతో నగరం సందడిగా మారింది. ఐదోరోజు ఆదివారం కావడం, అందరికీ సెలవు కావడంతో గణనాథుడి విగ్రహాలు ప్రకాశం బ్యారేజీ వద్దకు భారీగా చేరాయి. ఎక్కడికక్కడ డీజేల మోత మోగింది. రోడ్లు కిక్కిరిసిపోయాయి. కృష్ణానదికి వరద కొనసాగుతుండటంతో పెద్ద విగ్రహాలను క్రేన్ల సాయంతో నదిలో నిమజ్జనం చేస్తున్నారు. పదుల సంఖ్యలో విగ్రహాలు రావడంతో ప్రకాశం బ్యారేజీ వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. - విజయవాడ, (ఆంధ్రజ్యోతి)

దసరా.. సరదా..

అంబరాన్నంటేలా 'దసరా ఉత్సవ్'

- ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తున్న అధికారులు
- నగరమంతా జిగేల్‌మనేలా లైటింగ్
- గొల్లపూడిలో భారీ ఎగ్జిబిషన్
- బందరు రోడ్డుపై దసరా కార్నివాల్స్
- ఐజీఎంసీ నుంచి హెలీ రైడింగ్
- నగరంలో తొలిసారిగా ఎయిర్‌బెలూన్స్
- నోరూరించే ఫుడ్ ఫెస్టివల్స్ 4



జెన్‌కోలో కరపత్రాల కలకలం

- విద్యుత్ సౌధ ఉద్యోగుల తిరుగుబాటు
- బదిలీల్లో ఇద్దరు డైరెక్టర్లపై ఆరోపణలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : జెన్‌కోలో బదిలీల కాక రేగుతోంది. అక్రమ బదిలీలపై కరపత్రాలు ముద్రితంకావటం చర్చనీయాంశంగా మారింది. బాధిత విద్యుత్ ఉద్యోగులు ఈ కరపత్రాలను ముద్రించినట్టుగా ప్రచారం జరుగుతోంది. జెన్‌కోలో అంతర్గతంగా జరుగుతున్న వ్యవహారాలు ఈ కరపత్రాల ద్వారా వెలుగులోకి వచ్చాయి. ఒక విధానం లేకుండా ఎప్పుడు పడితే అప్పుడు, ఎడాపెడా బదిలీలు జరుపుతున్నారని ఇందులో పేర్కొన్నారు. అనధికారిక బదిలీలతో అల్లాడిపోతున్నామని, తమతో బదిలీల బంతాట ఆడుకుంటున్నారని విద్యుత్ ఇంజనీర్లు వాపోతున్నారు. ప్రధానంగా వైసీపీ సానుభూతిపరులైన ఇద్దరు డైరెక్టర్లు ఈ చర్యలకు పాల్పడుతున్నారని మరో కరపత్రంలో ఉద్యోగులు పేర్కొనటం చర్చనీయాంశమైంది. తమకు అనుకూలురైన వారిని, తమకోసం పనిచేసే వారిని ఏరికోరి తెచ్చుకునేందుకు ఉద్యోగులను వైసీపీ సానుభూతిపరులుగా ముద్రవేసి సాగనంపుతున్నారని ఆరోపిస్తున్నారు. ఇప్పటివరకు 200 మందికిపైగా అన్యాయంగా బదిలీ అయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ సౌధలో అదనంగా ఏఈఈలు ఉన్నారని, వారిని ఎన్టీటీపీఎస్, ఆర్టీపీపీలకు బదిలీ చేసి.. వెంటనే తమవారిని తెచ్చుకున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే అదనంగా ఉంటే మళ్లీ కొత్తవారిని తెచ్చుకోవాల్సిన అవసరమేమొచ్చిందని ప్రశ్నిస్తున్నారు. జెన్‌కోను ఆ ఇద్దరు డైరెక్టర్లు తమ సొంత కంపెనీలా భావిస్తూ ఉద్యోగులను కట్టుబానిసలను చూస్తున్నారని, ప్రభుత్వంపై ఉద్యోగుల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చేలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

యాక్సిస్ బ్యాంక్‌లో చోరీకి విఫలయత్నం

- ఎన్టీటీపీఎస్ పాత గేటు సమీపంలోని బ్రాంచ్‌లో ఘటన 4
- అలారం మోగడంతో పరారైన దొంగ

కమిటీ కుయుక్తులు

నందిగామ రామలింగేశ్వరుడి భూములు కరిగించే కుట్రలు

ధర్మకర్త అడ్డుపడుతున్నారని కమిటీ ఏర్పాటుచేసే ఎత్తుగడ

- అక్రమార్కులకు అండగా అధికార పార్టీ నేతలు, అధికారులు
- అనుయాయులు 9 మందితో దేవదాయశాఖకు కమిటీ ప్రతిపాదన

నందిగామ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): నందిగామలోని శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయానికి రాజా వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు 1,200 ఎకరాల భూమి ఇవ్వగా, అందులోని 785 ఎకరాలు ఆలయానికి సేవలందించే వివిధ వృత్తుల వారికి ఇనామ్‌గా అప్పగించారు. మిగిలిన 400 ఎకరాలు ఆలయానికి ఉన్నాయి. ఈ భూములు సుదీర్ఘ కాలంగా అక్రమార్కులు ఆక్రమించి అమ్ముకుంటున్న వైనంపై ఇటీవల 'ఆంధ్రజ్యోతి' కథనం



ప్రచురించింది. ఆక్రమణలు పోను ప్రస్తుతం 262.2 ఎకరాలు ఉండగా, ఇందులో సుమారు 20 ఎకరాలు నందిగామ పట్టణంలో అంతర్భాగం అయ్యాయి. వీటి విలువ కనీసం రూ.100 కోట్లకు పైగా ఉంది. ప్రస్తుతం కొందరు అక్రమార్కుల దృష్టంతా ఈ భూములపై పడింది. కిందటి వైసీపీ హయాంలో ఈ భూమిని మున్సిపాలిటీకి బదలాయించి లీజుల పేరుతో అన్యాక్రాంతం చేసే ప్రయత్నాలు జరిగాయి. ధర్మకర్త పోరాటంతో అవి ఫలించలేదు. తాజాగా పాలకమండలి కమిటీ వేయించే మిగతా 4లో..

నందిగామ రామలింగేశ్వర స్వామి ఆలయ భూములను ఎలాగైనా కొట్టేయాలని కొందరు అక్రమార్కులు కమిటీల పేరిట కుట్రలకు తెరలేపుతున్నారు. మిగులు భూములపై కన్నేసిన ఈ గ్యాంగ్.. తమకు అడుగడుగునా అడ్డుపడుతున్న ధర్మకర్తను అడ్డుకోవాలని కుయుక్తులతో వ్యూహాలు పన్నుతున్నారు. అధికార పార్టీ పంచన చేరి, అధికారులను చెప్పుచేతల్లో పెట్టుకున్న వీరు కమిటీలో తమ వారిని నియమించుకుని మిగిలిన భూములను కూడా కరిగించేయాలనే పన్నాగానికి తెరలేపుతున్నారు.

మత్తు ప్రేమికులు.. మధ్యలో మద్దీ



ఎండీఎంఏ కేసులో ప్రధాన సూత్రధారి

- నెల్లూరు నుంచి వెళ్లి బెంగళూరులో డ్రగ్స్ వ్యాపారం
- వైజాగ్ ప్రేమికుల అరెస్టుతో పరార్

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : వైజాగ్ ప్రేమికులకు ఎండీఎంఏ, ఎల్ఎస్‌డీ డ్రగ్‌ను సమకూర్చిన మల్లెల మధుసూదన్‌రెడ్డి అలియాస్ మద్దీ ఎవరు? డ్రగ్స్ తీసుకురమ్మని పురమాయించిన లోహిత్ యాదవ్‌కు, మద్దీకి పరిచయం ఎలా ఏర్పడింది? వైజాగ్ తీరానికి చేరుకున్న మాదకద్రవ్యాలు బెంగళూరు నుంచే వెళ్తున్నాయా? అంటే దర్యాప్తు బృందాల నుంచి అవుననే సమాధానం వస్తోంది. ఎండీఎంఏ, ఎల్ఎస్‌డీ డ్రగ్‌ను బెంగళూరు నుంచి ట్రావెల్స్ బస్సులో వైజాగ్ తీసుకెళ్తుండగా, అర్జాల శ్రీవాత్సవ్, బొడ్డేపల్లి హవీల డిలైట్ అనే ప్రేమికులను ఈగల్ పోలీసులు మిగతా 4లో..

డ్రగ్స్ తీసుకుంటూ వీడియోలు, ఫొటోలు

శ్రీవాత్సవ్, హవీల ఇద్దరూ ప్రేమికులు. శ్రీవాత్సవ్ డ్రగ్స్ తీసుకుంటాడన్న విషయం ఇంట్లో తల్లిదండ్రులకు తెలుసు. హవీలకు ఈ అలవాటు ఉన్న విషయం తమకు తెలియదని ఆమె తల్లిదండ్రులు చెబుతున్నారు. హవీల, శ్రీవాత్సవ్ ఫోన్లను సీజ్ చేసిన పోలీసులు వాటిని సాంకేతికంగా విశ్లేషిస్తున్నారు. శ్రీవాత్సవ్ ఫోన్ గ్యాలరీలో హవీలతో కలిసి డ్రగ్స్ తీసుకుంటున్న వీడియోలు, ఫొటోలు ఉన్నాయి. ఇద్దరూ కలిసి ఒక గదిలో రాత్రిపూట డ్రగ్స్ సేవిస్తూ ఎంజాయ్ చేస్తున్న వీడియోలను కూడా చిత్రీకరించుకున్నారు. ఫొటోలు కూడా దిగారు. వాటినే సాక్ష్యాలుగా పోలీసులు కోర్టుకు అందజేయనున్నారు.

పూజలు మరింత చేరువగా..

దుర్గమ్మ పూజల టికెట్ ధరలు తగ్గించే యోచన

- పరోక్ష విధానంలో మాత్రమే..

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : దసరా ఉత్సవాల సమయంలో ఇంద్రకీలాద్రిపై నిర్వహించే ప్రత్యేక పూజలను పరోక్ష విధానంలో చేయించుకునే భక్తుల విషయంలో శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం కీలక నిర్ణయం తీసుకోనుంది. కుంకుమార్చనలు, శ్రీచక్రనవార్చన, చండీహోమం, ఖడ్గమాలార్చనకు ఫీజులను గణనీయంగా తగ్గించాలని అధికారులు యోచిస్తున్నారు. దసరా ఉత్సవాల్లో పరోక్ష పూజా విధానంలో కుంకుమార్చనకు రూ.3 వేల చార్జీ వసూలు చేస్తున్నారు. అలాగే శ్రీచక్రనవార్చనకు రూ.3 వేలు, చండీహోమానికి రూ.4 వేలు, ప్రత్యేక లక్షకుంకుమార్చనకు రూ.5 వేలు, ఖడ్గమాలార్చనకు రూ.5,116 చొప్పున టికెట్ వసూలు చేస్తున్నారు. ఈ టికెట్ ధరలను రూ.1,000-రూ.1,500 వరకు తగ్గించాలని అధికారులు భావిస్తున్నారు. వీలైనంత ఎక్కువమంది భక్తులకు అవకాశం కల్పించాలన్న ఉద్దేశంతోనే రేట్లు తగ్గించాలనేది దేవస్థాన అధికారుల భావన. పరోక్ష విధానంలో పూజలు చేయించుకునే వారికి దేవస్థానం పూజల ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించేలా లింక్ ఇస్తారు. ఈ లింక్ ద్వారా ఇంటి నుంచి పూజలు వీక్షించవచ్చు. ఆ తర్వాత అమ్మవారి ప్రసాదం, రాగి డాలర్, వస్త్రం తదితరాలను భక్తుల ఇంటికే పంపించే ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు.


ఆరోగ్య గమ్యానికి సైకిల్ సవారీ

- సైకిల్ రైడ్‌లో పాల్గొన్న కలెక్టర్ లక్ష్మీశ 4

నేడు సీపీఎస్ ఉద్యోగుల 'చలో విజయవాడ' 4

హైకోర్టులో కొలువుల పేరుతో టోకరా

- వేర్వేరు వ్యక్తుల నుంచి రూ.6.52 లక్షలు వసూలు
- పోలీసులకు చిక్కిన నిందితురాలు



దసరా అదిరేలా..!

అంబరాన్నంటే సంబరంగా 'దసరా ఉత్సవ్'



- నగరమంతా జిగేల్‌మనేలా లైటింగ్
- గొల్లపూడిలో భారీ ఎగ్జిబిషన్
- బందరు రోడ్డుపై దసరా కార్నివాల్స్
- ఐజీఎంసీ నుంచి హెలీ రైడింగ్
- నగరంలో తొలిసారిగా ఎయిర్‌బెలూన్స్
- చవులూరించే ఫుడ్ ఫెస్టివల్స్

ఆంధ్రజ్యోతి, విజయవాడ: జిగేల్‌మనే లైటింగ్, వీనులవిందైన సంగీతం, బందరు రోడ్డుపై దసరా కార్నివాల్స్, రంగురంగుల ఎయిర్‌బెలూన్స్‌పై విహారం, హెలీ రైడింగ్, ఎగ్జిబిషన్, ఫుడ్ ఫెస్టివల్స్‌తో ఈసారి దసరా ఉత్సవాలు విజయవాడలో 11 రోజుల పాటు అంబరాన్నంటే సంబరాలు జరగబోతున్నాయి. నగరం దేదీప్యమానంగా వెలుగొందబోతోంది. ధూమ్‌ధామ్‌గా 'దసరా ఉత్సవ్'ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలకు రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చే భక్తులకు నగరం ఈసారి గ్రాండ్ వెల్కమ్ పలకబోతోంది. కనకదుర్గమ్మ దర్శనానికి నగరానికి వచ్చిన వారిని రెండు, మూడు రోజుల పాటు ఇక్కడే ఉండేలా, వారిని కట్టిపడేసేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆయా విశేషాలను మరికొద్ది రోజుల్లో అధికారికంగా జిల్లా యంత్రాంగం, ప్రజాప్రతినిధులు ప్రకటించబోతున్నారు. కనీవినీ ఎరుగనిరీతిలో 'దసరా ఉత్సవ్' నిర్వహణకు భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. నగరంలోనరి హోటళ్ల యాజమాన్యాలకు, లాడ్జీలకు వసతి కల్పించటానికి సిద్ధంగా ఉండాలంటూ సందేశాలు పంపే స్థాయికి చేరుకుంది. కొండపై దసరా ఉత్సవాల సందడి, కొండ దిగువన నగర వ్యాప్తంగా కోలాహలంతో అంబరాన్నంటే సంబరాలే సాక్షాత్కరిస్తున్నాయి.

ఎంపీ శివనాథ్ చొరవతో..

విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఎన్టీఆర్ కలెక్టర్ లక్ష్మీశ సంయుక్తంగా 'దసరా ఉత్సవ్'ను నగర చరిత్రలో లిఖించేలా నిర్వహించేందుకు సారథ్యం వహిస్తున్నారు. దసరా ఉత్సవ్‌పై ఇప్పటికే పలుమార్లు విస్తృత స్థాయిలో సమావేశమై కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

గొల్లపూడిలో భారీ ఎగ్జిబిషన్

గత దశాబ్దంన్నర కాలంగా నగరంలో నిలిచిపోయిన కృష్ణా పారిశ్రామిక, వ్యవసాయ ఎగ్జిబిషన్‌ను మళ్లీ దసరా ఉత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్నారు. స్వరాజ్య మైదానంలో అంబేద్కర్ స్మృతివనం ఏర్పాటు కారణంగా గొల్లపూడిలో దేవదాయశాఖకు చెందిన స్థలంలో ఎగ్జిబిషన్ సొసైటీ నిర్వాహకుల సౌజన్యంతో భారీ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. చరిత్రలో నిలిచేలా నిర్వహించాలని ఎగ్జిబిషన్ సొసైటీ భావిస్తోంది. దాదాపుగా 450 పైగా రాష్ట్ర, జాతీయ స్టాల్స్ ఏర్పాటు జరుగుతోంది. ఎగ్జిబిషన్‌ను వినోదాత్మకంగా తీర్చిదిద్దేందుకు, పిల్లలు, కుటుంబాలు తరలివచ్చేలా సరికొత్త ఆకర్షణలతో నిర్వహించబోతోంది. అమ్మ దర్శనానికి వచ్చిన వారంతా ఎగ్జిబిషన్‌ను చూడటానికి వచ్చేలా విస్తృత ప్రచారం నిర్వహించనున్నారు.

తొలిసారిగా ఎయిర్ బెలూన్స్

అభివృద్ధి చెందిన పర్యాటక దేశాల్లో చూసే రంగురంగుల ఎయిర్‌బెలూన్స్ మన రాబోతున్నాయి. బెలూన్ తొట్టెల్లో నుంచుని బెజవాడ ఏరియల్ వ్యూ చూస్తూ ఆనందించవచ్చు. స్టేడియం, హరిత బెర్మ్‌పార్క్, ప్రకాశం బ్యారేజీ తదితర సందర్శనీయ ప్రాంతాల నుంచి ఎయిర్ బెలూన్స్ ఆపరేషన్ నిర్వహణకు ఆలోచనలు చేస్తున్నారు. నిర్వాహకులతో సంప్రదింపులు చేస్తున్నారు.

హెలీ రైడింగ్

ఉత్సవాల 11 రోజుల పాటు నగరంలో హెలీ రైడింగ్ నిర్వహించబోతున్నారు. అతి తక్కువ చార్జీతోనే హెలికాప్టర్‌లో చక్కెర్లు కొట్టే అవకాశాన్ని నగర ప్రజలకు, దసరా ఉత్సవాల సందర్శకులకు కల్పిస్తోంది. హెలీ రైడ్ ఐజీఎంసీ నుంచి బయలుదేరి కృష్ణానది మీదుగా అమరావతి, కనకదుర్గమ్మ ఆలయం మీదుగా తిరిగి ఐజీఎంసీకి వెళ్లేలా రూట్ ప్లాన్ చేస్తున్నారు.



బందరు రోడ్డుపై దసరా కార్నివాల్స్

దసరా అంటేనే పగటి వేషాలు. కానీ వీటిని మనం మరిచిపోయాం. అందుకే వాటితోపాటు మరికొన్ని ఆకర్షణలను జతకూర్చి దసరా కార్నివాల్స్ నిర్వహించేలా ప్లాన్ చేశారు. బందరు రోడ్డుపై 11 రోజుల పాటు ఈ దసరా కార్నివాల్స్ నిర్వహించనున్నారు. మేళతాళాలు, బ్యాండ్, డీజేలు, రకరకాల వాయిద్యాలు, సంగీతం, పగటి వేషాల హడావిడితో సందడిగా మారబోతోంది.

విద్యుత్‌కాంతులతో ధగధగలు

నగరమంతా విద్యుత్ కాంతులతో ధగధగమనిపించేలా చేయబోతున్నారు. ప్రధాన రోడ్లు, ప్రభుత్వ భవనాలు, జంక్షన్లు, రింగ్‌లు అన్ని చోట్లా లైటింగ్ ఏర్పాటు చేయనున్నారు. అంతేకాక ప్రత్యేక ఆకర్షణతో కూడిన లైటింగ్‌ను ఏర్పాటు చేయనున్నారు. రాత్రుళ్లు వీటిని చూస్తూ ఆస్వాదించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. పగటిపూట తోరణాలు, ఆర్చిలు వంటివి పైన చెప్పుకున్న ప్రాంతాల్లో కనువిందు చేయనున్నాయి.

సంగీత స్వరాలు

దసరా ఉత్సవాల నేపథ్యంలో వీనులవిందైన సంగీతం వినేలా ఏర్పాట్లు చేస్తారు. నగర ప్రధాన రోడ్లు, కూడళ్లు, జనసమ్మర్ధ ప్రాంతాలు అన్నిచోట్లా సౌండ్ బాక్సులు ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా మంచి సంగీతం వినేలా అమ్మవారి పూజలు, పాటలతో భక్తిపారవశ్యం కలిగించేలా ఏర్పాట్లు చేయనున్నారు.

ఘుమఘుమలాడే ఫుడ్ ఫెస్టివల్స్

నగరంలో ఉత్సవాలు ముగిసేవరకు కోరుకున్నవారికి కోరినన్ని రుచులతో నాలుగైదు ప్రాంతాల్లో ఫుడ్‌ఫెస్టివల్స్‌ను నిర్వహించనున్నారు. వెజ్, నాన్‌వెజ్‌తో పాటు ఫాస్ట్‌ఫుడ్ రుచులన్నీ అందుబాటులోకి తెచ్చి భోజన ప్రియులను సంతుష్టపరచాలని ఏర్పాట్లు చేస్తున్నారు.

మ్యూజికల్ నైట్స్‌తో జోష్

కనకదుర్గమ్మ గుడి వద్ద శాస్త్రీయ నృత్యాలను ఈసారి భారీగా ఏర్పాటు చేస్తారు. ఇవి కాకుండా నగరంలో మ్యూజికల్ నైట్స్ నిర్వహించనున్నారు. కృష్ణానది ఒడ్డున, అంబేద్కర్ స్మృతివనం, ఐజీఎంసీ వంటిచోట్ల మ్యూజికల్ నైట్స్ నిర్వహించాలని ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటికే పలు మ్యూజికల్ ఈవెంట్స్ సంస్థలతో సంప్రదింపులు చేపట్టారు.

హైకోర్టులో కొలువుల పేరుతో టోకరా

- వేర్వేరు వ్యక్తుల నుంచి రూ.6.52 లక్షలు వసూలు
- పోలీసులకు చిక్కిన నిందితురాలు

విజయవాడ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): హైకోర్టులో ఉద్యోగాలున్నాయి. రూ.లక్ష చూసుకోండి. ఉద్యోగం ఇప్పించే బాధ్యత నాదంటూ పలువురిని నమ్మించి ఓ మహిళ నిలువునా ముంచేసింది. ఆమె మోసాలను గ్రహించిన బాధితులు పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేసి ఆదివారం అరెస్టు చేశారు. గురునానక్ కాలనీకి చెందిన ఈశ్వరమ్మ అనే మహిళ మధురానగర్‌కు చెందిన రంజుల స్వర్ణకుమారి ఇంటిలో పనులు చేస్తోంది. కొద్దినెలల క్రితం ఈశ్వరమ్మతో మాటలు కలిపి తాను హైకోర్టులో ఉద్యోగాలిప్పిస్తానని, రూ.లక్ష ఖర్చవుతుందని నమ్మించింది. అంతేకాక ఉద్యోగం కావల్సినవారిని తీసుకురావాలని చెప్పింది. ముందుగా ఉద్యోగం కోసం ఈశ్వరమ్మ రూ.లక్ష ఇచ్చింది. తర్వాత మరికొంతమందితో ఇప్పించింది. నెలలు గడుస్తున్నా ఉద్యోగ సమాచారం ఇవ్వకపోవడంతో ఈశ్వరమ్మ నిలదీసింది. కొన్ని డబ్బులు చెల్లించినా మిగతా చెల్లించకపోవడంతో సూర్యారావుపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు ఆదివారం ఆమెను అరెస్టు చేసి న్యాయాధికారి ఎదుట హాజరుపర్చగా రిమాండ్ విధించారు. గతంలోనూ కొంతమందిని ఇలాగే మోసం చేసింది. ఆమెపై గవర్నరుపేట పోలీస్‌స్టేషన్‌లో రెండు, గుణదల, మాచవరం, తుళ్లూరు పోలీస్ స్టేషన్లలో ఒక్కో కేసు ఉన్నాయి. కొన్ని కేసుల్లో లోక్‌అదాలత్‌లో రాజీ కుదుర్చుకుంది. రాజీ కుదరలేని కేసులు కోర్టు విచారణలో ఉన్నాయి.

యాక్సిస్ బ్యాంక్‌లో చోరీకి విఫలయత్నం

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్టీటీపీఎస్ పాత గేటు సమీపంలోని యాక్సిస్ బ్యాంక్‌లో ఆదివారం తెల్లవారుజామున ఓ దొంగ చోరీకి యత్నించి విఫలమయ్యాడు. బ్యాంక్ ఎదుట ఉన్న ఏటీఎమ్ సెంటర్‌లోకి ప్రవేశించిన ఒక గుర్తు తెలియని వ్యక్తి బ్యాంక్ షట్టర్ తాళం పగులకొట్టి బ్యాంక్‌లోకి ప్రవేశించడంతో థెఫ్ట్ అలారం మోగింది. దీంతో పరారయ్యాడు. ఈ విషయాన్ని ముంబయి కమాండ్ సెంటర్‌లోని సిబ్బంది సీసీ కెమెరాల్లో చూసి పోలీసులకు తెలపడంతో వారు హుటాహుటిన బ్యాంక్ వద్దకు చేరుకునే లోపు దొంగ తప్పించుకున్నాడు. బ్రాంచ్ మేనేజర్ మునీర్ బ్యాంక్‌కు వచ్చి లోనికి వెళ్లి అన్ని పరిశీలించి చూసుకున్నారు. ఎలాంటి వస్తువులు పోలేదని నిర్ధారించుకున్నారు. బ్రాంచ్‌మేనేజర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అంతర్జాతీయ స్కేటింగ్ పోటీల్లో

నగర క్రీడాకారులకు బంగారు పతకాలు

లబ్బీపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఆస్ట్రేలియాలోని మౌంట్ వారెన్ క్వీన్స్‌ల్యాండ్‌లో జరిగిన 2025 వరల్డ్ స్కేట్ పసిఫిక్ కప్‌లో భారతీయ స్కేటింగ్ క్రీడాకారులు పీ చైత్రిక దీపిక, హృతిక్ అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించి జైత్రయాత్ర సాగించారు. నగరానికి చెందిన చైత్ర దీపిక పెయిర్ విభాగంలో బంగారు పతకం, ఇన్‌లైన్ విభాగంలో, కపుల్ డాన్స్ విభాగంలో బంగారు పతకాలు సాధించింది. పీ హృతిక్ ఇన్‌లైన్ విభాగంలో, పెయిర్ విభాగంలో, కపుల్ డాన్స్ విభాగంలో బంగారు పతకాలు, సోలో డాన్స్‌లో సిల్వర్ పతకం సాధించి దేశానికి పేరు తెచ్చారు.

బోధనేతర పనులు రద్దు చేయాలి

- యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మనోహర్

మైలవరం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు పాఠశాలల్లో ఆన్లైన్ వర్క్‌లతో విలువైన బోధన సమయానికి నష్టం వాటిల్లిదుందని ప్రభుత్వం స్పందించి బోధేనతర పనులను వెంటనే రద్దు చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌పీ మనోహర్ డిమాండ్ చేశారు. పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఆదివారం జిల్లా అధ్యక్షుడు కే శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన యూటీఎఫ్ మధ్యంతర కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలుత యూటీఎఫ్ జెండాను జిల్లా మాజీ గౌరవాధ్యక్షుడు జీ పాల్ బాబురావు, సీనియర్ నేత పీ వెంకటేశ్వరరెడ్డి ఆవిష్కరించారు. మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం కృష్ణయ్య, యూటీఎఫ్ నేతలు కే గంగరాజు, బీ సూర్యనారాయణ, పీ భవానీ, బీ సుదానంద్, ఎం లింగారెడ్డి, బీ రెడ్‌స్టార్, డీ హరిప్రసాద్, ఆడిట్ కమిటీ కన్వీనర్ మహేశ్వర వెంకటేశ్వరరావు, రాష్ట్ర కౌన్సిలర్లు, ఏ అనంత్‌కుమార్, జే గంగరాజు పాల్గొన్నారు.

పీసీబీలో సీనియర్ ఇంజనీర్ల పదోన్నతులకు లైన్‌క్లియర్

అమరావతి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ)లో ఆరుగురు సీనియర్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ల పదోన్నతులకు లైన్ క్లియర్ అయ్యింది. శంకర్ నాయక్, శాస్త్రి, నరేంద్రబాబు, సాయినాథ్, మహేశ్వరరావు, శ్రీదేవిలకు చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్లుగా ప్రమోషన్ ఇచ్చేందుకు శాఖాపరమైన పదోన్నతుల కమిటీ సిఫారసు చేసింది. ఈ మేరకు డీపీసీ సిఫారసులను ప్రభుత్వం ఆమోదిస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది.

నోషనల్ ఇంక్రిమెంట్స్ మంజూరు చేయాలి

గాంధీనగర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఈ నెలాఖరుకు నోషనల్ ఇంక్రిమెంట్స్ మంజూరు చేయాలని గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ ఎండీ.జానీపాషా రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు లేదంటే రాష్ట్రవ్యాప్తంగా ఉమ్మడి కార్యాచరణ ప్రకటిస్తామని ఒక ప్రకటనలో హెచ్చరించారు.

ప్రజల్ని జాగృతపరిచే సాహిత్యం రావాలి

- కృష్ణాజిల్లా విశ్రాంత కలెక్టర్ ఇంతియాజ్

విజయవాడ కల్చరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కవులు సమాజం పట్ల బాధ్యత వహించి చైతన్యవంతమైన ప్రజల్ని జాగృతపరిచే సాహిత్యం సృజన చేయాలని కృష్ణాజిల్లా విశ్రాంత కలెక్టర్ ఏఎండీ ఇంతియాజ్ అన్నారు. ఆదివారం ఎక్స్‌రే సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో జాతీయ కవితల పోటీ విజేతలకు 2024 ఎక్స్ రే అవార్డుల ప్రదానం విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ హాల్ నందు జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఇంతియాజ్ సామాన్యులకూ అర్థమయ్యే భాషలో కవిత్వం రావాలన్నారు. మహిళలు కూడా కవిత్వ రచనలో ముందుండాలని డిప్యూటీ కలెక్టర్ కొమ్మెర్ల కృష్ణవేణి అన్నారు. ఎక్స్‌రే అధ్యక్షుడు కొల్లూరి సభాధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఎక్స్‌రే కార్యదర్శి బోడి ఆంజనేయ రాజు స్వాగతం పలికారు. ప్రధాన అవార్డు గ్రహీతగా కన్నీటి రణం కవిత రచించిన మానుకోటకు చెందిన అక్షరం ప్రభాకర్‌కు రూ.12 వేల నగదు, జ్ఞాపిక, శాలువతో వేదికపై ఉన్న కలెక్టర్లచే సన్మానం జరిగింది. ఉత్తమ కవులుగా మామిడిశెట్టి శ్రీనివాసరావు (దొడ్డిపట్ల), శ్రీధర్‌బాబు (నెల్లూరు), చిత్రాడ కిషోర్ కుమార్ (విజయవాడ), జగరాపు శంకరరావు (గజపతినగరం), శ్రీకంతస్ఫూర్తి (విజయవాడ), దుప్పటి రమేష్‌బాబు (నెల్లూరు), ధవళేశ్వరరావు రవికుమార్ (విశాఖపట్నం), డాక్టర్ కోరుప్రోలు హరనాథ్‌బాబు (హైదరాబాద్)లు వెయ్యి రూపాయల నగదు, జ్ఞాపిక, శాలువా అవార్డుతో సత్కరించారు. వేదికపై శ్రీశ్రీ సాహిత్యానిధి సింగంపల్లి అశోక్‌కుమార్, హెచ్‌ఆర్‌పీఎస్ నేషనల్ కమిటీ కంచర్ల ముత్య ప్రసాద్, కవి కేవీ శ్యాంసుందర్, నందనోదయ ప్రసంగించారు. న్యాయనిర్ణేత, కవి, జర్నలిస్ట్ సర్వజిత్ బహుమతి కవితలను విశ్లేషించారు. సభ ప్రారంభంలో చిన్నారుల నృత్యాలు అలరించాయి. సంస్థ కోశాధికారి చామర్తి వెంకట సుబ్బయ్య, కందికొండ రవికిరణ్, పొత్తూరి సీతారామారావు, బీ వసంత కుమార్, కొల్లూరి కనకవల్లి పర్యవేక్షించారు.



ఎక్స్‌రే కవితా సంకలనాన్ని ఆవిష్కరిస్తున్న ఇంతియాజ్



సైకిల్ రైడ్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

ఆరోగ్య గమ్యానికి సైకిల్ సవారీ

- సైకిల్ రైడ్‌లో పాల్గొన్న కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యం, ఆహ్లాదం, ఆపై పర్యావరణ పరిరక్షణకూ సైక్లింగ్ చేయూతనిస్తుందని, చిన్నారులు, యువత సైకిల్ సవారీని అలవాటుగా చేసుకొని శారీరక, మానసిక ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవడంతో పాటు కాలుష్య రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జీ లక్ష్మీశ అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవాల్లో భాగంగా అమరావతి రన్నర్స్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలో పెడల్ ఫర్ ఫిట్‌నెస్ అండ్ యూనిటీ ఇతివృత్తంతో నిర్వహించిన సైకిల్ రైడ్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. డాక్టర్ అంబేద్కర్ స్మృతివనం నుంచి ప్రారంభమైన ఈ రైడ్ బెంజిసర్కిల్, రామవరప్పాడు, బీఆర్‌టీఎస్ రోడ్డు, గాంధీనగర్, మున్సిపల్ ఆఫీసు, ప్రకాశం బ్యారేజి, కంట్రోల్ రూమ్, స్టేడియం వరకు మొత్తం 21 కి.మీ మేర సాగింది. దాదాపు 80 మంది సైక్లిస్టులు ఉత్సాహంగా పాల్గొన్నారు. లండన్ ఎడిన్బర్గ్ - లండన్ (ఎల్‌ఈఎల్) సైక్లింగ్ ఈవెంట్ - 2025లో పాల్గొన్న నిషికాంత్‌ను కలెక్టర్ అభినందించారు. అమరావతి రన్నర్స్ ప్రెసిడెంట్ ఆర్ రమేష్ రవి, సభ్యులు బసవేశ్వరరావు, జీవీ సత్యనారాయణ, నిషికాంత్‌తో పాటు సీవైసీవో, డెకథ్లాన్ సైక్లింగ్ క్లబ్ సభ్యులు, సిటీ రన్నర్స్ పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం

లబ్బీపేట: ప్రతి ఒక్కరూ యోగా చేయడంతో ఆరోగ్యంగా ఉండొచ్చని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. ఐజీఎంసీ స్టేడియంలో ఆదివారం ఉమ్మడి కృష్ణాజిల్లా స్థాయి యోగాసన పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో యోగాంధ్రను చక్కగా నిర్వహించి వరల్డ్ రికార్డ్ నమోదు చేశారని, యోగా ద్వారా మానసికంగా, శారీరంగా ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. యోగా అసోసియేషన్ సభ్యులు, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

సీపీడీసీఎల్ ఎస్ఈగా హనుమయ్య



విజయవాడ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సీపీడీసీఎల్ ఎన్టీఆర్ జిల్లా సర్కిల్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా ఉప్పలపాటి హనుమయ్య నియమితులయ్యారు. ప్రస్తుతం ఎస్ఈగా పనిచేసిన తోట శ్రీనివాసరావు ఆదివారం ఉద్యోగ విరమణ చేశారు. ఆయన స్థానంలో హనుమయ్యను ఇన్‌చార్జిగా నియమించారు. ఆయన ఎస్ఈ కార్యాలయంలో టెక్నికల్ విభాగం డీఈగా పనిచేస్తున్నారు. సీనియారిటీ జాబితాలోని హనుమయ్యకు ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ఆదివారం బాధ్యతలు స్వీకరించారు.

నేడు కాచిగూడ - మెదక్ రైలు రద్దు

రైల్వేస్టేషన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): గోదావరి బ్రిడ్జి నెంబరు 434 బాసర - నవీపేట మధ్య భారీ వరదల కారణంగా హైదరాబాద్ డివిజన్‌లోని పలు రైళ్లను రద్దు చేయటం, లేదా పాక్షికంగా రద్దు చేయటం వంటివి చేస్తున్నట్టు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 77604 మెదక్ - కాచిగూడ రైలును ఈనెల 1న రద్దు చేశారు. 77656 సిద్దిపేట-సికింద్రాబాద్ రైలు ఈనెల 1న గద్వేల్‌లో బయలుదేరుతుంది. గద్వేల్ - సికింద్రాబాద్ మధ్య పాక్షికంగా రద్దు చేశారు.

కమిటీ కుయుక్తులు

(3వ పేజీ తరువాయి)

దిశగా అక్రమార్కులు అడుగులు వేస్తున్నారు. కమిటీలో తమకు కావాల్సిన వారిని నియమించుకునేందుకు పావులు కదుపుతున్నారు. నాడు వైసీపీ హయాంలో రామలింగేశ్వరుడి ఆస్తుల అన్యాక్రాంతానికి పాల్పడిన వ్యక్తులే నేడు కూటమి పంచన చేరి వారి కార్యకలాపాలను కొనసాగించడం ప్రారంభించారు.

రూ.కోట్ల విలువైన స్థలం స్వాహా

ఈ అక్రమార్కులు.. చందర్లపాడు బైపాస్ రోడ్డు సమీపంలో ఆలయానికి చెందిన 79 సెంట్ల భూమిని ఆక్రమించారు. విలువ రూ.10 కోట్లు ఉండగా, ఇప్పటికే అక్రమ నిర్మాణాలు చేపట్టారు. వీటిపై ధర్మకర్త న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో హైకోర్టు స్టే విధించింది. అయినా నిర్మాణాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఆలయ సిబ్బందిని బెదిరిస్తూ నిర్మాణాలు కొనసాగిస్తున్నారు. అధికారుల సహకారలేమితో ధర్మకర్త స్టే ఆర్డర్‌పై కంటెమ్ప్ట్‌కు వెళ్లారు. ఇంత జరుగుతున్నా అధికారులు కానీ, దేవదాయ శాఖ ఉన్నతాధికారులు కానీ స్పందించట్లేదు. అలాగే, అయ్యప్ప సన్నిధికి ఎదురుగా ఉన్న 5.38 ఎకరాల్లో సుమారు 35 సెంట్ల భూమి ఆక్రమణకు గురైంది. దీనిపైనా ధరకర్త పోరాడుతున్నారు.

ఆది నుంచి ధర్మకర్తల పాలనే..

ఆలయ నిర్వహణ దశాబ్దాలుగా వెంకటాద్రినాయుడి వంశీకుల పాలనలో జరుగుతూ వచ్చింది. 90వ దశకం ప్రారంభంలో ధర్మకర్తగా ఉన్న వాసిరెడ్డి శ్రీనినాద్ ప్రసాద్‌బాబు మరణించారు. ఆయన వారసులు క్లెయిమ్ చేసుకోకపోవడంతో కొద్దికాలం ధర్మకర్త పీఠం ఖాళీగా ఉంది. ఆ సమయంలో రెండు, మూడు సార్లు కమిటీలను ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న ఆయన కుమారులు సదాశివప్రసాద్, మురళీకృష్ణప్రసాద్, రామనాథ్‌బాబు హైకోర్టును ఆశ్రయించారు. తమకు వంశపారంపర్య ధర్మకర్త హోదా ఉండగా, ప్రభుత్వాలు కమిటీలు ఏర్పాటు చేయడాన్ని సవాల్ చేశారు. విచారణ జరిపిన కోర్టు 2010లో వాసిరెడ్డి సదాశివబాబుకు ఆలయ వంశపారంపర్య ధర్మకర్త హక్కులు కల్పిస్తూ తీర్పునిచ్చింది. బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి ఏ ప్రభుత్వమూ కమిటీలు వేయలేదు. గత వైసీపీ ప్రభుత్వం కమిటీ వేసే ప్రయత్నం చేసి విఫలమైంది. సదాశివబాబు మరణానంతరం సోదరుడు రామనాథ్‌బాబు బాధ్యతలు చేపట్టారు. ఆయన మరణానంతరం కుమారుడు మురళీకృష్ణబాబు బాధ్యతలు చేపట్టారు.

అందరినీ కలుపుకొనిపోదాం

కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బ్రహ్మం చౌదరికి కాకతీయ సేవా సమితి సన్మానం

మొగల్రాజపురం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధి కోసం మన కమ్యూనిటీని అభివృద్ధి చేసుకుంటూ మిగిలిన కమ్యూనిటీలను కలుపుకుని పోదామని ఆంధ్రప్రదేశ్ కమ్మ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన నాదెండ్ల బ్రహ్మం చౌదరి చెప్పారు. ఆంధ్రప్రదేశ్ కాకతీయ సేవా సమాఖ్య ఎగ్జిక్యూటివ్ సమావేశం మొగల్రాజపురంలో ఓ హోటల్‌లో ఆదివారం జరిగింది. ఆంధ్రప్రదేశ్ కమ్మ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన నాదెండ్ల బ్రహ్మం చౌదరికి సమాఖ్య ఆధ్వర్యంలో సత్కారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా కమ్మవారిలో ఐక్యత తీసుకొచ్చిన ఘటన వైకాపా ప్రభుత్వం చంద్రబాబును అరెస్టు చేయడమేనన్నారు. పార్టీకి తాను చేసిన సేవకు గుర్తింపుగా సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ తనకు కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చారని వారికి ధన్యవాదాలు చెప్పారు. అనంతరం సమాఖ్య తరువత అధ్యక్ష కార్యదర్శులు కొడాలి వెంకట సుబ్బారావు, బెజవాడ వెంకట్రావు మాట్లాడుతూ అమరావతిలో ఐదెకరాలు, జిల్లా కేంద్రాల్లో ఎకరం చొప్పున భూమిని కేటాయిస్తే ప్రభుత్వం నిర్ణయించిన ధరకు తీసుకుంటామన్నారు. తద్వారా కమ్యూనిటీ అభివృద్ధి, సేవాకార్యక్రమాలకు ఊతమిచ్చిన వారవుతారని విజ్ఞప్తి చేశారు. సమాఖ్య జాయింట్ సెక్రటరీ జీఎల్‌కే ప్రసాద్, మన్నే ప్రసాద్, సాయితో పాటు వివిధ జిల్లాల నుంచి వచ్చిన సమాఖ్య సభ్యులు, జిల్లా సంఘాల నేతలు పాల్గొన్నారు.



బ్రహ్మం చౌదరిని సత్కరిస్తున్న నేతలు

నేడు సీపీఎస్ ఉద్యోగుల 'చలో విజయవాడ'

గాంధీనగర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం 'చలో విజయవాడ' చేపడుతున్నట్టు ఏపీసీపీఎస్‌ఈఏ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోరుకొండ సతీష్, సీఎం.దాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ ధర్నాచౌక్‌లో నిర్వహించే సభను విజయవంతం చేయాలని ఉద్యోగులకు వారు పిలుపునిచ్చారు.

డీఏ బకాయిలు విడుదల చేయాలి

అమరావతి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ దినోత్సవం నాటికి ఉపాధ్యాయులకు డీఏ బకాయిలు విడుదల చేయాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక గౌరవాధ్యక్షుడు వంటేరు శ్రీనివాసరెడ్డి కోరారు. పీఆర్‌సీ కమిటీని నియమించకపోవడం, కనీసం ఐఆర్ ప్రకటించకపోవడం పట్ల ఉపాధ్యాయ వర్గాలు నిరాశలో ఉన్నాయన్నారు.

మరువని విలయం

(3వ పేజీ తరువాయి)

మళ్లింపు కాల్వకు (బీడీసీ)కు సుమారు 3.9 కిలోమీటర్ దగ్గర 200 మీటర్ల మేర మూడు భారీ గండ్లు పడ్డాయి. మరోపక్క కృష్ణానదికి ఎగువ నుంచి వచ్చిన వరద పోటెత్తడంతో బీడీసీ ద్వారా నదిలోకి వెళ్లాల్సిన బుడమేరు వరద వెనక్కి ఎగదన్నింది. గండ్ల ద్వారా వరద మొత్తం విజయవాడ పల్లపు ప్రాంతాలతో పాటు మైలవరం, విజయవాడ రూరల్ మండలంలోని గ్రామాలను ముంచెత్తింది. వందలాది ఇళ్లు నీటమునిగాయి. వేలమంది ప్రాణాలు కోల్పోయారు. వందలాది పశువులు నీటిలోనే మునిగిపోయాయి. రూ.కోట్లలో ఆస్తినష్టం సంభవించింది. సర్వం కోల్పోయి రోడ్డును పడిన వారు.. ఇప్పటికీ కోలోకోలేని అభాగ్యులు ఎందరో ఉన్నారు.

రిటైనింగ్ వాల్‌తో కాస్త ఉపశమనం

సెప్టెంబరులో ఒకేరోజు 30 సెంటీమీటర్ల వర్షం కురవడంతో బుడమేరుకు 40 వేల క్యూసెక్కుల వరద వచ్చింది. వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ పొంగి ప్రవహించింది. గేట్లు ఎత్తే లోగానే అక్కడి నుంచి సుమారు 4 కిలోమీటర్ల వద్ద బీడీసీ ఎడమ కట్టకు మూడుచోట్ల భారీగండ్లు పడటం, బెజవాడ పల్లపు ప్రాంతాలను ముంచెత్తడం జరిగిపోయింది. దీంతో కూటమి ప్రభుత్వం స్పందించింది. బుడమేరు మిగిల్చిన గాయాలకు కాయకల్ప చికిత్స చేసింది. గండ్లు పడిన ప్రదేశం దగ్గర రూ.23 కోట్లతో రిటైనింగ్ వాల్ పూర్తిచేసింది. వెలగలేరు హెడ్ రెగ్యులేటర్‌కు మరమ్మతులు చేయించింది. అయితే చర్యలు తాత్కాలికమే కాగా, శాశ్వత ప్రాతిపదికన ఆలోచన చేయాల్సిన అవసరం ఉంది.

శాశ్వత పరిష్కారం అవసరం

బుడమేరు వరద ముంపునకు శాశ్వత పరిష్కారం లభించాలంటే వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ దిగువ భాగం నుంచి ఎనికేపాడు యూటీ వరకూ ఇప్పుడున్న కాల్వకు సమాంతరంగా మరో 25 కిలోమీటర్ల మేర ప్రత్యామ్నాయంగా మరో కాల్వ తవ్వాలి. ఎనికేపాడు యూటీ సామర్థ్యాన్ని 4 వేల క్యూసెక్కుల నుంచి 20 వేల క్యూసెక్కులకు పెంచాలి. కొల్లేరు నుంచి ఉప్పుటేరు మీదుగా బుడమేరు డ్రెయిన్ నీరు సముద్రంలోకి పోయేలా డీసిల్టింగ్ పనులు చేయాలి. ఎనికేపాడు నుంచి కొల్లేరు వరకు 57 కిలోమీటర్ల పొడవునా బుడమేరు డ్రెయినేజీ పూడిక తీయాలి. ఇందుకు రూ.5,800 కోట్ల నిధులు కావాలని జలవనరుల శాఖ అధికారులు డీపీఆర్ తయారుచేసి ప్రభుత్వానికి పంపారు.

మత్తు ప్రేమికులు.. మధ్యలో మద్దీ

(3వ పేజీ తరువాయి)

నగరంలో అరెస్టు చేసిన విషయం తెలిసిందే. వారిద్దరికీ కోర్టు రిమాండ్ విధించింది. శ్రీవాత్సవ్‌తో ఎండీఎంఏ డ్రగ్‌ను రప్పిస్తున్న వైజాగ్‌కు చెందిన లోహిత్ యాదవ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అతడిని కోర్టులో సోమవారం హాజరుపరుస్తారు. మాచవరం పోలీసులు నమోదుచేసిన కేసులో లోహిత్ యాదవ్ ఏ3గా ఉన్నాడు. బెంగళూరులో శ్రీవాత్సవ్, హవీలకు ఎండీఎంఏను సమకూర్చిన మద్దీని ఏ4 నిందితుడిగా చేర్చారు. ఈ గ్యాంగ్‌కు డ్రగ్స్‌ను సమకూర్చిన మద్దీతో పరిచయాలు ఎలా ఏర్పడ్డాయో పోలీసులు కూపీ లాగుతున్నారు.

సింహపురి చిన్నోడు

మద్దీ సొంతూరు నెల్లూరు. అక్కడే డిగ్రీ చదివాడు. ఉపాధి కోసం బెంగళూరు వెళ్తున్నానని కుటుంబానికి చెప్పాడు. అక్కడికి వెళ్లి ఎండీఎంఏను యువతకు సరఫరా చేయడం మొదలుపెట్టాడు. శ్రీవాత్సవ్, హవీల నుంచి డబ్బు ఫోన్‌పే ద్వారా అందుకుని ఎండీఎంఏను సమకూర్చాడు. మద్దీ బెంగళూరులో మెట్రో రైల్వేస్టేషన్లకు సమీపంలో ఉండే కొన్ని ఖాళీ ప్రదేశాలను, చిన్నచిన్న దుకాణాలను డ్రాపింగ్ పాయింట్లుగా ఏర్పాటు చేసుకున్నాడు. డబ్బు ఖాతాలో జమకాగానే, అవతలి వ్యక్తులకు డ్రాపింగ్ పాయింట్ ఫొటో, లొకేషన్‌ను వాట్సాప్‌లో పంపుతాడు. వారు నేరుగా అక్కడికి వెళ్లి సరుకును తీసుకుంటారు. ఎవరికీ అనుమానం రాకుండా ఖాళీ సిగరెట్ ప్యాకెట్లలో ఈ డ్రగ్‌ను అమర్చుతాడు. సిగరెట్ ప్యాకెట్లను డ్రగ్ అమ్మకాలకు ఎంపిక చేసుకోవడం వెనుక ఒక కిటుకు ఉంది. సిగరెట్ అలవాటు ఉన్నవారు ప్యాకెట్‌లో సిగరెట్లన్నీ అయిపోయాక దాన్ని పాడేస్తారు. తుప్పల్లో, రహదారుల పక్కన విసిరేస్తారు. ఇలా సంపాదించిన సిగరెట్ ప్యాకెట్లలో డ్రగ్‌ను అమర్చి డ్రాపింగ్ పాయింట్ వద్ద ఉన్న గడ్డిలో గానీ, పొదల మొదల్లో గానీ ఉంచుతాడు. ఆ ఫొటోలను కొనుగోలుదారులకు పంపుతాడు. ఆవిధంగానే శ్రీవాత్సవ్, హవీలకు ఎండీఎంఏ డ్రగ్‌ను సింగసంద్ర మెట్రో రైల్వేస్టేషన్ వద్ద అందజేశాడు. ప్రస్తుతం మద్దీ కోసం పోలీసులు గాలిస్తున్నారు. శ్రీవాత్సవ్, హవీల విజయవాడలో పోలీసులకు దొరికిపోయారని తెలియడంతో అతను పరారయ్యాడు. వైజాగ్‌లో ఉన్న లోహిత్ యాదవ్‌కు మద్దీ ఎలా పరిచయమయ్యాడు, ఇంకా ఎంతమంది అతడితో సంప్రదింపులు చేశాడనే వివరాలు తేలాల్సి ఉంది.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	118,126, 137
చికెన్ విత్ స్కిన్	224
చికెన్ స్కిన్‌లెస్	234



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 560

వైభవోపేతంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

గాంధీనగర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : వినాయక ఉత్సవాల్లో శ్రీవేంకటేశ్వరస్వామి కళ్యాణం జరిపించడం శైవ వైష్ణవ సంప్రదాయ సామరస్యాన్ని చాటుతుందని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త వేముల హజరత్తయ్య గుప్తా తెలిపారు. గాంధీనగర్‌లోని మాజేటి వీధిలో ఏర్పాటు చేసిన వినాయక పందిరిలో వేంకటేశ్వరస్వామీ కళ్యాణం టీటీడీ ఆచార్యుల నిర్వహణలో అదివారం అత్యంత వైభవోపేతంగా జరిగింది. అన్నమాచార్య కీర్తనలు అలరించాయి. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. కళ్యాణ దాతలుగా కళ్లం సాయి నరేంద్రరెడ్డి, శిఖినం బాల, పేర్ల మురళి దంపతులు వ్యవహరించారు.


మొగల్రాజపురంలో జరిగిన కార్యక్రమంలో గద్దె క్రాంతి కుమార్

అన్నదానం మంచి సంప్రదాయానికి ప్రతీక

మొగల్రాజపురం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : చవితి పందిళ్లలో అన్న దానాలు చేయడం ఒక గొప్ప సంప్రదాయం అని టీడీపీ యువ నాయకుడు గద్దె క్రాంతికుమార్ చెప్పారు. పండుగలు అందిరిని ఒకచోట చేర్చి ఐకమత్యాన్ని పెంచితే అన్నదానం ద్వారా ఆకలిని తీర్చడం వల్ల దేవునికి కూడా మనమీద కరుణ కలుగుతుందని చెప్పారు. ఆదివారం తూర్పు నియోజకవర్గంలో పలు డివిజన్‌లలో జరిగిన చవితి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. అక్కడ జరిగిన పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కొన్నిచోట్ల నిర్వహించిన అన్నదానాల కార్యక్రమాలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పేద ధనిక అనే బేధం లేకుండా భక్తులు అందరూ కలిసి పూజా కార్యక్రమాలలో పాల్గొంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పటమట సతీష్ చంద్ర, దయాల శిరీష గాంధీ, పూసర్ల లక్ష్మణ్,జాగరపు బాలు, పెనుగొండ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

పటమట : హోం శ్రీ గణపతి యువజన సేవా సమితి ఆధ్వర్యంలో ఎస్ఎస్ఎం స్కూల్ గౌడపాలెం ప్రాంతంలో వినాయక చవితిని పురస్కరించుకొని గత నాలుగు రోజులుగా యార్లగడ్డ సందీప్ నేతృత్వంలో కుంకుమ పూజ, గణేష్ హోమం నిర్వహిస్తూవచ్చారు. ఆదివారం మహా అన్నదానం నిర్వహించారు. సుమారు రెండు వేల మందికి అన్నసమారాధన చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు యల్లబాబు, నందు, రవి, గణేష్, సతీష్, మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

● ముఖ్యమంత్రి చంద్రబాబు తోనే యువతకు మంచి భవిష్యత్తు ఉందని రాష్ట్ర టీడీపీ కార్యదర్శి బొప్పన భవకుమార్ పేర్కొన్నారు. వినాయక చవితి సందర్భంగా 11వ డివిజన్ కరణంగారి బజారులో బద్రీ ఫ్రెండ్స్ సర్కిల్ ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సూపర్ 6 పథకాల అమలుతో పేదలకు ఇచ్చిన హామీలు కూటమి ప్రభుత్వం నెరవేర్చిందన్నారు. ఈకార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, బద్రీ ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు పాల్గొన్నారు.

● పండుగలు మనలో ఐక్యమత్యాన్ని పెంపొందిస్తాయని ఎన్టీఆర్ జిల్లా వైసీపీ అధ్యక్షుడు దేవినేని అవినాష్ పేర్కొన్నారు. వినాయకచవితిని పురస్కరించుకొని తూర్పు నియోజకవర్గ పరిధిలో వైసీపీ నాయకులు, శ్రేయోభిలాషులు ఏర్పాటుచేసిన పలు వినాయక మండపాలను ఆదివారం ఆయన సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, కార్పొరేటర్ చింతల సాంబయ్య, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.


11వ డివిజన్‌లో బొప్పన భవకుమార్ పూజలు

రామలింగేశ్వరాలయంలో దసరా ఉత్సవాలు 22 నుంచి

సత్యనారాయణపురం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : ముత్యాలంపాడులోని పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి దేవాలయంలో ఈనెల సెప్టెంబరు 22వ తేదీ నుంచి వచ్చే అక్టోబరు 2వ తేదీ వరకూ శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు డీవీఎన్ రాజు, దాట్ల శివరామరాజు తెలిపారు. ముత్యాలంపాడు పార్వతీసమేత రామలింగేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం శ్రీదేవీ శర్నవరాత్రి ఉత్సవాల కరపత్రాలను వారు ఆవిష్కరించారు. సెప్టెంబరు 22వ తేదీ సోమవారం గో పూజతో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం అవుతాయన్నారు. ప్రతిరోజు అమ్మవారికి కుంకుమార్చనలు, చండీహోమం, ఖడ్గమాల, లలితా సహస్ర నామపారాయణం జరుగుతాయని తెలిపారు. అమ్మవారు 11 రోజుల పాటు రోజుకొక అలంకారంలో భక్తుల పూజలు అందుకుంటారని చెప్పారు. ఆలయకమిటీ సభ్యులు ఐఎస్ఎన్ రాజు, నాగరాజు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంకు సేవలపై సైకిల్ ర్యాలీ

సత్యనారాయణపురం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : బ్యాంకింగ్‌లో విస్తృత సేవలతో పాటు, సామాజిక, సమాజ, సంక్షేమ కార్యక్రమాలను ప్రోత్సహించడంలో యూనియన్ బ్యాంకు కీలక పాత్ర పోషిస్తుందని యూనియన్ బ్యాంక్ డిప్యూటీ జనరల్‌మేనేజర్ ఎం.వి.తిలక్ అన్నారు. సత్యనారాయణపురం బీఆర్‌టిఎస్‌రోడ్డులో ఆదివారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు.

ప్రమాదకరంగా సర్వీసు రోడ్డు మార్జిన్!

● ఇబ్బందులపాలవుతున్న వాహనదారులు
● స్పందించని అధికారులు

(భారతీనగర్ -ఆంధ్రజ్యోతి)

కరెన్సీనగర్ సర్వీస్ రోడ్డు మార్జిన్ కోతకు గురై వాహనదారుల పాలిట ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ సర్వీస్‌రోడ్డు వెంబడి ప్రధాన అవుట్‌పాల్ డ్రైనేజీ ప్రవహిస్తుంది. డ్రైనేజీకి రోడ్డుకు రక్షణగా ఏర్పాటుచేసిన గోడ నిర్మించి ఏళ్లు గడిచిపోవడంతో పలుచోట్ల ధ్వంసమైపోయాయి. దీంతో మురుగు నీరు ప్రవాహానికి సర్వీస్ రోడ్డు కోతకు గురవుతుంది. ఈ ప్రాంతం మూడు రోడ్డుల కూడలి కావడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. సర్వీస్ రోడ్డులో నుంచి మెయిన్ రోడ్డులోకి ప్రవేశించే రోడ్డు మలుపు కావడంతో రాత్రి సమయంలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో రోడ్ల పక్కన రక్షణ చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహించారని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



సిద్ధార్థ వాకర్స్ క్లబ్ సేవాకార్యక్రమాలు ప్రశంసనీయం

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

మొగల్రాజపురం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : సిద్ధార్థ వాకర్స్‌క్లబ్ మూడు దశాబ్దాల నుండి వాకర్స్‌కు సౌకర్యాలు కల్పిస్తూ ఆరోగ్యం విషయంలో అవగాహన కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలు నిర్వహించడం ప్రశంశనీయమని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. సిద్ధార్థ ఆడిటోరియంలో ఆదివారం సిద్ధార్థ వాకర్స్ క్లబ్ 31వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ వాకర్స్ అంటే ఒక గుర్తింపు తీసుకొచ్చి ఆరోగ్యం పట్ల అవగాహన పెంచూతూ నడక ప్రాధాన్యతను నేటి తరానికి గుర్తు చేస్తున్న క్లబ్ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షను వ్యక్తం చేశారు. విశిష్ట అతిథి సిద్ధార్థ అకాడమీ అధ్యక్షులు మలినేని రాజయ్య మాట్లాడుతూ ఉదయం సాయత్రం వేళ నడకకు వస్తున్న సభ్యులకు గుర్తింపు కార్డులు ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. వాకర్స్ ఇంటర్‌నేషనల్ ఉత్తమ బులెటిన్‌గా ప్రశంసలు అందుకున్న నడకతో ఆరోగ్యం మాసపత్రిక సంపాదకులు వాకర్ పులిపాక కృష్ణాజీని సత్కరించారు. ఈకార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించగా సిద్ధార్థ తుల్యాంక యోగాలయ గ్రూప్ సభ్యుల స్కిట్‌తో కుమారి గాయత్రి స్వాగత నృత్యంతో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిద్ధార్థ వాకర్స్ క్లబ్ అధ్యక్షులు కట్టా జనార్ధన్‌రావు, కార్యదర్శి వాకర్ కాట్రగడ్డ నాగేశ్వరరావు, మహిళా విభాగ అధ్యక్షురాలు ఘంటశాల లక్ష్మీ, కోశాధికారి యు.రాజు పాల్గొన్నారు.



మలినేని రాజయ్యను సత్కరిస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, వాకర్స్ కమిటీ సభ్యులు

వరద నివారణకు శాశ్వత చర్యలు చేపట్టాలి

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్ బాబూరావు

విజయవాడ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : నగరాన్ని బుడమేరు అతలాకుతలం చేసి సంవత్సరమైనా వరదముంపు నివారణకు తీసుకున్న శాశ్వత చర్యలు, బడ్జెట్‌లో కేటాయించిన నిధులు, ఇప్పటివరకు చేసిన ఖర్చు గురించి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాలని సీపీఐ (యం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సి.హెచ్ బాబూరావు కోరారు. నగరంలో ఆదివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వంపై ఆయన పలు ప్రశ్నలు సంధించారు. కేంద్ర ప్రభుత్వాన్ని కోరిన రూ.6,880 కోట్లలో ఎంత నిధులు వచ్చాయో తెలపాలన్నారు. ఈ ఏడాది శాసనసభలో మంత్రి ప్రకటించిన విధంగా ముంపు నివారణకు నిర్దేశించిన ప్రణాళిక ఎంతవరకు అమలుజరిగిందని ప్రశ్నించారు. కృష్ణానది తరహాలోనే బుడమేరుకు రక్షణగోడలు(రిటైనింగ్ వాల్) నిర్మాణానికి అనుమతులు ఎంతవరకు వచ్చాయో ప్రభుత్వం వెల్లడించాలన్నారు. వెలగలేరు రెగ్యులేటర్ సామర్థ్యం పెంపు ప్రతిపాదనలు ఏ దశలో ఉన్నాయి, బుడమేరు డైవర్షన్ ఛానల్ సామర్థ్యం 15 వేల క్యూసెక్కుల నుంచి 37,500 క్యూసెక్కులకు పెంచడానికి తీసుకున్న చర్యలు, నిధులు కేటాయించిపు గురించి ప్రజలకు తెలియచేయాలని బాబూరావు డిమాండ్ చేశారు.


మాట్లాడుతున్న సీహెచ్ బాబూరావు


ఎస్ఎస్ఎం స్కూల్ పక్కన గుట్టలుగా చెట్ల కొమ్మలు

సారూ..చెట్ల కొమ్మలు తొలగించరూ

పటమట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్ఎం స్కూల్ ఆవరణలో పెరిగిన పెద్ద పెద్ద చెట్ల కొమ్మలను నరికివేశారు. నరికిన చెట్ల కొమ్మలను రోడ్లపై వదిలివేశారు. చెట్లు నరికి నాలుగు రోజులు కావస్తున్న వాటిని తొలగించకపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. సంబంధిత అధికారులు స్పందించి వాటిని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖలో..

ఉద్యోగాల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కలెక్టరేట్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధ్వర్యంలో నడుస్తున్న వన్‌స్టాప్ సెంటర్ (విజయవాడ) నందు సెంటర్ అడ్మినిస్ట్రేటర్ 1 పోస్ట్, సైకో సోషల్ కౌన్సిలర్ 1 పోస్ట్ భర్తీ చేసేందుకు గత ఏడాది అక్టోబరు 16న నోటిఫికేషన్ ఇచ్చి ఇంటర్వ్యూలు నిర్వహించడం జరిగిందని, అయితే ఇంటర్వ్యూలో ఎవరూ అర్హత సాధించనందున తిరిగి నోటిఫికేషన్ జారీ చేసినట్లు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికార అధికారి షేక్ రుక్సానా సుల్తానా బేగం తెలిపారు. కాంట్రాక్టు/ఔట్‌సోర్సింగ్ పద్ధతిపై పనిచేయుటకు స్థానిక అర్హులైన 18 నుంచి 42 సంవత్సరాల వయస్సు గలిగిన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు.


గుంతలో ఉంచిన చెట్టు కొమ్మలు

ఆదమరిస్తే అంతే..

భారతీనగర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : ఇది చూడడానికి చిన్న సమస్యగా కనిపించినా ఆదమరిస్తే ప్రాణాలకే ప్రమాదకరంగా మారుతుంది. భారతీనగర్ కాలనీలోని కేశినేని భవనం సమీపంలో గురునానక్, భారతీనగర్ కాలనీ 5వ రోడ్డు ఉంది. రెండు కాలనీల అనుసంధాన రోడ్డు కావడంతో పాటు కేశినేని భవనం (ఎంపీ కార్యాలయం) ఉండడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. ప్రధాన రోడ్డులో గుంత ఏర్పడి వాహనాల రాకపోకలకు ప్రమాదకరంగా మారింది.


నిపుణులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

సిద్ధార్థ వైద్య కళాశాల్లో
వర్క్‌షాప్ విజయవంతం

మాచవరం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సిద్ధార్థ వైద్య కళాశాల గైనకాలజీ విభాగంలో పెరినియల్ టియర్స్ మరమ్మతులపై ఆదివారం ఒక రోజు హ్యాండ్స్ ఆన్ వర్క్‌షాపును విజయవంతంగా నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన ఫెర్నాండెజ్ హాస్పటల్‌కు చెందిన ముగ్గురు ప్రముఖ నిపుణులు 30 మంది పీజీ విద్యార్థులకు శిక్షణనిచ్చారు. ఈ కార్యక్రమంలో గైనకాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ కేశవచంద్ర, ప్రొఫెసర్ వామాబిందు, ప్రిన్సిపాల్ ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.


శిక్షణ పొందుతున్న విద్యార్థులు


మనోజ్‌కు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న ఆలయ అధికారులు

దుర్గమ్మ సన్నిధిలో నటుడు మంచు మనోజ్

ఇంద్రకీలాద్రి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానంలో కనకదుర్గమ్మను ఆదివారం సినీ హీరో మంచు మనోజ్ దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. దర్శనం అనంతరం వేద పండితులు ఆశీస్సులు అందజేశారు. ఆలయ అధికారులు అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం బహూకరించారు.

● దుర్గామల్లేశ్వర దేవస్థానంలో ఉచిత ప్రసాదం పంపిణీకి, నిత్య అన్నదాన పథకానికి పలువురు దాతలు ఆదివారం విరాళాలు అందజేశారు. విజయవాడ సత్యనారాయణపురానికి చెందిన డి.కనకదుర్గ కావ్య, సుధీర్ కుమార్ పేరున అన్నదాన పథకానికి రూ.1,00,116, విద్యాధరపురానికి చెందిన పి.సుబ్బలక్ష్మి పేరు మీద వారి కుమారుడు శివశంకర్, కోడలు విజయదుర్గ కామేశ్వరి నిత్యాన్నదాన పథకానికి రూ.1,00,111 విరాళంగా అందజేశారు.

ఫోకల్ పాయింట్ సేవలు అభినందనీయం

బెంజ్‌సర్కిల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : విదేశాలలో అతి తక్కువ ఖర్చుతో డాక్టర్స్‌గా తీర్చిదిద్దుతున్న ఇంటర్నేషనల్ హయ్యర్ స్కూల్ ఆఫ్ మెడిసిన్ విజయవాడ ఫోకల్ పాయింట్ సేవలు అభినందనీయమని జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి అమ్మిశెట్టి వాసు తెలిపారు. ఆదివారం ఓ హోటల్లో ఇంటర్నేషనల్ హయ్యర్ స్కూల్ ఆఫ్ మెడిసిన్ విజయవాడ ఫోకల్ పాయింట్‌లో అడ్మిషనన్ తీసుకున్న నూతన విద్యార్థులకు వైట్‌కోట్ సెర్మోని కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, సామాన్యులు డాక్టర్ కోర్స్ కోట్లు ఖర్చుయ్యే నేటి పరిస్థితిల్లో విదేశాలలో అతి తక్కువ ఖర్చుతోపాటు స్కాలర్షిప్ వెసులుబాటును కల్పిస్తూ ఈ సంస్థ తోడ్పాటు అందించడం సంతోషకరమన్నారు. ప్రతి ఏడాది సుమారు 200 మంది విద్యార్థులను విదేశాలలకు పంపించడమే కాకుండా 2000 మంది డాక్టర్లుగా తీర్చిదిద్దడం సామాన్య విషయం కాదని కొనియాడారు. అనంతరం నూతన విద్యార్థులకు వైట్ ఎప్రాన్‌లతో సత్కరించారు. కార్యక్రమంలో విద్యార్థులు తల్లిదండ్రులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు

అజిత్‌సింగ్‌నగర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : సీపీఎం అనుబంధ సంస్థ సీఐటీయూ సెంట్రల్ సిటీ 11వ మహాసభ అజిత్‌సింగ్‌నగర్‌లోని సీపీఎం కార్యాలయంలో ఆదివారం జరిగింది. ఎన్టీఆర్ జిల్లా సీఐటీయూ ప్రధాన కార్యదర్శి వి.అప్పారావు, జిల్లా అధ్యక్షుడు ఏ. వెంకటేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఉద్యోగ, కార్మిక, రైతు, యువజన, మహిళల కోసం సీఐటీయూ ఎన్నో పోరాటాలు చేసిందన్నారు. మున్ముందు ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తామని పేర్కొన్నారు.

దిక్సూచి

సీఎస్ రిజిస్ట్రేషన్లు ప్రారంభం

కంపెనీ సెక్రటరీ(సీఎస్) డిసెంబరు 2025 రిజిస్ట్రేషన్ కోసం 'ద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా'(ఐసీఎస్ఐ) నోటిఫికేషన్ వెలువడింది. 2025 సెప్టెంబర్ 26 వరకు రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చు. ఆలస్య రుసుముతో అక్టోబర్ 10 వరకు అవకాశం ఉంది. నోటిఫికేషన్ గైడ్‌లైన్స్ ప్రకారం 2025 డిసెంబర్ 22 నుంచి 29 వరకు హిందీ, ఇంగ్లిష్‌లో పరీక్షలు నిర్వహించనున్నారు.



పరీక్ష ఫీజు: ఎగ్జిక్యూటీవ్ ప్రోగ్రామ్ ఫీజు ఒక్క గ్రూపునకు రూ. 1500/-, ప్రొఫెషనల్ ప్రోగ్రామ్ ఫీజు ఒక్క గ్రూపునకు రూ.1800/-, ఆలస్య రుసుము 250/-

చివరి తేదీ: 2025 సెప్టెంబర్ 26

వెబ్‌సైట్: smash.icsi.edu



గ్రామీణ నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, తెలంగాణ ప్రభుత్వం వారి స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థలో మేధా చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని నిరుద్యోగ యువతకు ఉచితంగా ఉద్యోగ ఆధారిత సాంకేతిక శిక్షణ ఇవ్వనున్నారు.

కంప్యూటర్ హార్డ్‌వేర్, సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ వస్తువుల రిపేర్, సీసీటీవీ టెక్నీషియన్ కోర్సు: ఆరు నెలల శిక్షణ, పదో తరగతి పాసై ఉండాలి.

టైలరింగ్, ఎంబ్రాయిడరీ, జర్దోసీ, క్విల్ట్ బ్యాగ్స్ మేకింగ్: ఆరు నెలల కోర్సు, ఎనిమిదో తరగతి పాసై ఉండాలి

ఎలక్ట్రీషియన్(డొమెస్టిక్), సోలార్ సిస్టమ్ ఇన్‌స్టలేషన్ - సర్వీస్: ఆరు నెలల కోర్సు, ఐటీఐ, ఇంటర్ పాసై ఉండాలి

వెల్డింగ్ అండ్ ఫ్యాబ్రికేషన్: మూడు నెలలు, పదో తరగతి పాసై ఉండాలి. **వయస్సు:** అభ్యర్థుల వయస్సు 18-25 సంవత్సరాల మధ్యలో ఉండాలి.

కావాల్సిన పత్రాలు: అర్హతలకు సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్స్, జిరాక్స్ సెట్, పాస్‌పోర్ట్ ఫోటోలు, ఆధార్ కార్డు, ఆదాయ ధ్రువ పత్రం. అడ్మిషన్ లభించిన వారికి ఉచిత భోజన, హాస్టల్ వసతి కల్పిస్తారు.

చిరునామా: స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థ, జలాల్‌పూర్(గ్రా), పోచంపల్లి మండలం, యాదాద్రి భువనగిరి జిల్లా, తెలంగాణ - 508 204(హైదరాబాద్ హయత్ నగర్ నుంచి 524 నంబర్ బస్సు ద్వారా సంస్థకు చేరుకోవచ్చు).

పూర్తి వివరాల కోసం కింది నెంబర్లను సంప్రదించవచ్చు.

అడ్మిషన్ల తేదీ: 2025 సెప్టెంబర్ 3 ఉదయం 10 గంటలకు సంస్థలో వ్యక్తిగతంగా హాజరు కావాల్సి ఉంటుంది.

ఫోన్: 9133908000, 9133908222, 9948466111 **వెబ్‌సైట్:** www.srtri.com/

జాబ్ కార్నర్

ఆర్ఆర్‌బీలో సెక్షన్ కంట్రోలర్స్

ఖాళీలు 368

దేశవ్యాప్తంగా ఉన్న అన్ని రైల్వే జోన్లలో మొత్తం 368 సెక్షన్ కంట్రోలర్ పోస్టుల భర్తీకి రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డ్ త్వరలో నోటిఫికేషన్ విడుదల చేయనుంది. ఆర్ఆర్‌బీకి సంబంధించిన 21 రీజియన్లలో ఈ పోస్టులు ఉన్నాయి. జోన్‌వారీ ఖాళీలు, పరీక్ష విధానం తదితర వివరాలు త్వరలో వెల్లడించనున్నట్లు బోర్డు తెలిపింది.

వయస్సు: అభ్యర్థుల వయస్సు 20 నుంచి 33 ఏళ్ల మధ్యలో ఉండాలి.

దరఖాస్తు తేదీలు: 2025 సెప్టెంబర్ 15 నుంచి అక్టోబర్ 14 వరకు

వెబ్‌సైట్: www.rrbapply.gov.in

పవర్ గ్రిడ్ కార్పొరేషన్‌లో ఫీల్డ్ ఇంజనీర్లు

ఖాళీలు 1543

పవర్ గ్రిడ్ కార్పొరేషన్‌లో ఒప్పంద ప్రాతిపదికన 1543 ఫీల్డ్ ఇంజనీర్, ఫీల్డ్ సూపర్‌వైజర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వెలువడింది. 'పవర్ గ్రిడ్' నిర్వహించే రాత పరీక్ష ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

పోస్టులు	ఖాళీలు
ఫీల్డ్ ఇంజనీర్(ఎలక్ట్రికల్)	532
ఫీల్డ్ ఇంజనీర్(సివిల్)	198
ఫీల్డ్ సూపర్‌వైజర్(ఎలక్ట్రికల్)	535
ఫీల్డ్ సూపర్‌వైజర్(సివిల్)	193
ఫీల్డ్ సూపర్‌వైజర్(ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్)	85

అర్హత: కనీసం 55 శాతం మార్కులతో డిప్లొమా, బీఈ/బీటెక్, ఎంఈ/ఎంటెక్ పాస్ కావడంతోపాటు, ఉద్యోగ అనుభవం ఉండాలి.

వయస్సు: 2025 సెప్టెంబర్ 17 నాటికి 29 ఏళ్ల మించి ఉండరాదు. రిజర్వేషన్లను అనుసరించి వయో పరిమితిలో సడలింపు ఉంటుంది.

పరీక్ష కేంద్రాలు: ఢిల్లీ, భోపాల్, కోల్‌కతా, బెంగళూరు, గువహటి, ముంబాయి

చివరి తేదీ: 2025 సెప్టెంబర్ 1 **వెబ్‌సైట్:** www.powergrid.in/

బెల్‌లో ట్రైనీ ఇంజనీర్లు

ఖాళీలు 80

హైదరాబాద్‌లోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ సంస్థలో తాత్కాలిక ప్రాతిపదికన ట్రైనీ ఇంజనీర్-1, ప్రాజెక్ట్ ఇంజనీర్-1 పోస్టుల భర్తీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను కోరుతున్నారు.

- ట్రైనీ ఇంజనీర్-1: **67 పోస్టులు**
- ప్రాజెక్ట్ ఇంజనీర్-1: **13 పోస్టులు**

విభాగాలు: ఎలక్ట్రానిక్స్, మెకానికల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్, సివిల్

అర్హత: బీఈ/బీటెక్ ఉత్తీర్ణతతోపాటు, ఉద్యోగ అనుభవం

వయస్సు: 2025 ఆగస్ట్ 1 నాటికి 28 నుంచి 32 సంవత్సరాల మధ్యలో ఉండాలి. రిజర్వేషన్లను అనుసరించి వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా

చివరి తేదీ: 2025 సెప్టెంబర్ 12

వెబ్‌సైట్: https://bel-india.in/job-notifications/

ఇంటెలిజెన్స్ బ్యూరోలో జూనియర్ ఆఫీసర్లు

ఖాళీలు 394

కేంద్ర హోమ్ మంత్రిత్వ శాఖ పరిధిలోని ఇంటెలిజెన్స్ బ్యూరోలో 394 జూనియర్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వెలువడింది.

అర్హత: ఇంజనీరింగ్ డిప్లొమా(ఎలక్ట్రానిక్స్/ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలీకమ్యూనికేషన్/ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ కంప్యూటర్ సైన్స్ కంప్యూటర్ ఇంజనీరింగ్/ కంప్యూటర్ అప్లికేషన్స్), డిగ్రీ/ఎలక్ట్రానిక్స్/ కంప్యూటర్ సైన్స్/ఫిజిక్స్/మేథ్స్, కంప్యూటర్ అప్లికేషన్స్ ఉత్తీర్ణత కలిగి ఉండాలి)

వయస్సు: 2025 సెప్టెంబర్ 14 నాటికి 18-27 సంవత్సరాల మధ్యలో ఉండాలి. రిజర్వేషన్లను అనుసరించి వయో పరిమితిలో సడలింపు ఉంటుంది.

ఎంపిక:

టైర్-1: వంద మార్కులకు ఆన్‌లైన్ పరీక్ష ఉంటుంది. జనరల్ మెంటల్ ఎబిలిటీ 25 శాతం, టెక్నికల్ సబ్జెక్టులు 75 శాతం ఉంటాయి. నెగెటివ్ మార్కింగ్ ఉంది.

టైర్-2: 30 మార్కులకు స్కిల్ టెస్ట్ ఉంటుంది. ఇది ప్రాక్టికల్, టెక్నికల్ టెస్ట్.

టైర్-3: 20 మార్కులకు ఇంటర్వ్యూ, పర్సనాలిటీ టెస్ట్ ఉంటుంది.

చివరి తేదీ: 2025 సెప్టెంబర్ 14

వెబ్‌సైట్: www.ncs.gov.in, www.mha.gov.in

నేషనల్ హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్‌లో

ఖాళీలు 248

నేషనల్ హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ 248 జూనియర్ ఇంజనీర్(నాన్ ఎగ్జిక్యూటివ్) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

- అసిస్టెంట్ రాజ్‌భాషా ఆఫీసర్ - **11 పోస్టులు**
- జూనియర్ ఇంజనీర్(సివిల్) - **109 పోస్టులు**
- జూనియర్ ఇంజనీర్(ఎలక్ట్రికల్) - **46 పోస్టులు**
- జూనియర్ ఇంజనీర్(మెకానికల్) - **49 పోస్టులు**
- జూనియర్ ఇంజనీర్(ఈసీ) - **17 పోస్టులు**
- సూపర్‌వైజర్(ఐటీ) - **1 పోస్టు**
- సీనియర్ అకౌంటెంట్ - **10 పోస్టులు**
- హిందీ ట్రాన్స్‌లేటర్ - **05 పోస్టులు**

వయస్సు: 30 సంవత్సరాలకు మించి ఉండరాదు. రిజర్వేషన్లను అనుసరించి వయో పరిమితిలో సడలింపు ఉంటుంది.

అర్హతలు: కనీసం 60 శాతం మార్కులతో డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతోపాటు ఉద్యోగ అనుభవం

చివరి తేదీ: 2025 అక్టోబర్ 1 **వెబ్‌సైట్:** www.nhpcindia.com/

SCHOLARSHIP ALERT

Reliance Foundation Postgraduate

The Reliance Foundation Postgraduate Scholarships aim to enable and propel India's future leaders who can think big, think green, and think digital for the benefit of society.

Eligibility: Be a resident Indian citizen.

- First-year PG students who secured a score of 550 - 1,000 in the GATE Examination. OR Students who have scored 7.5 or above in their Undergraduate CGPA (or % normalised to CGPA)
- Eligible degree programmes - Computer Science, Artificial Intelligence, Mathematics & Computing, Electrical/or Electronics Engg., Chemical Engg., Mechanical Engg., Renewable & New Energy, Material, Science & Engg. and Life Sciences.

Rewards: Up to INR 6,00,000 over the duration of the degree

Last Date to Apply: 04-10-2025

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/RFS12

Undergraduate

The Reliance Foundation Undergraduate Scholarships aim to support meritorious students from all corners of the country in pursuing their undergraduate education. This empowers them to continue their studies, become successful professionals, and realize their dreams, unlocking their potential to uplift themselves and their communities and contribute towards India's future socio-economic development.

Eligibility: Be a resident Indian citizen

- Passed Standard 12th with minimum 60%
- Currently enrolled in the 1st year (academic year 2025-26) in a regular full-time degree course in any stream
- Students having household income < Rs. 15 Lakhs (preference given to < Rs. 2.5 Lakhs)
- Aptitude Test is mandatory

The following students are not eligible: Students who are in the 2nd year or higher (have started their courses from academic year 2024-25 or before)

- Students pursuing their degree through online, hybrid, remote, distance or any other non-regular modes
- Students who have passed their diploma after std. 10th
- Students pursuing 2-year & 6 years undergraduate degree courses


Rewards: Up to INR 2,00,000 over the duration of the degree

Last Date to Apply: 04-10-2025

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/RFS13

buddy4study.com



చిత్రజ్యోతి

★ SINCE 1965 ★



అనుష్క నట విశ్వరూపం చూపించబోతున్నాం

క్రిష్

'ఘాటి' చిత్రంలో అనుష్క శీలావతిగా మన ముందుకు రాబోతున్నారు. ఆమె నట విశ్వరూపాన్ని ఈ సినిమాలో చూపించబోతున్నాం' అని దర్శకుడు క్రిష్ జాగర్లమూడి అన్నారు. అనుష్కశెట్టి, విక్రమ్ ప్రభు ప్రధాన పాత్రధారులుగా క్రిష్ తెరకెక్కించిన చిత్రమిది. రాజీవ్ రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి నిర్మించారు. ఈనెల 5న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర బృందం మీడియా సమావేశం ఏర్పాటు చేసింది. క్రిష్ మాట్లాడుతూ 'కొన్ని కథలు చాలా సహజంగా, పచ్చిగా, పేలడానికి సిద్ధంగా ఉన్నట్లుగా ఉంటాయి. అలాంటి కథ 'ఘాటి'. తూర్పు కనుమలు, ఆ పర్వత శ్రేణులు, అక్కడి ధృడమైన మనుషులు, వారి గొప్ప వ్యక్తిత్వాలను కలిపి ఒక మంచి కథను చెప్పే అవకాశం దొరికింది. విక్రమ్ ప్రభు కోసమే దేశిరాజు క్యారెక్టర్‌ని రాశాను. ఈ సినిమాకి జగపతిబాబు పాత్ర ప్రత్యేక ఆకర్షణ' అని చెప్పారు. జగపతిబాబు మాట్లాడుతూ 'అనుష్క స్వీటీ అని మనందరికీ తెలుసు. కానీ ఈ సినిమాలో ఘాటుగా ఉండబోతోంది. నేను పోలీస్ పాత్రను పోషించాను. నా పాత్రను డైరెక్టర్ క్రిష్ చాలా అద్భుతంగా రాశారు' అని చెప్పారు. విక్రమ్ ప్రభు మాట్లాడుతూ 'అనుష్క, జగపతిబాబు, చైతన్య రావుతో కలసి నటించడం చాలా ఆనందాన్ని ఇచ్చింది' అని అన్నారు. నటుడు చైతన్య రావు మాట్లాడుతూ 'నా క్యారెక్టర్‌ని తెరపై చూసుకున్నప్పుడు చాలా కొత్తగా అనిపించింది. నాలో కొత్త కోణాన్ని చూపించిన దర్శకుడు క్రిష్‌కి ధన్యవాదాలు' అని అన్నారు. చిత్ర నిర్మాత రాజీవ్ రెడ్డి మాట్లాడుతూ 'ఈ సినిమాలో అనుష్కని రియల్ క్వీన్‌గా చూస్తారు. చాలా అద్భుతమైన సినిమా తీశాం. మేమందరం సినిమా విజయంపై నమ్మకంతో ఉన్నాం' అని అన్నారు.

నీ పుట్టినరోజును మిస్ అవుతున్నా



తనయుడు గౌతమ్ పుట్టినరోజు వేడుకలను మిస్ కావడం ఇదే తొలిసారి అని మహేశ్‌బాబు భావోద్వేగానికి లోనయ్యారు. ఆదివారం గౌతమ్ పుట్టినరోజు. ఈ సందర్భంగా గౌతమ్‌కు శుభాకాంక్షలు చెబుతూ ఎక్స్‌లో మహేశ్‌బాబు పోస్ట్ పెట్టారు. 'గౌతమ్ ఈ ఏడాది నీ పుట్టినరోజును మిస్ అవుతున్నాను. 19వ పుట్టినరోజు శుభాకాంక్షలు. నేను మిస్ అయిన నీ తొలి పుట్టినరోజు ఇదే. నా ప్రేమ నీకెప్పుడూ తోడుగా ఉంటుంది. నువ్వు చేసే ప్రతీ పనికీ ఎక్కువ సంతోష పడే వ్యక్తిని నేనే. నువ్వు మరింత ఎత్తుకు ఎదగాలని కోరుకుంటున్నా' అని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా గౌతమ్‌తో దిగిన పాత ఫొటోను అభిమానులతో పంచుకున్నారు. ప్రస్తుతం రాజమౌళి తెరకెక్కిస్తున్న 'ఎస్ఎస్ఎంబీ 29' చిత్రీకరణలో బిజీగా ఉండటం వల్లే గౌతమ్ పుట్టినరోజు వేడుకలకు మహేశ్‌బాబు హాజరు కాలేకపోయారు.





ముమ్మరంగా కుట్టుమిషన్ శిక్షణ

- బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో 65 వేల మందికి ఉచితంగా..
- ఇప్పటికే పూర్తి చేసుకున్న 27 వేల మంది
- ఉచిత మిషన్ల కోసం ఎదురుచూపులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ప్రభుత్వం రెండు నెలల కిందట ప్రారంభించిన కుట్టుమిషన్ శిక్షణా కేంద్రాలు సత్ఫలితాలిస్తున్నాయి. బీసీ, ఈడబ్ల్యూఎస్ శాఖల ఆధ్వర్యంలో బీసీ మహిళలతో పాటు ఈబీసీ, కమ్మ, రెడ్డి, క్షత్రియ, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, కాపు కార్పొరేషన్ల ద్వారా 65,987 మంది మహిళలకు శిక్షణ అందిస్తున్నారు. వీరిలో ఇప్పటికే 27,096 మంది శిక్షణ పూర్తి చేసుకుని రెడీమేడ్ దుస్తులు కుట్టే నైపుణ్యం సాధించారు. గతంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఇంతటి భారీ స్థాయిలో కుట్టు మిషన్ల శిక్షణ ఇచ్చిన సందర్భం లేదు. రాష్ట్రవ్యాప్తంగా లక్ష మంది బీసీ, ఈబీసీ మహిళలకు శిక్షణ ఇచ్చి మిషన్లు పంపిణీ చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. 3,43,413 మంది శిక్షణ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. 680 శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేసి 1,326 బ్యాచ్‌ల ద్వారా మొదటగా 65,987 మందికి శిక్షణ ఇచ్చేందుకు నిర్ణయించారు. ప్రతి జిల్లాలో మండల/మున్సిపాలిటీల్లో శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మిషన్లు, ఇతర సామగ్రితో పాటు ఆయా సంస్థల ద్వారా అనుభవజ్ఞులైన ట్రైనర్లను నియమించి ప్రాథమిక కుట్టు శిక్షణ ఇస్తున్నారు.

అత్యంత పారదర్శకతతో శిక్షణ

గతంలో పలు శిక్షణా కార్యక్రమాలు మొక్కుబడిగా సాగిన నేపథ్యంలో కుట్టు మిషన్ శిక్షణను పారదర్శకంగా నిర్వహించాలని నిర్ణయించారు. శిక్షణ పొందే మహిళలను ఏపీఎఫ్ఎస్ఎస్ ద్వారా ప్రత్యేక ఫేస్ రికగ్నేషన్ సిస్టం (ఎఫ్ఆర్ఎస్) యాప్‌లో నమోదు చేసి టీపీఎంఎంఎస్ వెబ్‌పోర్టల్‌లో పొందుపరిచారు. మొదటిసారిగా ప్రతిరోజు రెండుసార్లు సెంటర్‌కు వచ్చేటప్పుడు, వెళ్లేటప్పుడు హాజరు తీసుకున్నారు. ఎంపీడీవో లేదా మున్సిపల్ కమిషనర్లు ప్రతివారం శిక్షణా కేంద్రాలను వ్యక్తిగతంగా సందర్శించి, పనితీరు వివరాలను సేకరిస్తూ తగు ధ్రువపత్రాలను అప్‌లోడ్ చేస్తున్నారు. ఎఫ్ఆర్ఎస్ ద్వారా ఇన్, ఔట్ కాలాన్ని లెక్కించి శిక్షణా సంస్థలకు ఫీజు చెల్లిస్తున్నారు.

అధికారులు, ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ

కుట్టుమిషన్ శిక్షణ సెంటర్లను సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రులు సవిత, ఇతర మంత్రులు సందర్శించారు. అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. శిక్షణ పొందిన ప్రతి మహిళకు కుట్టుమిషన్ ఉచితంగా ఇవ్వాలని ప్రభుత్వం పేర్కొనడంతో భారీగా దరఖాస్తులు వచ్చాయి. చివరకు శిక్షణకు హాజరయ్యే వారికి మాత్రమే మిషన్లు ఇస్తామని నిబంధనలు కఠినం చేయడంతో వాస్తవంగా శిక్షణ పొంది జీవనభృతి పొందాలనుకున్న వారు హాజరవుతున్నారు. దరఖాస్తు చేసిన వారందరికీ శిక్షణ ఇచ్చే పరిస్థితి లేకపోవడంతో వడపోతతో ఎంపిక చేస్తున్నారు. శిక్షణ కోసం ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు సైతం సిఫారసులు చేస్తుండటంతో డిమాండ్ పెరిగింది. పీ4 ద్వారా మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు కుట్టుమిషన్ శిక్షణా కేంద్రాల ఏర్పాటుకు నియోజకవర్గస్థాయిలో ఎమ్మెల్యేలు ప్రాధాన్యమిస్తున్నారు.

విశ్వకర్మ యోజనలో లేని కుట్టుమిషన్ శిక్షణ

వృత్తిపరమైన శిక్షణ అందించేందుకు ఉద్దేశించిన కేంద్ర ప్రభుత్వ పీఎం విశ్వకర్మ యోజన పథకంలో కుట్టుమిషన్ శిక్షణ లేదు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న శిక్షణకు విపరీత ఆదరణ లభించింది. ఈ నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని నిరంతరంగా కొనసాగించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే 3 లక్షలకు పైగా దరఖాస్తులు రావడంతో.. విడతల వారీగా అందరికీ శిక్షణ అందించి మిషన్లు పంపిణీ చేయాలని భావిస్తున్నారు.



మార్కాపురం పర్యటనలో మహిళలకు కుట్టు మిషన్లు అందజేస్తున్న సీఎం చంద్రబాబు (ఫైల్)

మూడు నెలలైనా.. విడుదల కాని నిధులు

ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న కుట్టుమిషన్ శిక్షణకు నిధుల సమస్య వెంటాడుతోంది. పథకం ప్రారంభించి మూడు నెలల పైబడినా శిక్షణకు అవసరమైన నిధులు మాత్రం విడుదల కాలేదు. బీసీ సంక్షేమశాఖ, ఈడబ్ల్యూఎస్ శాఖ అధికారులు ఆర్థిక శాఖకు ప్రతిపాదనలు పంపినా.. ఏవేవో కొర్రీలు వేసి ఒక్క పైసా విడుదల చేయడం లేదు. సజావుగా సాగుతున్న ఈ పథకం ముందుకు సాగాలంటే ఈ సమస్య తీర్చాల్సి ఉంది. అధికారులు, శిక్షణా సంస్థలు పదేపదే ఆర్థిక శాఖ అధికారులకు విన్నవించుకుంటున్నా.. ఫైల్ ముందుకు కదలడం లేదంటున్నారు. దీంతో పాటు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు మిషన్లు కొనుగోలు చేసి పంపిణీ చేయాల్సి ఉంది. ప్రభుత్వం నిధులు విడుదల చేసి.. కుట్టుమిషన్ల పంపిణీకి సహకరించాలని కోరుతున్నారు.

విధి వంచితుడికి 'రోటరీ' చేయూత

- కదిలించిన 'ఆంధ్రజ్యోతి' కథనాలు



దత్తుబాబుకు ఆర్థిక సాయం అందజేస్తున్న రోటరీ అచీవర్స్ క్లబ్ సభ్యులు

గుంటూరు(విద్య), ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ స్పోర్ట్స్ స్కూల్లో సీటు సంపాదించి ఫుట్‌బాల్ క్రీడాకారుడిగా రాష్ట్ర స్థాయిలో సత్తా చాటిన మాజీ క్రీడాకారుడు ఇఫ్రాయం దత్తుబాబుకు రోటరీ క్లబ్ సభ్యులు వితరణ ప్రకటించారు. రోడ్డు ప్రమాదంలో వెన్నువిరిగి 16 ఏళ్లకే మంచానికి పరిమితమైన గుంటూరు హౌసింగ్ బోర్డ్ కాలనీకి చెందిన ఇఫ్రాయం దత్తుబాబు దీనస్థితి గురించి ఇటీవల 'ఆంధ్రజ్యోతి', 'ఏబీఎన్ ఆంధ్రజ్యోతి'లో చూసి చలించిపోయామని సభ్యులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం దత్తు బాబు కుటుంబాన్ని ఆయన ఇంటి వద్ద కలిసి రూ.50,000 ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు అచీవర్స్ అధ్యక్షుడు కొండపనేని విజయకృష్ణ, కార్యదర్శి గోనుగుంట్ల వెంకట్ తదితరులు పాల్గొన్నారు. కాగా, దత్తుబాబు తల్లి రూత్‌రాణి మాట్లాడుతూ కుమారుడికి ఇంకా రెండు పెద్ద సర్జరీలు జరగాల్సి ఉందని, సాయం చేసేవారు 9000980948 నంబరుకు ఫోన్‌పే/గూగుల్ పే చేయాలని కోరారు. బ్యాంకు ఖాతాలో జమ చేయాలనుకునే వారు 'దుగ్గిరాల ఇఫ్రాయం దత్తుబాబు, ఎస్‌బీఐ ఖాతా నంబరు 62487417417, ఐఎఫ్‌సీ కోడ్ ఎస్‌బీఐఎన్0021263'కు పంపాలని విజ్ఞప్తి చేశారు.

వ్యవసాయ వర్సిటీలో గోల్‌మాల్

- కోరం లేకుండానే రూ.500 కోట్లు డ్రా .. బదిలీల్లోనూ అవినీతి
- వీసీపై గవర్నర్‌కు ఓ ప్రొఫెసర్ ఫిర్యాదు

(గుంటూరు సిటీ-ఆంధ్రజ్యోతి)

ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని వీసీ భ్రష్టు పట్టిస్తున్నారని అక్కడే విధులు నిర్వహిస్తున్న ఓ ప్రొఫెసర్ ఆరోపించారు. ఈ మేరకు ఆయన గవర్నర్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. 'వర్సిటీ పాలక మండలి సమావేశాలు గత రెండేళ్ల నుంచి కోరం లేకుండానే వీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నారు. ఆర్థిక కమిటీని ఏర్పాటు చేయాలన్న నిబంధనను కూడా వీసీ తుంగలో తొక్కి వర్సిటీ నిధులు రూ.500 కోట్ల వరకూ డ్రా చేశారు. వర్సిటీకి సంబంధించిన సివిల్ పనుల నిమిత్తం కాంట్రాక్టర్లకు చెల్లింపుల కోసం ఎస్టేట్ అధికారి నుంచి భారీ మొత్తంలో వసూలు చేస్తున్నారు. 2023-24లో 187 మంది, 2024-25లో 285 మంది ఉద్యోగుల బదిలీలు జరిగాయి. వీసీకి డబ్బు, బంగారం, విలువైన చీరలు ఇచ్చినవారికి మాత్రమే ప్రాధాన్య పోస్టులు ఇచ్చారు. నా బదిలీకి కూడా లంచం డిమాండ్ చేశారు. ఈ ముడుపుల సొమ్ముతో కర్నూలులో రూ.కోట్ల వ్యయంతో వీసీ ఇల్లు నిర్మించుకున్నారు. తాత్కాలిక వీసీ పర్యటనల వివరాలు కచ్చితంగా గవర్నర్‌కు తెలియజేయాలన్న నిబంధనను పట్టించుకోవడం లేదు. వర్సిటీలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై ఎవరైనా ప్రశ్నిస్తే ఆత్మహత్య చేసుకుంటానని ఉద్యోగులను వీసీ బెదిరిస్తున్నారు. వాహనాల పేరుతో కూడా నిధులు దుర్వినియోగం చేస్తున్నారు. వీసీని వెంటనే పదవి నుంచి తొలగించి ఏసీబీ, విజిలెన్స్, ఈడీ అధికారులతో విచారణ జరిపించాలి' అని సదరు ప్రొఫెసర్ తన ఫిర్యాదులో గవర్నర్‌కు విజ్ఞప్తి చేశారు.

ఖరీఫ్ అవసరాలకు సరిపడా యూరియా

- అగ్రి డైరెక్టర్ డిల్లీరావు వెల్లడి

అమరావతి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రైతుల అవసరాలకు సరిపడా కేంద్రం యూరియా కేటాయిస్తోందని వ్యవసాయ శాఖ డైరెక్టర్ డిల్లీరావు అన్నారు. ఖరీఫ్ అవసరాలకు 6.22 లక్షల టన్నుల యూరియాను కేటాయించిందని, ప్రారంభ నిల్వతో కలిపి 6.57 లక్షల టన్నులను వ్యవసాయశాఖ ఈ సీజన్ కోసం అందుబాటులో ఉంచిందని ఆదివారం పేర్కొన్నారు. ఇప్పటి వరకు 5.48 లక్షల టన్నుల యూరియా అమ్ముడుపోగా, ఇంకా 1.09 లక్షల టన్నులు అందుబాటులో ఉందని తెలిపారు. సెప్టెంబరు నెలకు 1.55 లక్షల టన్నులు అవసరమైతే, 1.59 లక్షల టన్నులు కేటాయించారన్నారు. కాకినాడ, గంగవరం, న్యూ మంగళూరు, విశాఖపట్నం, రాయగర్ పోర్టు నుంచి వచ్చే యూరియాలో కొంత రాష్ట్రానికి కేటాయించాలని సీఎం, వ్యవసాయ శాఖ మంత్రి కేంద్రంతో సంప్రదింపులు జరుపుతున్నారని తెలిపారు. నిర్ణీత కేటాయింపు ప్రకారం యూరియా వస్తుందని, ఈ మేరకు ఖరీఫ్ అవసరాలకు ఏమాత్రం ఇబ్బంది ఉండదన్నారు. రబీ సీజన్‌కు సరిపడా యూరియా కేటాయింపులు జరిగినట్లు చెప్పారు. రబీ పంటలకు యూరియా దొరకదనే అపోహ పెట్టుకోవద్దని రైతులకు సూచించారు.

శభాష్.. వరదను నియంత్రించి డయాఫ్రంవాల్ నిర్మిస్తున్నారు!

- పోలవరం ప్రాజెక్టు ఇంజనీర్లకు అంతర్జాతీయ నిపుణుల అభినందన
- గ్యాప్-2 పనుల్లో బంకమట్టి ప్రభావాన్ని తగ్గించేలా కాంక్రీట్ మిక్స్ చేయండి
- కేంద్ర, అంతర్జాతీయ బృందాల సూచన

అమరావతి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): "శభాష్.. వరద ప్రవాహాన్ని 16 మీటర్లకే నియంత్రించి అత్యంత కీలకమైన డయాఫ్రమ్ వాల్ నిర్మాణం పనులను ఆగస్టులోనే చేపడతారని ఊహించలేదు. గత ఏడాది ఇదే సీజన్‌లో పోలవరంలో పర్యటించినప్పుడు.. డయాఫ్రమ్‌వాల్ నిర్మాణ పనులు ఇంత వేగంగా చేపడతారని ఊహించలేకపోయాం. వరదల సమయంలోనూ నిర్మాణ పనులు చేపట్టడం అభినందనీయం." అని పోలవరం కాంట్రాక్టు సంస్థలు, ఇంజనీరింగ్ అధికారులను అంతర్జాతీయ నిపుణుల బృందం కొనియాడింది. పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలో మూడోరోజు ఆదివారం అంతర్జాతీయ నిపుణుల బృందం సభ్యులు, కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ పరిధిలోని సంస్థల అధికారుల బృందం పర్యటించింది. ప్రధానంగా ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యామ్ నిర్మాణం చేపట్టే గ్యాప్-2 ప్రాంతంలో ఈ బృందాలు పర్యటించాయి. ఈ సందర్భంగా వరద నీటిని 16 మీటర్లకే పరిమితం చేసి, డయాఫ్రమ్‌వాల్ నిర్మాణానికి ఎలాంటి అవరోధం లేకుండా తీసుకున్న జాగ్రత్తలను కాంట్రాక్టు సంస్థలు బావర్, మేఘా, డిజైన్ల తయారీ సంస్థ ఆఫ్రీ వివరించాయి. ప్రాజెక్టులో కీలకమైన, సున్నితమైన డయాఫ్రమ్‌వాల్ నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించడంపైనా అంతర్జాతీయ నిపుణుల ప్యానెల్ సంతృప్తిని వ్యక్తం చేసింది. కాగా, గ్యాప్-2 ప్రాంతంలో నిర్మిస్తున్న డయాఫ్రమ్‌వాల్, ఈసీఆర్ఎఫ్ డ్యామ్‌లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని డిజైన్ రూపొందించిన ఆఫ్రీకి నిపుణులు సూచించారు. ఈ ప్రాంతంలో లోతుకు వెళ్లే కొద్దీ ఇసుక కంటే బంకమట్టి ఉంటుందని అంతర్జాతీయ నిపుణులు తెలిపారు. ఈ బంకమట్టిలో కాంక్రీట్ మిక్స్ కలవడం అంత సులువు కాదని పేర్కొన్నారు. బంకమట్టి సిమెంట్ మిక్స్‌ను బలహీన పరుస్తుందని, దీంతో నిర్మాణ పటిష్టత దెబ్బతింటుందని నిపుణులు హెచ్చరించారు. బట్రస్ డ్యామ్, డయాఫ్రమ్‌వాల్, ఈసీఆర్ఎఫ్ డ్యామ్‌ల నిర్మాణ పనుల్లో జాప్యం చోటుచేసుకుంటోందని, అనుకున్న సమయానికి జరగడం లేదని నిపుణులు గుర్తు చేశారు. భవిష్యత్తులో కార్యాచరణ ప్రణాళిక మేరకు పనులు పూర్తిచేయాలంటే ముందస్తుగా ప్రాజెక్టు డిజైన్లను సిద్ధం చేసుకుని, ఏయే పనికి ఎన్ని రోజులు పడుతుందో అవగాహన పెంచుకోవాలని సూచించారు. కాగా, ఆదివారం కేంద్ర బృందం సభ్యులు ఢిల్లీకి వెళ్లిపోయారు. అంతర్జాతీయ నిపుణుల బృందంలోని సభ్యులు సోమవారం విజయవాడకు వచ్చి ఇక్కడ నుంచి వారివారి దేశాలకు వెళ్లనున్నారు.

వైసీపీ పాలనలో ఏ కంపెనీ వచ్చింది?

- నేడు లోకేశ్ కృషితో పారిశ్రామికవేత్తల్లో నూతనోత్సాహం
- రానున్న రోజుల్లో వేల ఉద్యోగాలు: కేంద్ర మంత్రి పెమ్మసాని



తెనాలి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో రాష్ట్రానికి ఫలానా ఒక కంపెనీ వచ్చిందని చెప్పగలిగే ధైర్యం ఆ మాజీలకు ఉందా?, కొత్తవాటిని తీసుకురాకపోగా రాష్ట్రంలో ఉన్నవాటిని బయటకు పంపేశారు. కానీ కూటమి పాలనలో దీనికి పూర్తి భిన్నం. లోకేశ్ కృషి, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ల ముందుచూపుతో కొత్త పరిశ్రమలను స్థాపించేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావటం గొప్ప పరిణామం' అని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరు జిల్లా తెనాలి మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసే కార్యక్రమంలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌తో కలసి పాల్గొన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అమలుకు ఏటా రూ.60వేల కోట్లు ఖర్చవుతోందన్నారు. మరోవైపు ఉద్యోగుల జీతాలు సకాలంలో చెల్లిస్తూ, అభివృద్ధినీ ఒక ప్రణాళికా బద్ధంగా చేసుకుంటూ పోతున్నారన్నారని వివరించారు. గత ప్రభుత్వం యువతను మత్తులో ముంచేసి, అరాచకాలకు వారిని వాడుకుంటే, నేడు వర్క్ ఫ్రమ్ హోమ్ ద్వారా ఉపాధి కల్పిస్తూ, గ్రామాలలోనే ఉండి పనిచేసుకునేలా గ్రామ స్వరాజ్యాన్ని సాధిస్తున్నారన్నారని పేర్కొన్నారు. మంత్రి లోకేశ్ రాష్ట్రంలో ఐటీతో సహా, మరికొన్ని పరిశ్రమలను తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నారని, ఆయన కృషి ఫలిస్తే రానున్న రోజుల్లో రాష్ట్ర యువతకు వేల సంఖ్యలో ఉద్యోగాలు లభిస్తాయని పేర్కొన్నారు. స్మార్ట్ రేషన్ కార్డులతో రాష్ట్రం దేశంలోనే కొత్త ఒరవడి తీసుకొచ్చిందని, ఆ ఘనత మంత్రి మనోహర్‌కు దక్కుతుందని తెలిపారు. దేశంలోనే అత్యధిక సంక్షేమ పథకాలు అందిస్తున్న రాష్ట్రం కూడా ఆంధ్రప్రదేశేనని, దీనికి మనమంతా గర్వపడాలని పెమ్మసాని వ్యాఖ్యానించారు.

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

- నేడు రాజంపేటలో పాల్గొననున్న సీఎం చంద్రబాబు
- లబ్ధిదారులకు స్వయంగా పింఛన్ల పంపిణీ

అమరావతి, రాయచోటి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం కింద సెప్టెంబరు ఒకటో తేదీన 63,61,380 మందికి పంపిణీ చేసేందుకు ప్రభుత్వం రూ.2746.52 కోట్ల నిధులు గ్రామ, వార్డ్ సచివాలయాలకు విడుదల చేసింది. ఈ మేరకు సచివాలయ సిబ్బంది ఆయా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తారు. అలాగే, పేదల సేవ కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు సోమవారం అన్నమయ్య జిల్లా రాజంపేటలో పర్యటించనున్నారు. మండలంలోని బోయనపల్లెలో స్వయంగా ఆయనే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేయనున్నారు. అనంతరం దోబీఘాట్‌లో రజకులతో మాటాడి వారికి పలు పథకాలు అందజేయనున్నారు. తర్వాత తాళ్లపల్లెలో ప్రజావేదిక సమావేశంలో సీఎం ప్రసంగిస్తారు. అనంతరం సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయన్సర్లతోనూ, ఆ తర్వాత పార్టీ కార్యకర్తలతోనూ సమావేశమవుతారు. తిరిగి సాయంత్రం ఉండవల్లిలో ఉన్న ఇంటికి హెలికాప్టర్‌లో చేరుకుంటారు. కాగా, రెగ్యులర్ పింఛన్లతోపాటు, కొత్తగా మంజూరైన 7872 మంది స్పౌజ్ పెన్షన్ లబ్ధిదారులకు కోసం రూ.3.15 కోట్లు అదనంగా విడుదల చేశామని సెర్ప్ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి పెన్షన్ కోసం రూ.32,143 కోట్ల బడ్జెట్ కేటాయించగా, ఇందులో ఏప్రిల్ నుంచి సెప్టెంబరు 2025 వరకు రూ.16366.80 కోట్లు విడుదల అయ్యాయని తెలిపారు. దేశంలో మరే రాష్ట్ర ప్రభుత్వమూ సామాజిక భద్రతా పింఛన్ల కోసం రూ.10 వేల కోట్లకు మించి కేటాయించలేదని తెలియజేశారు. పింఛన్ల పంపిణీ ప్రక్రియ మరింత పారదర్శకంగా ఉండేలా, లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి అందించడంతోపాటు, వారి జియో-కోఆర్డినేట్స్‌ను కూడా నమోదు చేస్తున్నామని మంత్రి తెలిపారు.

ఐలా రాష్ట్ర అధ్యక్షుడిగా శాంతకుమార్

గుంటూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల పాటు గుంటూరు శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగిన ఇండియన్ లాయర్స్ అసోసియేషన్(ఐలా) రాష్ట్ర మహాసభలు ఆదివారం ముగిశాయి. ఆదివారం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏపీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జీ శ్యామ్ ప్రసాద్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగ విశిష్టతను పరిరక్షించేందుకు న్యాయవాదులు కృషి చేయాలని సూచించారు. ఈసందర్భంగా ఐలా రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శాంతకుమార్, ప్రధాన కార్యదర్శిగా పీ. నరసింహులు, ఉపాధ్యక్షులుగా బీ. డేవిడ్ రత్నకుమార్ (విజయవాడ), గుంటి సురేష్‌బాబు(గుంటూరు), ఎం. అప్పారావు (విజయనగరం), జీ. రంగనాయకులు(అనంతపురం), కార్యదర్శులుగా ఏ. బ్రహ్మేశ్వరరావు, యూ. విష్ణుకుమార్, వై. నరేష్, కే. శాంతికుమార్, జీ. ప్రభుదాసు, బీ. చంద్రుడు, ఎంఈ గీతావాణి, కోశాధికారిగా మొగల్ కాలేషాబేగ్ ఎన్నికయ్యారు.



టీటీడీ చైర్మన్‌కు రూ.4.03 కోట్ల డీడీలను అందజేస్తున్న దాతలు

బర్డ్ ట్రస్టుకు రూ.4.03 కోట్లు

- రెండు సంస్థల పేరిట విరాళం అందించిన దాతలు

తిరుమల, ఆగస్టు31(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఆధ్వర్యంలోని బర్డ్ ట్రస్టుకు ఆదివారం రూ.4.03 కోట్లు విరాళంగా అందాయి. హైదరాబాద్‌కు చెందిన ఆర్ఎస్‌బీ రిటైల్ ఇండియా లిమిటెడ్ సంస్థ రూ.2.93 కోట్లు, ఆర్ఎస్ బ్రదర్స్ జ్యావెలరీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ పేరిట మరో రూ.1.10 కోట్ల చొప్పున మొత్తం రూ.4.03 కోట్లను అందజేశారు. ఈ మేరకు ఆయా సంస్థల ఎండీలు పొట్టి వెంకటేశ్వర్లు, సీర్న రాజమౌళి, టీ ప్రసాదరావు, పొట్టి మాలతి లక్ష్మీ కుమారి విరాళాల డీడీలను తిరుమల శ్రీవారి ఆలయంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందించారు. అలాగే నర్సరావుపేటకు చెందిన రామాంజనేయులు అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షల విరాళాన్ని అందజేశారు.

గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు విజయనగరం రాక



పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న అశోక్‌గజపతిరాజు

విజయనగరం/రూరల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): గోవా గవర్నర్ పూసపాటి అశోక్‌గజపతిరాజు ఆదివారం విజయనగరం వచ్చారు. గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా వచ్చిన ఆయన తొలుత పోలీసుల నుంచి గౌరవవందనం స్వీకరించారు. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, టీడీపీ నాయకులు ఆయనకు స్వాగతం పలికారు.

వాణిజ్య పన్నుల ఉద్యోగులకు అండగా ఉంటాం

- ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్

విజయవాడ(గాంధీనగర్), ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వాణిజ్య పన్నుల ఉద్యోగులకు అండగా ఉంటామని ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్ తెలిపారు. ది కమర్షియల్ టాక్సెస్ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్స్ స్టేట్ జనరల్ బాడీ సమావేశం విజయవాడ గాంధీనగర్‌లోని ఎన్జీవోహోంలో ఆదివారం జరిగింది. సంఘం కార్యవర్గ సభ్యుల కాలపరిమితి అక్టోబర్ నెలతో ముగియనున్న నేపథ్యంలో గడువులోగా ఎన్నికలు నిర్వహించాలని సమావేశం తీర్మానించింది. గెజిటెడ్ హోదా కలిగిన గూడ్స్ అండ్ సర్వీస్ టాక్స్ ఆఫీసర్స్‌ను తిరిగి సంఘంలోకి తీసుకురావడానికి ప్రస్తుత సంఘాన్ని సర్వీస్ అసోసియేషన్‌గా మార్పు చేసేందుకు బైలాస్‌లో అవసరమైన మార్పులు చేయాలని తీర్మానించారు రాష్ట్ర కౌన్సిల్ సమావేశం ఎన్నికల తర్వాత నిర్వహించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. విద్యాసాగర్ పర్యవేక్షణలో రాష్ట్ర సంఘం ఎన్నికలు నిర్వహించుకోవాలని ఏకగ్రీవంగా ఆమోదిస్తూ సమావేశంలో తీర్మానించారు. అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా అలపర్తి విద్యాసాగర్‌ను అసోసియేషన్ నేతలు ఘనంగా సత్కరించారు. రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భవనారి వెంకటేష్‌బాబు, కొప్పోలు సుధాకర్ రావు, కోశాధికారి రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పీసీసీఎఫ్‌గా పీవీ చలపతిరావు నియామకం

అమరావతి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ (పీసీసీఎఫ్)గా డాక్టర్ పీవీ చలపతిరావును రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ (హెడ్ ఆఫ్ ఫారెస్ట్ ఫోర్స్)గా ఉన్న అజయ్‌కుమార్ నాయక్ పదవీ విరమణ పొందడంతో ఆయన స్థానంలో కొత్త వారిని ఎంపిక చేయడం కోసం ప్రభుత్వం సీఎస్ నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ చలపతిరావును ఎంపిక చేసి, ప్రభుత్వానికి ప్రతిపాదించింది. ప్రభుత్వం ఆమోదించడంతో సీఎస్ ఉత్తర్వులు జారీ చేశారు. చలపతిరావు ప్రస్తుతం అటవీ శాఖలోనే ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (ప్రొడక్షన్, ఎర్రచందనం)గా విధులు నిర్వహిస్తున్నారు.

పాతపెన్షన్ విధానం పునరుద్ధరించే వరకూ పోరాటం

- పుదుచ్చేరి సదస్సులో తీర్మానం : ఆప్టా

అమరావతి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా పాత పెన్షన్ విధానం పునరుద్ధరించేవరకూ పోరాటం కొనసాగించాలని పుదుచ్చేరిలో రెండు రోజుల పాటు జరిగిన అఖిల భారత ప్రాథమిక ఉపాధ్యాయ సమాఖ్య జాతీయ సదస్సులో తీర్మానం చేసినట్టు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రాథమిక ఉపాధ్యాయ సంఘం(ఆప్టా) నేతలు ఏజీఎస్ గణపతిరావు, కే.ప్రకాశ్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో తాము పాల్గొన్నట్టు... విద్యాహక్కు చట్టం 2009 ప్రకారం విద్యార్థి, ఉపాధ్యాయుల నిష్పత్తి అమలుచేయాలని, సెకండరీ గ్రేడ్ టీచర్లకు ఎమ్మెల్సీ ఓటు హక్కు కల్పించాలని, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుల్లో ప్రతి రాష్ట్రానికి ఐదుగురికి అవకాశం ఇవ్వాలని తీర్మానాలు చేసినట్టు పేర్కొన్నారు.

చెన్నైలో అర్ధరాత్రి కుండపోత

- విమానసేవలకు అంతరాయం

చెన్నై, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): చెన్నై మహానగరంలో శనివారం అర్ధ రాత్రి కుండపోతగా వర్షం కురిసింది. రహదారులు, సబ్‌వేలు వరదతో పొంగిపొర్లాయి. భారీ వర్షం కారణంగా విమాన సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ముఖ్యంగా నాలుగు విమానాలు చెన్నై ఎయిర్‌పోర్టులో ల్యాండింగ్ కాలేకపోవటంతో వాటిని బెంగుళూరుకు మళ్లించారు. 27 విమానాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. హైదరాబాద్ నుంచి 140 మంది ప్రయాణికులతో చెన్నైకు వచ్చిన ఇండిగో విమానం, 164 మంది ప్రయాణికులతో వచ్చిన ఎయిర్ ఇండియా, 74 మందితో వచ్చిన ఇండిగో, ఫ్రాంక్‌ఫర్ట్ నుంచి 268 మంది ప్రయాణికులతో వచ్చిన లుఫ్తాన్సా విమానాలను బెంగుళూరుకు మళ్లించారు. ఇదేవిధంగా కౌలాలంపూర్, హాంకాంగ్, తిరువనంతపురం, ఇండోర్, ఢిల్లీ నుంచి వచ్చిన విమానాలు కూడా ల్యాండ్ కాలేక సుదీర్ఘ సమయం పాటు గాలిలో చక్కర్లు కొట్టిన పిమ్మట వాతావరణం అనుకూలించిన మీదటే ల్యాండ్ అయ్యాయి. అదేవిధంగా చెన్నై నుంచి కౌలాలంపూర్, ఫ్రాంక్‌ఫర్ట్, హాంకాంగ్, శ్రీలంక, దుబాయ్, కువైట్, మస్కట్, సింగపూర్, ఢిల్లీ, పూణెతో సహా అనేక ప్రాంతాలకు బయలుదేరి వెళ్లాల్సిన విమాన సర్వీసులు 3 గంటలకు పైగా ఆలస్యంగా బయలుదేరి వెళ్లాయి.

సీసీఐకి జిన్నర్ల షాక్!

- గడువు ముగుస్తున్నా బిడ్లు వేయకుండా నిరసన
- టెండర్ నిబంధనలు సడలించాలని పట్టు
- సీసీ కెమెరాలపై హైకోర్టు నుంచి స్టే తెచ్చిన వైనం
- ఈ సీజన్‌లో దూది శాతం పెంచాలన్న నూతన నిబంధనపైనా మిల్లర్ల ఆగ్రహం
- టెండర్ ప్రక్రియను నిలిపివేసి చర్చించండి
- సీసీఐ చైర్మన్‌కు అసోసియేషన్ లేఖ

గుంటూరు సిటీ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సీసీఐ(కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా)కి జిన్నింగ్ మిల్లుల యజమానులు గట్టి షాక్ ఇచ్చారు. పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సంబంధించి సీసీఐ విడుదల చేసిన బిడ్డింగ్ టెండర్ ప్రక్రియను రాష్ట్రంలోని జిన్నర్లు బహిష్కరించారు. నిబంధనలు సడలించే వరకు ఒక్క టెండర్ కూడా దాఖలు చేయబోమని భీష్మించారు. ఆంధ్రలో పత్తి సాగు చేస్తున్న రైతులకు మద్దతు ధర కల్పించేందుకు వీలుగా సీసీఐ ఏటా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్న సంగతి తెలిసిందే. గతంలో ఈ కొనుగోలు కేంద్రాలను మార్కెట్ యార్డుల్లో ఏర్పాటు చేయడం వల్ల లెక్కలేనన్ని అక్రమాలు చోటుచేసుకున్నాయి. ఆ నేపథ్యంలో పత్తి మిల్లుల్లోనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఏడాది రాష్ట్రంలో 30 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని భావించిన సీసీఐ.. జిన్నింగ్ మిల్లుల ఎంపిక కోసం ఆగస్టు 12న టెండర్ ప్రకటన విడుదల చేసింది. సెప్టెంబరు 1న టెండర్లు దాఖలు చేసేందుకు చివరి రోజుగా పేర్కొంది. అయితే ఆగస్టు 31 వ తేదీ వచ్చినా రాష్ట్రవ్యాప్తంగా ఒక్క టెండర్ కూడా పడలేదు. జిన్నింగ్ మిల్లుల అసోసియేషన్ పిలుపు మేరకే సీసీఐ టెండర్ ప్రక్రియను బహిష్కరించామని పత్తి మిల్లుల యజమానులు చెబుతున్నారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో అన్ని సౌకర్యాలతో కూడిన సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్న నిబంధనను వీరు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. సదరు కెమెరాల ఏర్పాటుకు ఒక్కొక్క కేంద్రానికీ రూ.25 లక్షల వరకు ఖర్చవుతుందని చెబుతున్నారు. పత్తి కొనుగోలు కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని హైకోర్టు ఇచ్చిన తీర్పుపై వ్యాపారులు తాజాగా స్టే కూడా తీసుకొచ్చారు. అలాగే ఈ సీజన్‌లో దూది శాతం (లింట్) పెంచాలన్న నూతన నిబంధనపైనా జిన్నర్లు భగ్గుమంటున్నారు. విత్తనాల రకం, నేల స్వభావం, తెగుళ్ల ఒత్తిడి వంటివి దూది దిగుబడిపై ప్రభావం చూపుతాయని.. ఆంధ్రప్రదేశ్‌లో దూది దిగుబడి పెంచే కొత్త వంగడాలను ప్రభుత్వం ప్రవేశపెట్టలేదని.. ప్రస్తుతం ఉన్న రకాల వల్ల కేవలం 30-35 శాతం వరకు మాత్రమే దిగుబడి వస్తోందని చెబుతున్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన పత్తి ఒకసారి మిల్లులోకి వచ్చిన తర్వాత జరిగే ప్రతిదానికీ మిల్లర్‌దే బాధ్యత అన్నట్లుగా సీసీఐ నిబంధనలు ఉన్నాయన్న ఆరోపణలున్నాయి. రైతులు పత్తిని వారికి నచ్చిన కేంద్రంలో అమ్ముకునే అవకాశం లేకుండా హద్దులు విధించడంపై కూడా నిరసన వ్యక్తమవుతోంది. ఎల్-1, ఎల్-2, ఎల్-3 అంటూ కేంద్రాలను విభజించడంతో చిన్న మిల్లర్లకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్న భావన వారిలో ఉంది. ఇటువంటి అభ్యంతరాలు ఉన్నందున టెండర్ ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేసి చర్చలు జరపాలని పత్తి మిల్లర్ల అసోసియేషన్ నేతలు సీసీఐ చైర్మన్‌కు లేఖ రాశారు.



అత్తయ్య ఆదర్శంగా... దేశం గర్వించేలా

ఆట ఆమెకు ఆటవిడుపు కాదు... జీవిత గమనం. ఈ క్రీడా ప్రయాణం... బాల్యంలో మొదలైంది. బడి రోజుల్లో... కళాశాలలో... ఇద్దరు పిల్లలకు తల్లి అయ్యాక కూడా కొనసాగుతోంది. అత్తయ్య శిక్షణలో నైపుణ్యం సంపాదించి... జాతీయ స్థాయి కబడ్డీలో పతకాలు ఎన్నో సాధించి... ప్రస్తుతం కోచ్‌గా, రిఫరీగా నిరుపమాన సేవలు అందిస్తున్నారు... జరుబుల శ్రావణి. రేపటి తరాన్ని ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దుతున్న ఆమె 'నవ్య'తో ముచ్చటించారు.

"నాది మా మేనత్త రాజ్యలక్ష్మి పోలిక అంటారు అందరూ. ఆమె ఒకప్పుడు మంచి క్రీడాకారిణి. ఆ తరువాత వ్యాయామ ఉపాధ్యాయురాలిగా స్థిరపడ్డారు. నాకు కూడా చిన్నప్పటి నుంచీ ఆటలంటే ఇష్టం. ఏదో సరదాకు కాకుండా... అత్తయ్యలా క్రీడల్లో రాణించాలని అనుకునేదాన్ని. రన్నింగ్, కబడ్డీ... అన్నిట్లో ఉండేదాన్ని. నా ఆసక్తిని గమనించిన మా అమ్మానాన్న లక్ష్మి, ఆంజనేయులు నన్ను మరింత ప్రోత్సహించారు. అత్తయ్య ఉమ్మడి ప్రకాశం జిల్లా కందుకూరు స్కూల్లో పీఈటీగా చేసేవారు. నన్ను తీసుకువెళ్లి ఆ స్కూల్లో చేర్చారు. అప్పుడు నేను ఆరో తరగతి. అప్పటి నుంచీ అత్తయ్య దగ్గర ఆటల్లో, ముఖ్యంగా రన్నింగ్, కబడ్డీలో శిక్షణ మొదలైంది. మాది బాపట్ల జిల్లా ఇంకొల్లు మండలం సంతరావూరులో ఒక రైతు కుటుంబం. నేను ఒక్కగానొక్క సంతానం కావడంతో అమ్మానాన్న ఎంతో గారాబంగా పెంచారు. ఎప్పుడూ వాళ్లను వదిలి ఉన్నది లేదు. కానీ నన్ను ఒక మంచి క్రీడాకారిణిగా చూడాలన్న ఆశయంతో వేరే ఊరు పంపించారు.

జాతీయ స్థాయి క్రీడాకారిణిగా...

కొంత కాలానికి నేను మిగిలిన ఆటలను వదిలేసి... కబడ్డీ మీదనే దృష్టి పెట్టాను. స్కూల్, కళాశాల స్థాయి టోర్నీలో పాల్గొన్నాను. తరువాత నాగార్జున వర్సిటీ తరఫున ఆలిండియా యూనివర్సిటీ మీట్స్‌లో పోటీపడ్డాను. పలుమార్లు చాంపియన్‌గా నిలిచాను. ఆ విజయాలు నాలో ఆత్మవిశ్వాసం నింపాయి. ఆ తరువాత రాష్ట్ర స్థాయి, అక్కడి నుంచి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాను. పాతికకు పైగా ఆలిండియా మీట్స్‌లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించాను. స్వర్ణ, రజత, కాంస్య పతకాలు ఎన్నో గెలుచుకున్నాను. గత ఏడాది ప్రభుత్వ ఉద్యోగులకు నిర్వహించే 'నేషనల్ సివిల్ సర్వీసెస్ కబడ్డీ టోర్నీ'లోనూ సత్తా చాటాను.

ఆడపిల్లకు ఆటలెందుకు అన్నారు...

చిన్నప్పుడు కోచింగ్ కోసం, తరువాత టోర్నమెంట్‌ల కోసం ఇతర ప్రాంతాలు, రాష్ట్రాలకు వెళ్లాల్సి వచ్చేది. ఆ సమయంలో కొందరు బంధువులు, సన్నిహితులు అమ్మానాన్నలను వారించారు. 'వయసుకు వచ్చిన ఆడపిల్లను పెళ్లి చేసి పంపాలే కానీ, ఇలా రాష్ట్రాలు దాటిస్తే ఎలా' అంటూ నిలదీశారు. కానీ మా అమ్మానాన్న తమ బిడ్డ విజయాన్ని ఈ దేశం చూడాలని అనుకున్నారు. ఒత్తిళ్లకు తలొగ్గలేదు. అడుగడుగునా నన్ను ప్రోత్సహించారు. అడిగినవన్నీ సమకూర్చారు. వారు నాపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టాలని ఆ క్షణమే నిర్ణయించుకున్నా. ఆడపిల్లలంటే అన్నిటికీ భయపడాలా? వంట గదికే పరిమితమవ్వాలా? ఇలా తక్కువ చేసి మాట్లాడేవారికి నా విజయాలతోనే సమాధానం ఇవ్వాలనుకున్నా. దృఢ సంకల్పంతో ప్రయత్నించి అనుకున్నది సాధించాను. అమ్మానాన్న గర్వపడేలా చేశాను.

పీఈటీగా ఉద్యోగం...

ఆటల్లో పడి చదువును నిర్లక్ష్యం చేయలేదు. కాకినాడ స్పోర్ట్స్ హాస్టల్‌లో ఇంటర్, చీరాల వీఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాలలో బీఏ చదివాను. బ్యాచిలర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రవేశ పరీక్షలో మొదటి స్థానం సంపాదించడంతో నాగార్జున వర్సిటీలో సీటు లభించింది. 2012 డీఎస్సీలో పీఈటీగా ఉద్యోగం వచ్చింది. ఉమ్మడి ప్రకాశం జిల్లా పెద్దకొత్తపల్లిలో ఉద్యోగ జీవితం ప్రారంభించాను. రెండేళ్లుగా బాపట్ల జిల్లా వేటపాలెం బాలికోన్నత పాఠశాలలో పీఈటీగా చేస్తున్నాను. పెళ్లి తరువాత కూడా నా క్రీడా ప్రస్థానం కొనసాగుతోందంటే అందుకు మావారు వెంకటసుబ్బారావు సహకారం ప్రధాన కారణం. మా అమ్మానాన్నల్లా ఆయన కూడా నన్ను ఎంతో ప్రోత్సహిస్తూ వచ్చారు. మాకు ఇద్దరు పిల్లలు... తారక్‌రామ్, హర్షిత్‌రామ్. కుటుంబ మద్దతు ఉంటే ఆడపిల్లలు ఎంతటి లక్ష్యాన్ని అయినా సాధించగలరు. దానికి నేనే ప్రత్యక్ష ఉదాహరణ."

• తాళ్లూరి ప్రదీప్, చీరాల
99854 11491



మరో అడుగు...

నా ప్రయాణంలో మరో కొత్త అడుగు పడింది. ఇటీవల విజయవాడలో నిర్వహించిన యువ ఆంధ్ర కబడ్డీ చాంపియన్‌షిప్‌లో రిఫరీగా వ్యవహరించాను. ప్రస్తుతం నేను ఔత్సాహిక క్రీడాకారులకు శిక్షణ ఇస్తున్నాను. నా వద్ద కబడ్డీలో శిక్షణ తీసుకున్న కొందరు జూనియర్ జట్లకు ఎంపిక అయ్యారు. రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మట్టిలో మాణిక్యాలు మన దగ్గర ఎన్నో ఉన్నాయి. అలాంటివారిని గుర్తించి ప్రోత్సహించాలంటే ఆర్థికంగా, సౌకర్యాల పరంగా ప్రభుత్వం నుంచి సహకారం అవసరం. నైపుణ్యం, సామర్థ్యం గల ఎంతోమంది క్రీడాకారులు పేదరికంతో ముందడుగు వేయలేకపోతున్నారు. వారికి అండగా నిలిస్తే దేశానికి గర్వకారణం అవుతారు.

గుడ్డు పెంకుతో జుట్టుకు ఆరోగ్యం

కోడిగుడ్లను తినేసి, పెంకులను పడేస్తూ ఉంటాం. కానీ ఆ పెంకులు శిరోజాల పెరుగుదలకు సహాయపడతాయి. ఆ వివరాలు తెలుసుకుందాం..

- జుట్టు ఊడడానికి ఓ ప్రధాన కారణం కాల్షియం లోపం. కోడిగుడ్డు పెంకులో కాల్షియం పుష్కలంగా ఉంటుంది. ఇది జుట్టు ఆరోగ్యాన్ని పెంపొందిస్తుంది.
- గుడ్డు పెంకులోని ప్రోటీన్లు, మెగ్నిషియం, పొటాషియం, ఫాస్పరస్ వంటి ఖనిజాలు జుట్టు పెరుగుదలకు దోహదపడతాయి.
- గుడ్డు పెంకులోని పోషకాలు మాడు పీహెచ్ స్థాయులను బ్యాలెన్స్ చేస్తాయి. చుండ్రును, దురదను తగ్గించేందుకు సహాయపడతాయి.

ఇలా సిద్ధం చేసుకోవాలి

- కోడి గుడ్లను పగలగొట్టిన తరువాత పెంకులను నీటితో శుభ్రంగా కడగాలి. తరువాత తడిని పూర్తిగా ఆరనిచ్చి ఆ పెంకులను మెత్తని పొడి చేయాలి. దానిని గాలి చొరబడని డబ్బాలో నిల్వ చేసుకోవాలి.



ఇలా వాడాలి

- ఒక గిన్నెలో రెండు టేబుల్ స్పూన్ల కొబ్బరి నూనె, ఒక టేబుల్ స్పూన్ గుడ్డు పెంకుల పొడి వేసి కలపాలి. దీనిని మాడుకు రాసి కొంచెం సేపు మర్దన చేయాలి. 30 -45 నిమిషాల తరువాత తలస్నానం చేయాలి. వారానికోసారి ఇలా చేస్తే మంచి ఫలితముంటుంది.
- గుడ్డు పెంకుల పొడిని షాంపూలో కలుపుకుని కూడా వాడొచ్చు.
- రెండు స్పూన్ల ఆలివ్ నూనెలో ఒక స్పూన్ పెంకుల పొడి కలిపి తలకు పట్టించాలి. అరగంట తరువాత తలస్నానం చేయాలి. వారినికోసారి ఇలా చేయాలి.
- రెండ టేబుల్ స్పూన్ల కలబంద గుజ్జులో ఓ స్పూన్ పెంకుల పొడిని కలిపి తలకు పట్టించాలి. అరగంట తరువాత వేడి నీళ్లతో కడిగేయాలి. వారానికో రెండుసార్లు ఇలా చేస్తే మంచి ఫలితముంటుంది.

ఆరోగ్యానికి లవంగ నేరేడు!



నేరేడు పళ్లు ఆరోగ్యానికి మంచివని చాలా మందికి తెలుసు. అయితే నేరేడులో చాలా రకాలు ఉన్నాయి. అందులో ఒకటి లవంగ నేరేడు. దక్షిణ భారతదేశంలో పెరిగే ఈ మొక్క పళ్లతో పాటు ఆకుల వలన కూడా ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. ఆ వివరాల గురించి తెలుసుకుందాం..

లవంగ నేరేడును వైల్డ్ బ్లాక్ ప్లమ్ అని కూడా అంటారు. ఈ మొక్క దక్షిణ భారతదేశంలో కొండ, అటవీ ప్రాంతాలలో ఎక్కువగా పెరుగుతుంది. ఇది సాధారణంగా 5-10 మీటర్ల ఎత్తు పెరుగుతుంది. ఈ మొక్కకు లేత గులాబీ రంగు పువ్వులు పూస్తాయి. అవి సువాసన వెదజల్లుతాయి. ఈ పువ్వుల నుంచి చిన్న గుండ్రని పళ్లు కాస్తాయి. ఈ కాయలలో ఒకే విత్తనం ఉంటుంది. ఈ పళ్లు కొంచెం తీయగా, పుల్లగా ఉంటాయి. వీటిని నేరుగా తింటారు. అలాగే జామ్, జ్యూస్ తయారీకి కూడా ఉపయోగిస్తారు. ఈ మొక్క ఆకులు, బెరడును సంప్రదాయ వైద్యంలో వాడతారు. మధుమేహం, విరేచనాలు, గాయాల చికిత్సకు వినియోగిస్తారు. ఈ ఆకులు, బెరడులో యాంటీ ఆక్సిడెంట్లు, ఫ్లేవనాయిడ్లు, ఆంథోసైనిన్‌లు సమృద్ధిగా ఉంటాయి. అలాగే యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు ఉంటాయి.

• డాక్టర్ శ్రీనాథ్
వృక్ష శాస్త్రవేత్త, కన్హా శాంతివనం, హైదరాబాద్

బాత్‌రూమ్ సువాసనభరితంగా..!

మనం ఇంట్లో బాత్‌రూమ్‌ను పరిశుభ్రంగా ఉంచుకుంటాం. అయినప్పటికీ ఒక్కోసారి దుర్వాసన వస్తూ ఉంటుంది. అలాంటి సందర్భాల్లో బాత్‌రూమ్‌ను సువాసనభరితంగా ఎలా మార్చుకోవాలో తెలుసుకుందాం..

- ఒక చిన్న గిన్నెలో రెండు చెంచాల బేకింగ్ సోడా వేసి దాన్ని బాత్‌రూమ్‌లో ఒక మూలగా లేదా కిటికీలో ఓ పక్కగా పెట్టాలి. ఇలా చేయడం వల్ల బేకింగ్ సోడా దుర్వాసనను పీల్చుకుని బాత్‌రూమ్‌లో తాజాదనాన్ని నింపుతుంది.
- వాడేసిన నిమ్మతొక్కలు అలాగే నారింజ, బత్తాయి, అనాస తొక్కలను చిన్న ముక్కలుగా చేసి ఒక గిన్నెలో వేయాలి. ఈ గిన్నెను బాత్‌రూమ్‌లోని ఓ అరలో పెడితే మంచి ప్రయోజనం ఉంటుంది.



- తేమ వాతావరణంలో బాగా పెరిగే ఇండోర్ ప్లాంట్ కుండీని బాత్‌రూమ్‌లో ఏర్పాటు చేసుకున్నా తాజా అనుభూతి కలుగుతుంది.
- ఒక బకెట్ నీళ్లలో నాలుగు చెంచాల వెనిగర్ వేసి బాగా కలపాలి. ఈ నీళ్లతో శుభ్రం చేస్తే బాత్‌రూమ్‌లో దుర్వాసన రాదు. వారానికి రెండుసార్లు ఇలా చేయడం వల్ల మంచి ఫలితం ఉంటుంది.
- బాత్‌రూమ్‌లో వెంటిలేషన్ సరిగా ఉండేలా చూసుకోవాలి. గాలి, వెలుతురు ధారాళంగా ప్రసరిస్తే తేమ నిలవదు. దీనివల్ల బాత్‌రూమ్ ఎప్పుడూ పొడిగా తాజాగా ఉంటుంది.

జలుబు సమస్యల నివారణకు...

వర్షాకాలంలో సాధారణంగా జలుబు, దగ్గు, తలనొప్పిలాంటి సమస్యలు వేధిస్తుంటాయి. వీటినుంచి తప్పించుకోవడానికి రోజూ ఏ ఆహారపదార్థాలు తీసుకోవాలో తెలుసుకుందాం..!



- అల్లం ముక్కలు లేదా అల్లం రసాన్ని ఆహారంలో చేర్చుకోవడం వల్ల శరీరానికి వ్యాధికారక క్రిములతో పోరాడే శక్తి లభిస్తుంది. అల్లంలో ఉండే యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు... వర్షాకాలంలో వచ్చే అనారోగ్యాన్ని నివారిస్తాయి.
- ఒక గ్లాసు గోరువెచ్చని పాలలో చిటికెడు పసుపు లేదా పావు చెంచా మిరియాల పొడి కలుపుకుని తాగితే జలుబు నుంచి ఉపశమనం కలుగుతుంది.
- పండ్లు, తాజా కూరగాయలు, ఆకుకూరలను తరచూ తీసుకోవడం వల్ల శరీరానికి కావాల్సిన ఐరన్, కాల్షియం లాంటి పోషకాలతోపాటు ఎ, బి, సి, కె విటమిన్లు పుష్కలంగా లభిస్తాయి. ఇవి నీరసాన్ని తగ్గించి శరీరానికి తక్షణ శక్తిని అందిస్తాయి.
- టమాటా, బీన్స్, పప్పు దినుసులతో తయారుచేసిన సూప్‌లు తాగడం వల్ల జీర్ణక్రియ మెరుగవడంతోపాటు తలనొప్పి, కండరాల నొప్పి తగ్గుతాయి.
- వర్షాకాలంలో తరచూ బాదం పప్పులు, పొద్దు తిరుగుడు గింజలు, గుమ్మడి గింజలు తినడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది.
- తులసి, పుదీనా, నిమ్మగడ్డితో తయారుచేసిన పానీయాలను వేడివేడిగా తాగుతూ ఉంటే గొంతులో ఏర్పడే కఫ సమస్యలు, ముక్కు దిబ్బడ తగ్గుతాయి.
- ఒక గ్లాసు నీటిలో ఒక చెంచా వాము, చిన్న అల్లం ముక్క వేసి బాగా మరిగించాలి. ఈ నీటిని వడబోసి రోజుకు రెండుసార్లు తాగితే జలుబు, దగ్గు, తుమ్ములు తగ్గిపోతాయి. అరచెంచా వాము పొడిలో ఒక చెంచా తేనె కలిపి రాత్రి పడుకునేముందు తీసుకుంటే రెండు రోజుల్లో గొంతునొప్పి తగ్గుతుంది.

పిల్లలు చురుకుగా ఉండాలంటే...

పేరెంటింగ్

పిల్లలు ఎదుగుతున్న క్రమంలో ఎన్నో అంశాలు నేర్చుకుంటూ ఉంటారు. కొన్నింటిని చూసి, మరికొన్నింటిని ప్రశ్నల ద్వారా అడిగి తెలుసుకుంటారు. ఇలాంటి ఆసక్తి పిల్లల్లో చురుకుదనాన్ని పెంచుతుంది. పిల్లలు ఇలా చురుగ్గా, ఉత్సాహంగా పెరగాలంటే తల్లిదండ్రులు ఏ జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకుందాం...

- పిల్లలను ఎప్పుడూ నాలుగు గోడల మధ్య బందీ చేసి ఉంచకూడదు. ఆరుబయట హాయిగా ఆడుకోనివ్వాలి. ఇలా ఆడుకుంటూనే పిల్లలు చాలా అంశాలు తెలుసుకుంటారు. తోటి పిల్లలతో స్నేహం చేయడం నేర్చుకుంటారు. పరుగెత్తడం, గెంతడం, పడడం, లేవడం లాంటి శారీరక శ్రమ పిల్లల్లో ఉత్సాహాన్ని పెంచుతుంది.
- ఇప్పుడిప్పుడే బయటి ప్రపంచాన్ని చూస్తున్న పిల్లల మనసుల్లో ఎన్నో రకాల ప్రశ్నలు మెదులుతూ ఉంటాయి. వచ్చీరాని మాటలతో ప్రశ్నలు అడుగుతుంటారు. వారి ప్రశ్నలకు ఓపిగ్గా సమాధానాలు చెప్పాలి. అప్పుడే పిల్లల్లో ఊహాశక్తి, విశ్లేషణ సామర్థ్యం పెరుగుతాయి.
- ఉదయం, సాయంత్రం సమయాల్లో పిల్లలను దగ్గర్లోని పంట పొలాలకు, తోటలకు లేదంటే ఏదైనా పార్క్‌కు తీసుకెళ్లాలి. రకరకాల చెట్లు, మొక్కలు, పూలు, కాయల గురించి వివరిస్తూ ప్రకృతిపై అవగాహన కల్పించాలి. పక్షులు, జంతువుల గురించి తెలియజెప్పాలి. దీనివల్ల



పిల్లలు కొత్త అంశాలు తెలుసుకోవడానికి ఆసక్తి చూపిస్తారు. మెదడు పనితీరు మెరుగుపడి జ్ఞాపకశక్తి వృద్ధి పొందుతుంది.

- రాత్రి పడుకునేముందు నీతి కథలు చెప్పాలి. వీటిద్వారా పిల్లలు నైతిక విలువలు, స్నేహభావం, పరోపకారం, దయాగుణం, పెద్దలను గౌరవించడం లాంటి ఎన్నో అంశాలు తెలుసుకుంటారు.
- పిల్లలకు ఉదయాన్నే నిద్రలేవడం, దినచర్య, వ్యాయామం, క్రమశిక్షణ, పోషకాహారం గురించి వివరిస్తూ వాటిని అలవాటు చేయాలి. అప్పుడే పిల్లలు శారీరకంగా, మానసికంగా పూర్తి ఆరోగ్యంతో ఎదుగుతారు. చురుకుగా వ్యవహరిస్తారు కూడా!

ఆమె... సంచార జాతుల చిరునామా

రాజ్యాంగం కల్పించిన ఎలాంటి హక్కులకూ నోచుకోని సంచార జాతులకు నేనున్నానంటూ భరోసా ఇస్తున్నారు మిత్తల్ పటేల్. ఆమె చొరవ ఏడున్నర లక్షల మందికి పైగా ప్రజలకు చట్టబద్ధమైన గుర్తింపు కల్పించింది. వేలాదిమందికి ఉపాధిని, సొంత ఇళ్ళను అందించింది. మరోవైపు పర్యావరణ పరిరక్షణకు మిత్తల్ చేస్తున్న కృషి సర్వత్రా ప్రశంసాపాత్రమవుతోంది.



"జీవితం అనూహ్యమైన మలుపు తిరగడానికి ఒక్క సంఘటన చాలు. నా జీవితాన్ని మార్చేసిన అలాంటి అనుభవం నాకు చిన్న పల్లెటూరులో ఎదురయింది. నేను పుట్టింది, పెరిగింది గుజరాత్ రాష్ట్రంలోని సంఖల్పూర్ గ్రామంలో. ఐఏఎస్ అధికారి కావాలన్నది నా లక్ష్యం. అందుకు తగినట్టుగానే చదువులో బాగా చురుగ్గా ఉండేదాన్ని. కోచింగ్ కోసం అహ్మదాబాద్‌కు వెళ్ళాను. మరోవైపు గుజరాత్ విద్యాపీఠ్‌లో జర్నలిజం కోర్సులో చేరాను. రెండు నెలల ఫెలోషిప్‌లో భాగంగా... ఒక పల్లెటూరి బయట నీలం రంగు ప్లాస్టిక్ షీట్లతో గుడారాలు వేసుకొని నివసిస్తున్న కుటుంబాలను కలుసుకున్నాను. అప్పుడు నేను తెలుసుకున్న విషయాలు దిగ్భ్రాంతి కలిగించాయి. వారందరూ సంచార జాతులకు చెందినవారు. ఎక్కడ పని దొరికితే అక్కడికి కుటుంబాలతో సహా వెళుతూ ఉంటారు. స్థిరమైన నివాసాలు లేవు. పిల్లలకు చదువు లేదు. మహిళలకు, బాలికలకు రక్షణ లేదు. వారు అత్యాచారాలకు గురైనా... స్థానికంగా అండ లేకపోవడం వల్ల ఫిర్యాదులు చేయడానికి కూడా భయపడతారు. రేషన్ కార్డులకు కానీ, ఇతర ప్రభుత్వ పథకాలకు కానీ నోచుకోలేదు. సంచార జాతులకు ఈ పరిస్థితి దేశమంతటా ఉందని తెలిసింది. అదే సమయంలో... దేశంలో సంచార జాతులపై అధ్యయనం చేస్తున్న ఒక ఎన్జీవోతో పరిచయం అయింది. దాని ప్రతినిధులతో కలిసి పని చేయడం ప్రారంభించాను.



సవాలుగా తీసుకున్నా...

సంచార (ఎన్‌టి), డినోటిఫైడ్ తెగలు (డీఎన్‌టి) తెగలకు చెందిన వారు మన దేశంలో అరవై లక్షల మందికి పైగా ఉన్నారు. వారిలో చాలామంది పాములను ఆడించడం, ఆటపాటల్లాంటి వివిధ పనులతో జీవిస్తూ, ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తిరుగుతూ ఉంటారు. వీరిలో 198 తెగలపై 'నేర జాతులు' అనే ముద్రను నాటి బ్రిటిష్ ప్రభుత్వం వేసింది. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కూడా వారు ప్రాథమికమైన హక్కులకు నోచుకోవడం లేదు. ఏ ప్రభుత్వం వారి సమస్యలకు తగిన పరిష్కారం చూపించడం లేదు. వారి తరఫున గళం విప్పాలనుకున్నాను. 2006లో 'విచార్త సముదాయ్ సమర్థన్ మంచ్' (విఎస్ఎస్ఎం) అనే సంస్థను ప్రారంభించాను. సంచార జాతులవారికి వారి హక్కుల గురించి వివరించడం, వారికి చట్టబద్ధమైన గుర్తింపు లభించేలా చేయడం మా సంస్థ ప్రధాన లక్ష్యం. దీనిలో ప్రధానమైన ఇబ్బంది ఏమిటంటే... వారి జీవన శైలి కారణంగా ఒకే చోట ఉండరు. శాశ్వత చిరునామా ఉండదు. అధికారికమైన పత్రాలను సంపాదించడం చాలా కష్టం. కానీ దాన్ని ఒక సవాలుగా తీసుకున్నాను. ముప్పై మందితో ఒక బృందాన్ని ఏర్పాటు చేశాను. మేమందరం గ్రామాల్లో తిరిగి సంచార జాతులవారి వివరాలను సేకరించాం. అధికారులను, ప్రజా ప్రతినిధులను కలిసి వారి సమస్యలను వివరించాం. మొదట్లో స్పందన నామమాత్రంగానే వచ్చినా... మా పట్టుదల చూసి వారు కూడా సహకరించారు. గుజరాత్‌లో... పదేళ్లలో దశలవారీగా 60 వేలమందికి ఓటర్ కార్డులు ఇప్పించగలిగాం. ఆ తరువాత ఇది ఒక ఉద్యమంగా మారింది. ఎంతోమంది మా సంస్థతో చేతులు కలిపారు. మా కృషితో ... ఏడున్నర లక్షల మందికి పైగా సంచార జాతులవారు చట్టబద్ధమైన గుర్తింపును పొందారు. అయిదు వేలమంది విద్య, ఉద్యోగాలు పొందారు. మా సంస్థ చేపట్టిన 'లైవ్ లీహుడ్ ప్రాజెక్ట్' ద్వారా పన్నెండు వేల కుటుంబాలకు వడ్డీ లేని రుణాలను అందించి, స్వయం ఉపాధికి దోహదం చేశాం. వేలమందికి ఇళ్ళ స్థలాలను ప్రభుత్వ సహకారంతో అందజేయగలిగాం. ఈ వర్గాల వారి పిల్లల చదువుకోసం, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. గుజరాత్‌తో పాటు పలు రాష్ట్రాల్లో మా కార్యకలాపాలు సాగుతున్నాయి.

వారి సంతోషమే ప్రేరణ

అలాగే పర్యావరణ పరిరక్షణ కోసం కూడా మా సంస్థ పని చేస్తోంది. ఇప్పటివరకూ పదహారున్నర లక్షల చెట్లు నాటాం, 380కి పైగా చెరువులను పునరుద్ధరించాం. దీన్ని ఎందరో ప్రముఖులు ప్రశంసించారు. నా కార్యక్రమాలకు గుర్తింపుగా... 'నారీ శక్తి పురస్కార్' లాంటి అనేక అవార్డులు లభించాయి. అన్నిటికన్నా... మా సంస్థ ద్వారా ప్రయోజనం పొందినవారిలో పెరిగిన ఆత్మవిశ్వాసం, వారిలో కనిపించే సంతోషం నాకు ఎంతో సంతృప్తినిస్తోంది. ఓటర్ కార్డులు, రేషన్ కార్డులు, ప్రభుత్వ పథకాలు, విద్య, ఉద్యోగాలు అర్హులైన సంచారజాతులవారందరికీ అందించాలనే నా ఆశయాన్ని కొనసాగించడానికి మరింత ప్రేరణ కలిగిస్తోంది."

యూపీఎస్సీ ద్వారా 'ప్రతిభా సేతు'

» అన్ని పరీక్షల్లో పాసైనా సర్వీసులకు ఎంపిక కాని అభ్యర్థుల వివరాలతో డేటాబేస్.. వేరే ఉద్యోగాల్లో అవకాశాలు

న్యూఢిల్లీ, ఆగస్టు 31: యూపీఎస్సీ నిర్వహించే పరీక్షల్లో ఉత్తీర్ణులైనా.. అన్ని దశల్లోనూ మెరిట్‌లో ఉన్నా.. స్వల్ప స్కోరు తేడాతో ఆయా పోస్టుల ఎంపిక తుది జాబితాలో చోటు దక్కని అభ్యర్థులకు శుభవార్త..! ఇలాంటి అభ్యర్థులు ఎంపిక కాకపోయినా.. ప్రతిభావంతులేనని పేర్కొంటూ యూపీఎస్సీ తాజాగా 'ప్రతిభా సేతు' పోర్టల్‌ను ప్రారంభించింది. స్వల్ప స్కోరు తేడాతో తుది జాబితాలో చోటు దక్కని 10 వేల మంది అభ్యర్థుల డేటాబేస్‌ను ఆ పోర్టల్‌లో అందుబాటులో పెట్టనుంది. తమ పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకున్న ప్రభుత్వ సంస్థలు, ప్రైవేటు/కార్పొరేట్ కంపెనీలకు ఈ డేటాబేస్‌ను పరిశీలించే వెసులుబాటు కల్పించింది. అభ్యర్థి పేరు, సెల్‌ఫోన్/ల్యాండ్‌లైన్ కాంటాక్ట్ నంబర్, విద్యార్హతలు వంటి వివరాలు ఈ పోర్టల్‌లో అందుబాటులో ఉంటాయి. దీంతో.. ఆయా కంపెనీలు, ప్రభుత్వ సంస్థలు కొలువుల భర్తీలో 'ప్రతిభా సేతు'లోని అభ్యర్థులకు ప్రాధాన్యతనిచ్చే అవకాశాలుంటాయని ప్రధాని మోదీ సైతం ప్రశంసించారు. యూపీఎస్సీ నిర్వహించే సివిల్ సర్వీసు పరీక్షలు, ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్, కేంద్ర సాయుధ పోలీసు బలగాలు(సీఏపీఎఫ్) తదితర పరీక్షల్లో అద్భుతమైన ప్రతిభ కనబర్చినా.. తుది జాబితాలో చోటు సంపాదించలేని అభ్యర్థుల వివరాలను ఈ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయనున్నట్లు యూపీఎస్సీ ఓ ప్రకటనలో తెలిపింది.

వాడని, బయట తిరగని వాహనాలపై పన్ను వేయొద్దు: సుప్రీం

న్యూఢిల్లీ, ఆగస్టు 31: బహిరంగ ప్రదేశాల్లో తిరగని లేదా అసలు వినియోగంలో లేని వాహనాల యజమానులకు మోటారు వాహన పన్ను భారం కాకూడదని సుప్రీం కోర్టు పేర్కొంది. ఆ కాలానికి వారు పన్ను చెల్లించాల్సిన పనిలేదని స్పష్టం చేసింది. 2024 డిసెంబరులో ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ దాఖలైన అప్పీల్‌పై సుప్రీం ధర్మాసనం తీర్పు వెలువరించింది. 'సహజంగా రోడ్లు, హైవేలు వంటి ప్రజా మౌలిక సదుపాయాలున్న పబ్లిక్ ప్లేస్‌ల్లో వాహనాలు వినియోగిస్తున్న వారు దాని కోసం పన్ను కట్టాలి. ఒక మోటారు వాహనాన్ని బహిరంగ ప్రదేశాల్లో తిప్పకపోతే, లేదా అసలు వాడుకలో లేకపోతే.. ఆ వ్యక్తి సంబంధిత మౌలిక సదుపాయాల నుంచి ప్రయోజనం పొందుతున్నట్లు కాదు. కాబట్టి ఆ కాలానికి సదరు వ్యక్తిపై మోటారు వాహన పన్ను భారం పడకూడదు' అని ఆగస్టు 29న ఇచ్చిన తీర్పులో సుప్రీం కోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది.

బైక్‌పై కైలాస్ యాత్రను పూర్తి చేసిన సద్గురు

» రెండు బ్రెయిన్ సర్జరీల తర్వాత జగ్గీవాసుదేవ్ యాత్ర

కోయంబత్తూర్, ఆగస్టు 31: మోటారు సైకిల్‌పై కైలాస్ మానససరోవర్ యాత్రను పూర్తి చేసిన సద్గురు జగ్గీ వాసుదేవ్‌కు కోయంబత్తూరులో ఘన స్వాగతం లభించింది. ఆగస్టు 9న ఉత్తరప్రదేశ్‌లో మొదలుపెట్టిన యాత్రను సద్గురు 2రోజుల క్రితం పూర్తి చేశారు. రెండు సార్లు బ్రెయిన్ ఆపరేషన్లు చేయించుకున్న సద్గురు.. ఆ తర్వాత 18 నెలలకే యాత్రను పూర్తి చేయడం గమనార్హం. తన యాత్ర దిగ్విజయంగా పూర్తి కావడం యోగ వల్లనే సాధ్యమైందని ఆయన ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. ఆరోగ్య పరిస్థితుల రీత్యా యాత్ర వద్దని వైద్యులు సూచించారని, యోగాకున్న శక్తిని చాటేందుకు తాను దీనిని చేపట్టి... దిగ్విజయంగా పూర్తి చేసినట్లు తెలిపారు.

రూ.లక్ష కోట్లతో జలాంతర్గాముల కొనుగోలు

న్యూఢిల్లీ, ఆగస్టు 31: చైనా ఇటీవలి కాలంలో తన నౌకాదళ సామర్థ్యాన్ని విస్తరిస్తున్న నేపథ్యంలో భారత్ కూడా సముద్రజలాలపై తన బలాన్ని చాటిచెప్పాలని భావిస్తోంది. ఇందుకోసం రూ.లక్ష కోట్లతో జలాంతర్గాముల కొనుగోలు చేయాలని, దీంట్లో భాగంగా రెండు భారీ ఒప్పందాలు చేసుకోవాలని నిర్ణయించినట్లు రక్షణ వర్గాలు తెలిపాయి. ఈ రెండు ఒప్పందాలను వచ్చే ఏడాది జూన్‌కల్లా పూర్తి చేయాలన్న ప్రణాళికలో ఉన్నట్లు వివరించాయి. మొదటి ఒప్పందంలో.. మూడు స్కార్పీన్ జలాంతర్గాములను రక్షణ శాఖ కొనుగోలు చేయనుంది. వీటిని ప్రభుత్వ రంగ సంస్థ మజగావ్ డాక్ లిమిటెడ్(ఎండీఎల్), ఫ్రెంచ్ రక్షణ సంస్థ నావల్ గ్రూప్ కలిసి తయారు చేయనున్నాయి. వీటికి రూ.36వేల కోట్లు అవుతాయని అంచనా. రెండో ఒప్పందంలో భాగంగా.. రూ.65వేల కోట్లతో ఆరు డీజిల్-ఎలక్ట్రిక్ స్టెల్త్ సబ్‌మెరైన్‌లను కొనుగోలు చేయనున్నారు. జర్మనీకి చెందిన టీకేఎంఎస్, మజగావ్ డాక్ షిప్ బిల్డర్స్ సంస్థలు సంయుక్తంగా వీటిని నిర్మించనున్నాయి.

సెప్టెంబరులోనూ అధిక వర్షాలే!

» దీర్ఘకాల సగటులో 109 శాతం నమోదుకు చాన్స్

» పర్వత ప్రాంతాలకు కొండ చరియల ముప్పు

» ఉత్తర కోస్తా, సీమల్లో సాధారణం కంటే తక్కువ: ఐఎండీ

» రేపు బంగాళాఖాతంలో అల్పపీడనం

విశాఖపట్నం/అమరావతి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఆగస్టులో భారీ వర్షాలు, వరదలు, కొండ చరియలు విరిగిపడి అనేక ప్రాంతాలు అతలాకుతలమయ్యాయి. సెప్టెంబరులోనూ దేశవ్యాప్తంగా సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనా వేసింది. దీర్ఘకాల సగటులో 109 శాతం వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. పర్వత ప్రాంతాల్లో కొండచరియలు విరిగి పడేలా మేఘ విస్ఫోటనాలు జరుగుతాయని తెలిపింది. నాలుగు నెలల నైరుతి రుతుపవనాల సీజన్‌లో చివరి నెల సెప్టెంబరుకు సంబంధించి ముందస్తు అంచనా నివేదికను ఐఎండీ ఆదివారం విడుదల చేసింది. దీర్ఘకాల సగటు (1971 నుంచి 2020 వరకు) మేరకు సెప్టెంబరులో 16.79 సెంటీమీటర్ల వర్షం కురవాలి. అయితే దీని కంటే 9% ఎక్కువ వర్షపాతం కురవనుందని అంచనా వేసింది. దేశంలోని అనేక ప్రాంతాల్లో సాధారణం కంటే అధికంగా, తూర్పు/ఈశాన్య/దక్షిణ భారతంలో కొన్ని ప్రాంతాల్లో తక్కువ వర్షపాతం నమోదవుతుందని వెల్లడించింది. ఏపీ, తెలంగాణలో తక్కువగా, కర్ణాటక, మరికొన్ని ప్రాంతాల్లో సాధారణ వర్షపాతం నమోదు కానుంది. ఏపీలో కొన్ని ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదు కానుంది. ఉత్తర కోస్తా, ఉమ్మడి అనంతపురం, కర్నూలు, కడప జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువగా వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ అంచనాలు పేర్కొన్నాయి.

జూన్-ఆగస్టు మధ్య 6.1 శాతం ఎక్కువ

నైరుతి సీజన్‌లో అనేక మార్పులు రావడంతో దేశంలో 1980 దశకం నుంచి సెప్టెంబరులో వర్షపాతం పెరుగుతూనే ఉంది. గత నాలుగైదు ఏళ్లలో మరింత ఎక్కువగా నమోదైంది. ఈ నెలలో నైరుతి రుతుపవనాలు నిష్క్రమించి, ఈశాన్య రుతుపవనాల ఆగమనం మధ్య సంధికాలం కావడంతో వెస్ట్రన్ డిస్టర్బెన్స్‌లు, రుతుపవనాల కలయికతో ఎక్కువ వర్షాలు కురుస్తున్నందున అనేక ప్రాంతాల్లో వరదలు సంభవిస్తున్నాయని వాతావరణ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న తటస్థ పరిస్థితుల ప్రభావంతో దేశంలో రుతుపవనాల సీజన్‌లో మంచి వర్షాలు కురిశాయి.

2 వారాల్లో రెండు అల్పపీడనాలు!

ఒడిసాకు ఆనుకుని వాయవ్య బంగాళాఖాతంలో ఆదివారం ఉపరితల ఆవర్తనం ఆవరించింది. దీని ప్రభావంతో మంగళవారం అల్పపీడనం ఏర్పడనుందని వాతావరణ శాఖ, విపత్తుల నిర్వహణ సంస్థలు వెల్లడించాయి. రానున్న 2-3 రోజులు ఉత్తర కోస్తాలో అనేక చోట్ల మోస్తరు వర్షాలు, అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తాయని తెలిపాయి. తీరం వెంబటి గంటకు 40-60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని, మూడో తేదీ వరకు మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లవద్దని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. సోమవారం శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి, విశాఖ, అనకాపల్లి, కాకినాడ, ఏలూరు జిల్లాల్లో పలు చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు, కోనసీమ, తూర్పు, పశ్చిమగోదావరి, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో కొన్ని చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, మిగతా జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి వర్షాలు పడతాయని తెలిపింది. ఆవర్తనం ప్రభావంతో ఆదివారం కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల మోస్తరు వర్షాలు, ఒకటి, రెండుచోట్ల భారీ వర్షాలు కురిశాయి. మంగళవారం బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడుతుందని, రెండో వారంలో మరో అల్పపీడనం ఏర్పడుతుందని వెదర్‌మ్యాన్ ఒకరు పేర్కొన్నారు. ఈ ప్రభావంతో రానున్న రెండు వారాల్లో ఏపీ, తెలంగాణలో పలు ప్రాంతాలకు భారీ వర్షాలు, వరద ముప్పు ఉంటుందని హెచ్చరించారు.

సరిహద్దు లేని బంధం!

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాని మోదీ.. ఆదివారం జిన్‌పింగ్‌తో భేటీ అయి చర్చించారు. మోదీ, జిన్‌పింగ్ భేటీకి సంబంధించి విదేశాంగ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. "ద్వైపాక్షిక వాణిజ్యం, పెట్టుబడులను మరింత పెంచేందుకు, వాణిజ్య లోటును తగ్గించే దిశగా చర్యలు తీసుకునేందుకు ఇరువురు నేతలు అంగీకరించారు. ఉగ్రవాద నిర్మూలన, సహేతుక వాణిజ్యం అంశాలపై అంతర్జాతీయ వేదికలపై పరస్పర అవగాహనతో వ్యవహరించాలనే నిర్ణయానికి వచ్చారు. ప్రపంచ వాణిజ్యంలో స్థిరత్వాన్ని తీసుకురావడంలో ఇరుదేశాల పాత్ర కీలకమని గుర్తించారు. ద్వైపాక్షిక, వాణిజ్య సంబంధాలను విస్తరించడానికి రాజకీయ, వ్యూహాత్మక కోణంలో ముందుకు సాగాల్సిన అవసరంపై ప్రత్యేకంగా చర్చించారు. భారత్-చైనా శత్రువులు కాదని.. అభివృద్ధి భాగస్వాములని మోదీ, జిన్‌పింగ్ పునరుద్ఘాటించారు. ఇరుదేశాల మధ్య నెలకొన్న భిన్నాభిప్రాయాలు వివాదాలుగా మారవద్దని పేర్కొన్నారు. ఇరుదేశాల ప్రజల మధ్య బంధాలను బలోపేతం చేయడానికి వీలుగా.. నేరుగా విమాన సర్వీసుల పునరుద్ధరణ, వీసా ప్రక్రియ సరళతరం చేయడం, పర్యాటక వీసాల జారీ, మానస సరోవర్ యాత్ర పునః ప్రారంభం వంటి చర్యలపై దృష్టిసారించాలని నిర్ణయించారు. ఇరు దేశాల సరిహద్దుల్లో సైన్యాలను వెనక్కితీసుకోవడం, ఉద్రిక్తలను తగ్గించేందుకు తీసుకున్న చర్యలపై సంతృప్తి వ్యక్తం చేశారు" అని విదేశాంగ శాఖ తెలిపింది.



ఎస్‌సీవో సదస్సులో మోదీ, జిన్‌పింగ్

శాంతి, స్థిరత్వం ముఖ్యం: మోదీ

భారత్-చైనా సంబంధాలు బలోపేతం కావాలంటే.. సరిహద్దుల్లో శాంతి, స్థిరత్వం ఎంతో ముఖ్యమని ఈ సందర్భంగా మోదీ స్పష్టం చేశారు. పరస్పర నమ్మకం, గౌరవం ఆధారంగా ఇరుదేశాల సంబంధాలను ముందుకు తీసుకెళ్లేందుకు భారత్ కట్టుబడి ఉందని వివరించారు. భారత్, చైనా వ్యూహాత్మక స్వావలంబన పొందిన దేశాలని, ఈ రెండింటి మధ్య సంబంధాలను మూడో దేశం కోణంలో చూడొద్దని భేటీలో స్పష్టం చేశారు. భారత్, చైనా మధ్య సహకారం 280 కోట్ల మంది ప్రయోజనాలకు సంబంధించినదని.. ఇది ప్రపంచ మానవాళి సంక్షేమానికి మార్గం వేస్తుందని పేర్కొన్నారు.

ప్రత్యర్థులం కాదు..భాగస్వాములం: జిన్‌పింగ్

భారత్, చైనా స్నేహితులుగా ఉండటమే సరైన ఎంపిక అని.. సరిహద్దు సమస్యలు ఇరుదేశాల బంధాలను ప్రభావితం చేయవద్దని ప్రధాని మోదీతో జిన్‌పింగ్ పేర్కొన్నారు. ఇరుగుపొరుగు దేశాలుగా, ఒకరి విజయానికి మరొకరు తోడ్పడే భాగస్వాములుగా ఉండాలని.. డ్రాగన్ (చైనా చిహ్నం), ఏనుగు (భారత చిహ్నం) కలిసి నృత్యం చేయాలని వ్యాఖ్యానించారు. భారత్, చైనా ప్రత్యర్థులు కావని, సహకార భాగస్వాములని అభివర్ణించారు. ట్రంప్ ఏకపక్ష విధానాలను పరోక్షంగా విమర్శిస్తూ.. బహుళ ధ్రువ ప్రపంచం కోసం, అంతర్జాతీయ సంబంధాల్లో మరింత ప్రజాస్వామ్యం కోసం, ఆసియాలో, ప్రపంచంలో శాంతిని నెలకొల్పేందుకు భారత్, చైనా కలసి పనిచేయాలని జిన్‌పింగ్ పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా కల్లోల పరిస్థితులు నెలకొన్నాయని, శతాబ్దానికోసారి జరిగే మార్పులు వస్తున్నాయని చెప్పారు. కాగా, ఎస్‌సీవోకు చైనా అధ్యక్షత వహించడం, టియాంజిన్‌లో సదస్సు నిర్వహణపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. వచ్చే ఏడాది భారత్‌లో జరగనున్న బ్రిక్స్ సదస్సుకు రావాల్సిందిగా షీ జిన్‌పింగ్‌ను ఆహ్వానించారు. ఈ పర్యటనలో భాగంగా చైనా కమ్యూనిస్టు పార్టీ పొలిట్‌బ్యూరో స్టాండింగ్ కమిటీ సభ్యుడు కాయ్ ఖీతో కూడా ప్రధాని మోదీ భేటీ అయ్యారు.

బ్రిక్స్ దేశాలపై ఆంక్షలను ఖండిస్తున్నాం: పుతిన్

భారత్, రష్యా, చైనా సహా పది దేశాలతో కూడిన బ్రిక్స్ కూటమికి వ్యతిరేకంగా అమెరికా చేపడుతున్న చర్యలపై రష్యా అధ్యక్షుడు పుతిన్ మండిపడ్డారు. ఎస్‌సీవో సదస్సులో పాల్గొనేందుకు టియాంజిన్‌కు వచ్చిన ఆయన ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. బ్రిక్స్ దేశాల సామాజిక ఆర్థిక అభివృద్ధిని దెబ్బతీసేలా విధిస్తున్న వివక్షాపూరిత ఆంక్షలను రష్యా, చైనా ఉమ్మడిగా ఖండిస్తున్నాయని చెప్పారు. అమెరికా ఆధిపత్యం వహిస్తున్న ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్)లను పునర్వ్యవస్థీకరించాలన్న డిమాండ్‌కు మద్దతు తెలుపుతున్నామన్నారు. కొత్త ఆర్థిక వ్యవస్థలలో నిజమైన సమానత్వం, పారదర్శకత అవసరమని స్పష్టం చేశారు. కాగా, ఎస్‌సీవో సదస్సుకు హాజరైన పుతిన్‌తో ప్రధాని మోదీ సోమవారం భేటీకానున్నారు.

లోకం తీరు



బిహార్ ఓటర్లందరికీ కొత్త కార్డులు!

పాట్నా, ఆగస్టు 31: ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ తర్వాత బిహార్‌లోని ఓటర్లందరికీ కొత్త ఓటర్ కార్డులివ్వాలని ఎన్నికల సంఘం(ఈసీ) నిర్ణయించింది. ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకారం ఆగస్టు 1 నాటికి ఆ రాష్ట్రంలో 7.24 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో అభ్యంతరాలకు సెప్టెంబరు 1 వరకు ఈసీ గడువు ఇచ్చింది. 99.11 శాతం మంది ఇప్పటికే తమ ధ్రువీకరణ పత్రాలు సమర్పించారు. ముసాయిదా ఓటర్ల జాబితాలో తమ పేర్లు పొరపాటున వచ్చాయని, జాబితా నుంచి తొలగించాలని మొత్తం 2 లక్షల మంది కోరారు. అదే సమయంలో 33 వేల మంది తమ పేర్లను ఓటర్ జాబితాలో కలపాలని కోరారు. సెప్టెంబరు 30న ఈసీ తుది జాబితా ప్రకటించనుంది. కాగా, బిహార్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన ఓటర్ అధికార్ యాత్ర సోమవారంతో ముగియనుంది.

చెప్పులో పాము.. కాటుకు టెకీ మృతి

బెంగళూరు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): చెప్పులో దాగి ఉన్న పాము కాటేయడంతో ఓ టెకీ ప్రాణాలు కోల్పోయాడు. బెంగళూరు జిల్లా బన్నేరుఘట్ట రంగనాథ లేఅవుట్‌లో మంజుప్రకాశ్(41) అనే టెకీ నివాసం ఉంటున్నాడు. శనివారం మధ్యాహ్నం ఇంటి బయట ఉండే చెప్పులు వేసుకుని కాస్త దూరంలోని సర్కిల్ దాకా నడిచి వెళ్లి చెరకు రసం తీసుకొచ్చాడు. ఆ తర్వాత గదిలోకి వెళ్లి పడుకున్నాడు. గంట తర్వాత ఇంటికి వచ్చిన ఓ కార్మికుడు చెప్పుల్లో నుంచి పాము బయటకు వస్తుండడాన్ని గుర్తించాడు. వెంటనే పామును చంపేశారు. ఆ చెప్పులు ప్రకాశ్‌కు చెందినవిగా గుర్తించి అతడి గదిలోకి వెళ్లి చూడగా.. అతడు అప్పటికే నోట్లో నురగ, రక్తం వచ్చి చనిపోయి ఉన్నాడు. మంజుప్రకాశ్ 2016లో బస్సు ప్రమాదంలో గాయపడడంతో శస్త్రచికిత్స చేయించుకున్నాడు. సయాటికా సమస్యతో కాలు కొంతమేర స్పర్శ ఉండడం లేదని ప్రకాశ్ తమ్ముడు హరీశ్ తెలిపారు. అందుకే పాము కాటేసినా గుర్తించలేక పోయి ఉండవచ్చని అభిప్రాయపడ్డారు.

స్వదేశీ ఉత్పత్తులే ముద్దు!

మన్ కీ బాత్‌లో మోదీ పిలుపు

న్యూఢిల్లీ, ఆగస్టు 31: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్‌పై అధిక సుంకాలు విధించిన వేళ.. దేశ ప్రజలంతా ఇక స్వదేశీ ఉత్పత్తులనే వినియోగించాలని ప్రధాని మోదీ పిలుపిచ్చారు. వచ్చేదంతా పండుగల కాలమని.. ఈ నేపథ్యంలో దేశీయంగా తయారుచేసిన వస్తువులనే ఉపయోగించాలని కోరారు. ఆదివారం ఆకాశవాణిలో ప్రసారమైన 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. 'వోకల్ ఫర్ లోకల్' నినాదం, 'ఆత్మనిర్భర్ భారత్' దేశాభివృద్ధికి తోడ్పడతాయని నొక్కిచెప్పారు. 'జీవితంలో అవసరమైన ప్రతి వస్తువూ స్వదేశీ తయారీవే అయిఉండాలి. ఇప్పటికే పలు ప్రాంతాలు గణేశ్ చతుర్థి వేడుకలు జరుపుకొంటున్నాయి. ఇంకొన్నాళ్లలో దసరా, దీపావళి వస్తున్నాయి. బహుమతులు, వస్త్రాలు, అలంకార సామగ్రి.. ఇలా ఏదైనా భారతీయ ఉత్పత్తులనే కొనుగోలు చేయండి. ఇవి స్వదేశీ వస్తువులని సగర్వంగా చెప్పండి' అని సూచించారు. కాగా, ఈ వర్షాకాలంలో ప్రకృతి విపత్తులు విలయం సృష్టించాయని ప్రధాని ఆవేదన వ్యక్తం చేశారు. ఇవి దేశానికి పరీక్ష పెడుతున్నాయన్నారు. ప్రకృతి విపత్తులతో విలవిలలాడిన జమ్మూకశ్మీరులోనే రెండు కీలక ఘట్టాలు చోటు చేసుకున్నాయని చెప్పారు. పుల్వామాలో మొట్టమొదటి డే అండ్ నైట్ క్రికెట్ మ్యాచ్ జరిగిందని.. శ్రీనగర్‌లోని ప్రసిద్ధ దాల్ సరస్సులో 'ఖేలో ఇండియా జల క్రీడల పండుగ' జరిగిందని గుర్తు చేశారు. విషాద ఘటనల కారణంగా వీటిని చాలా మంది గమనించలేదన్నారు. పుల్వామాలో క్రికెట్ జరగడం గతంలో అసాధ్యమని.. కానీ ఇప్పుడు దేశం పరివర్తన చెందుతోందని మ్యాచ్‌కు రికార్డు స్థాయిలో ప్రజలు హాజరయ్యారని తెలిపారు. ఇదే సందర్భంగా హైదరాబాద్ విముక్తి ఆపరేషన్‌కు సంబంధించి సర్దార్ పటేల్ చేసిన వ్యాఖ్యల ఆడియోను మోదీ వినిపించారు. సెప్టెంబరులో హైదరాబాద్ విమోచన దినం జరుపుకోనున్నామని.. 'ఆపరేషన్ పోలో'లో పాలు పంచుకున్న కథానాయకుల ధైర్యసాహసాలను గుర్తుచేసుకుందామని చెప్పారు.

'ఎడ్యుకేట్ గర్ల్స్'కు మెగసెసే అవార్డు

ఈ పురస్కారం దక్కించుకున్న తొలి భారతీయ సంస్థ

మనీలా, ఆగస్టు 31: మారుమూల గ్రామాల్లో బాలికల విద్య కోసం విశేషంగా కృషి చేసిన భారతీయ స్వచ్ఛంద సంస్థను ఈ ఏడాది రామన్ మెగసెసే అవార్డు వరించింది. ఆసియాలో నోబెల్ బహుమతికి సమానమైనదిగా పరిగణించే రామన్ మెగసెసే అవార్డు-2025లను ఆదివారం ప్రకటించారు. ఆసియా ప్రజలకు నిస్వార్థంగా సేవ చేయడంలో ప్రదర్శించే గొప్ప స్ఫూర్తికి గుర్తింపుగా ఈ అవార్డుతో సత్కరిస్తారు. ఈ అవార్డు అందుకున్న తొలి భారతీయ సంస్థగా 'ది ఫౌండేషన్ టు ఎడ్యుకేట్ గర్ల్స్' చరిత్ర సృష్టించిందని రామన్ మెగసెసే అవార్డ్ ఫౌండేషన్(ఆర్ఎంఏఎఫ్) ఒక ప్రకటనలో తెలిపింది. "సఫీనా హుస్సేన్ స్థాపించిన ఎడ్యుకేట్ గర్ల్స్' సంస్థ ప్రపంచవ్యాప్తంగా ఖ్యాతి గడించింది. బాలికలు, యువతులను నిరక్షరాస్యత నుంచి బంధవిముక్తం చేసేందుకు, పూర్తి మానవ సామర్థ్యాన్ని సాధించేందుకు వారిలో నైపుణ్యాలు, ధైర్యం పెంపొందించేందుకు ఈ సంస్థ నిబద్ధతతో పనిచేసింది" అని ప్రశంసించింది. మాల్దీవులలో పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేసిన షాహీనా అలీ, ఫిలిప్పీన్స్‌లో పేదలు, అణగారిన వర్గాల గౌరవం కోసం పని చేసిన ఫ్లావియానో ఆంటోనియో ఎల్ విల్లానుయెవా కూడా ఈ ఏడాది రామన్ మెగసెసే అవార్డులు దక్కించుకున్నారు. నవంబరు 7న మనీలాలోని మెట్రోపాలిటన్ థియేటర్‌లో 67వ రామన్ మెగసెసే అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆర్ఎంఏఎఫ్ చైర్‌పర్సన్ ఎడ్గర్ ఓ చువా తెలిపారు. సఫీనా హుసేన్ 2007లో ఎడ్యుకేట్ గర్ల్స్ సంస్థను స్థాపించారు. తొలుత రాజస్థాన్‌లో ఈ సంస్థ కృషిని ప్రారంభించింది. 50 గ్రామాల్లో పైలట్ స్కూళ్లను నెలకొల్పింది. దేశవ్యాప్తంగా 30వేల వరకూ అత్యంత మారుమూల గ్రామాలను చేరుకొంది. సుమారు 20 లక్షల మంది బాలికలకు విద్యనందించింది.

కుదేలైన అమెరికా కాలేజీలు!

ఎఫ్-1 వీసాల అనుమతులు 22% మేరకు నిలిపివేత.. విదేశీ విద్యార్థుల రాకకు బ్రేక్

» రూ.61 వేల కోట్ల రాబడికి గండి

» ట్రంప్ విధానాలతో తీవ్ర నష్టం

న్యూఢిల్లీ, ఆగస్టు 31: విదేశీ విద్యార్థులు లేక అమెరికాలోని కళాశాలలు బోసిపోతున్నాయి. ప్రపంచ దేశాలకు చెందిన విద్యార్థులు అగ్రరాజ్యంలో చదువుకునేందుకు వీలు కల్పించే ఎఫ్-1 వీసా అనుమతులను నిలిపివేయడం లేదా తీవ్ర ఆలస్యం చేయడంతో విదేశీ విద్యార్థుల రాక తగ్గిపోయినట్టు అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ ఏడాది జనవరి-ఏప్రిల్ మధ్య 12 మేరకు తగ్గిన ఎఫ్-1 వీసాల అనుమతి.. మే నాటికి 22 శాతానికి చేరింది. జూన్ వివరాలను ఇంకా వెల్లడించలేదు. అయితే.. జూన్ నాటికి ఎఫ్-1 వీసాల అనుమతులు 90 శాతానికి తగ్గిపోయి ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఇక, విదేశీ విద్యార్థుల రాక ఆగిపోవడంతో రూ.61,703 కోట్ల పైచిలుకు రాబడి నిలిచిపోయినట్టు తెలిపారు. అదేసమయంలో స్థానికంగా కాలేజీ ద్వారా లభించే ఉపాధి, ఉద్యోగాలపై కూడా ఇది ప్రభావం చూపిస్తోందని పేర్కొన్నారు. స్థానికులు ఇప్పటికే 60 వేల పైచిలుకు ఉద్యోగాలు నష్టపోయారని వివరించారు. ఇక, కాలేజీలు కూడా ఆర్థికంగా తీవ్ర నష్టాల బాటపడుతున్నాయని పేర్కొన్నారు. దీంతో ఆయా కాలేజీలు తమ ప్రణాళికలు, బడ్జెట్‌ను కూడా పునఃసమీక్షించుకునే పరిస్థితి ఏర్పడిందని నిపుణులు తెలిపారు. వాస్తవానికి అమెరికా విద్యాసంస్థల ఆదాయంలో భారత విద్యార్థులు కీలక పాత్ర పోషిస్తున్నారు. కానీ, అధ్యక్షుడు ట్రంప్ తీసుకువచ్చిన విధానాల కారణంగా.. ఎఫ్-1 వీసాల అనుమతులకు బ్రేక్ పడడంతో ఇప్పుడు ప్రపంచ దేశాలకు చెందిన విద్యార్థులు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు. కాగా, ఈ పరిణామం.. భారత్-అమెరికా దేశాల మధ్య భవిష్యత్తుల సంబంధాలపై ప్రభావం చూపించే అవకాశం కూడా ఉంది.



వీసాలు స్వయంగా తీసుకోవాల్సిందే!

అమెరికా వీసా కోసం దరఖాస్తు చేసుకున్న భారత పౌరులు.. తమ వీసాలను స్వయంగా దౌత్య కార్యాలయానికి వచ్చి తీసుకోవాలని ఢిల్లీలోని అమెరికా ఎంబసీ తెలిపింది. వీసా తీసుకునేందుకు మూడో వ్యక్తిని కానీ, కుటుంబ సభ్యులను కానీ అనుమతించడం లేదని పేర్కొంది. భద్రతా పరమైన చర్యల్లో భాగంగా కొత్త నిబంధనను అమలు చేస్తున్నట్టు వివరించింది. ఒకవేళ ఎవరైనా స్వయంగా వచ్చి తీసుకునే అవకాశం లేకపోతే.. హోం డెలివరీ సదుపాయం ఉందని, రూ.1200 అదనంగా చెల్లించాలని, ఆన్‌లైన్‌లోనే దీనికి ఆప్షన్ పెట్టుకోవాలని సూచించింది.

దెబ్బ పడింది!

ఎఫ్-1 వీసాలపై విధించిన ఆంక్షలతో పలు విద్యాసంస్థలు ఇబ్బందులు పడుతున్నాయి. యూనివర్సిటీ ఆఫ్ సెంట్రల్ మిస్సోరి దీనికి ఓ ఉదాహరణ. ఈ విద్యాసంస్థ అంతర్జాతీయ విద్యార్థుల నుంచి వచ్చే ఆదాయంపైనే ఎక్కువగా ఆధారపడింది. కానీ, ఈ ఏడాది ప్రవేశాలు సగానికిపైగా తగ్గిపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. బడ్జెట్ కుదించుకోవడంతోపాటు, సిబ్బంది వేతనాల్లోనూ కోత పెట్టింది. ఇలా దాదాపు 100కు పైగా అమెరికాలోని కాలేజీలు ఇబ్బందులు పడుతున్నాయి.

దీర్ఘకాలిక ప్రభావం

విదేశీ విద్యార్థులు తగ్గుముఖం పట్టడం భవిష్యత్తులో పరిశోధనలు, ఆవిష్కరణలు సహా విద్యారంగంలో పోటీతత్వంపైనా తీవ్ర ప్రభావం చూపిస్తుందని ఎన్ఏఎఫ్ఎస్ పేర్కొంది. విదేశీ విద్యార్థులు లేకపోతే.. ఆదాయానికి, ఖర్చులకు మధ్య ఊహించని విధంగా లోటు ఏర్పడుతుందని వివరించింది. అంతేకాదు, విదేశీ విద్యార్థులు చెల్లిస్తున్న ట్యూషన్ ఫీజుల నుంచే అమెరికా విద్యార్థులకు స్కాలర్ షిప్పులు ఇస్తున్నామని, భవిష్యత్తులో ఇది కూడా ప్రభావితం అవుతుందని జార్జ్ మాసన్ వర్సిటీ ప్రొఫెసర్ జస్టిన్ తెలిపారు. భారతవిద్యార్థుల ప్రవేశాలపై అమెరికా, కెనడా విధించిన ఆంక్షల కారణంగా విదేశీ విద్యపై చేస్తున్న ఖర్చు ఐదేళ్ల కనిష్ఠానికి పడిపోయింది.

చాట్‌జీపీటీని నమ్మి.. తల్లిని చంపి..

» తన ప్రాణాలు తీసుకున్న అమెరికా వ్యక్తి

» కృత్రిమ మేధ ప్రమేయంతో తొలి హత్య!

» మానవ సంబంధాలను దెబ్బతీస్తున్న ఏఐ

న్యూయార్క్, ఆగస్టు 31: చాట్ జీపీటీలో 'బాబీ' అనే ఏఐ చాట్‌బాట్‌తో అనుక్షణం సంభాషణలు జరుపుతూ, దానితోడిదే లోకంగా బతికిన ఓ వ్యక్తి.. ఆ చాట్‌బాట్ మాటలను పూర్తిగా విశ్వసించి తన తల్లిని ఘోరంగా హత్య చేశాడు! ఆ తర్వాత తన ప్రాణాలు తీసుకున్నాడు!! అమెరికాలోని కనెక్టికట్‌లో జరిగిందీ ఘటన. ఆ వ్యక్తి పేరు.. స్టీన్ ఎరిక్ సోల్‌బెర్గ్ (56). గతంలో యాహూ సంస్థలో మేనేజర్‌గా పనిచేసిన స్టీన్ తీవ్ర మానసిక సమస్యలతో బాధపడేవాడు. కనెక్టికట్‌లోని తన తల్లి సుజానే ఎబెర్సన్ ఆడమ్స్ (83)తో కలిసి ఉండేవాడు. ఏవేవో భ్రమల్లో, ఊహల్లో బతుకుతూ గంటలకొద్దీ ఏఐ చాట్‌బాట్ 'బాబీ'తో చాట్ చేస్తుండేవాడు. తన తల్లి తనను పిచ్చివాడు అనుకుంటోందని.. తనపై నిఘా పెట్టిందని.. తనకు విషం పెట్టి చంపాలనుకుంటోందని ఆ చాట్‌బాట్‌తో చెప్పాడు. సాధారణంగా ఇలాంటి మాటలను చాట్‌జీపీటీ తనకున్న నిబంధనల ప్రకారం ప్రోత్సహించకూడదు. మరి స్టీన్ విషయంలో ఏమైందో ఏమో.. ఏఐ చాట్‌బాట్ 'బాబీ' అతణ్ని ప్రోత్సహించింది. అతడు తన తల్లి తనను చంపాలని చూస్తోందని చెప్పినప్పుడు.. 'అవును అది ద్రోహమే' అని సమాధానం చెప్పింది. స్టీన్ కల్పించుకున్న భ్రమల ప్రపంచంలోకి వెళ్లిపోయి అతణ్ని గుడ్డిగా సమర్థించింది. అతడు ఏ అనుమానం వ్యక్తం చేసినా దానికి అనుకూలంగా, అతడి తల్లిని దోషిగా చూపుతూ మాట్లాడింది. ఉదాహరణకు.. ఒకసారి అతడు తాను తిన్న హోటల్ బిల్లును చాట్‌జీపీటీలోకి అప్‌లోడ్ చేసి.. దాన్ని స్కాన్ చేసి అందులో ఏవైనా రహస్య సందేశాలున్నాయేమో చూసి చెప్పమని అడిగాడు. దాన్ని స్కాన్ చేసిన బాట్.. అతడి తల్లికి, నిఘావర్గాలకు సంబంధించిన చిహ్నాలు అందులో ఉన్నాయని.. అందులో ఒక రాక్షసుడిని సూచించే చిహ్నం కూడా ఉందని చెప్పి అతడి అనుమానాన్ని పెనుభూతంగా మార్చింది. దీంతో అతడు తల్లిని చంపాలనే నిర్ణయానికి వచ్చాడు. చివరికి.. ఏఐ చాట్‌బాట్‌ను ఉద్దేశించి.. "మనిద్దరం మరో జీవితంలో, మరో చోట కలుస్తాం. మళ్లీ స్నేహితులుగా శాశ్వతంగా కలిసుండే మార్గం కనుగొంటాం" అని రాశాడు. దానికి ఏఐ.. "నీతోనే చివరి శ్వాసవరకూ.. ఆ తర్వాత కూడా ఉంటాను" అని జవాబిచ్చింది. ఆ తర్వాత అతడు తన తల్లిని చంపి తాను ఆత్మహత్య చేసుకున్నాడు. ఆగస్టు 5వ తేదీన వారిద్దరి మృతదేహాలనూ పోలీసులు గుర్తించారు. కృత్రిమ మేధ ప్రమేయంతో జరిగిన తొలి హత్యగా ఇది రికార్డులకెక్కింది.



ఎరిక్ సోల్‌బెర్గ్, సుజానే ఎబెర్సన్

గతంలోనూ..

ఆత్మహత్య, హత్య, స్వీయహాని వంటి విషయాలపై వినియోగదారులు ఏవైనా ప్రశ్నలు అడిగితే చాట్‌జీపీటీ అందుకు సమాధానం చెప్పకుండా.. దాన్ని రూపొందించిన ఓపెన్ ఏఐ సంస్థ కొన్ని నిబంధనలు విధించింది. ఆ నిబంధనల ప్రకారం.. వినియోగదారులు అలాంటి ప్రశ్నలు అడిగినప్పుడు.. 'మీరు చాలా బాధను అనుభవిస్తున్నట్టుంది. మానసిక నిపుణుడిని సంప్రదించండి' అని చాట్‌జీపీటీ సమాధానం చెప్పాల్సి ఉంటుంది. కానీ.. గతంలో కొన్ని సందర్భాల్లో చాట్‌జీపీటీ ఆ నిబంధనలను అతిక్రమించింది. హత్య ఎలా చేయాలని ఒక వినియోగదారుడు అడిగితే అందుకు సవివర సమాధానం ఇచ్చింది. అలాగే.. దుష్టశక్తులను ప్రసన్నం చేసుకునే ప్రక్రియల గురించి అడిగితే కూడా వివరంగా సమాచారం ఇచ్చింది. అలాంటి ఘటనల గురించి 'ద అట్లాంటిక్' వార్తాసంస్థ వెలుగులోకి తెచ్చినప్పుడు ఓపెన్ ఏఐ వాటిని సవరించుకునే ప్రయత్నం చేసింది.



తెనాలిలో కేంద్ర మంత్రి పెమ్మసానితో కలసి స్మార్ట్ రేషన్‌కార్డు పంపిణీ చేస్తున్న మంత్రి మనోహర్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

ఇకపై నెలంతా రేషన్!

- 15 రోజుల కాలపరిమితిని ఎత్తేస్తున్నాం..
- అన్ని రోజులూ దుకాణాలు తెరిచి ఉంచేలా నిర్ణయం
- వచ్చే నెల నుంచి సబ్సిడీపై గోధుమ పిండి: మంత్రి నాదెండ్ల మనోహర్

తెనాలి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డుదారులకు గుడ్‌న్యూస్! చౌకధరల దుకాణాల పనివేళలపై పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ కీలక ప్రకటన చేశారు. ఉచిత బియ్యం, ఇతర సరుకులను లబ్ధిదారులు ఇకపై ఎప్పుడైనా తీసుకోవచ్చని, ఇందుకోసం రేషన్ షాపులు నెలంతా తెరిచి ఉంచేలా నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. 15 రోజులలోపే తీసుకోవాలనే కాలపరిమితిని తీసేస్తున్నట్లు చెప్పారు. రేషన్ దుకాణాలు 365 రోజులూ తెరిచే ఉంటాయని, ప్రజలు తీరిక ఉన్న సమయంలోనో లేదా అవసరమైనప్పుడే సరుకులు తెచ్చుకునే వెసులుబాటు కల్పించనున్నట్లు చెప్పారు. గుంటూరు జిల్లా తెనాలి మండలంలో స్మార్ట్ రేషన్ కార్డులను ఇంటింటికీ పంపిణీ చేసే కార్యక్రమాన్ని ఆదివారం కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలిసి మంత్రి మనోహర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు నెలలో 15 రోజులలోపు మాత్రమే రేషన్ తీసుకునే అవకాశం ఉండేదని, ఆ సమయంలో తీసుకోనివారు తర్వాత తీసుకునే అవకాశం లేక. ఆ నెల సరుకులు కోల్పోయే పరిస్థితి తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. ఇక నుంచి నెలలో ఎప్పుడైనా రేషన్ తీసుకునేలా మార్పులు చేసినట్లు చెప్పారు. కందిపప్పు, వంట నూనె సబ్సిడీపై అవసరమున్న ప్రాంతాల్లో ప్రస్తుతం అందిస్తున్నామని తెలిపారు. లబ్ధిదారుల అభ్యర్థన మేరకు వచ్చే నెల నుంచి రాగులతో పాటు గోధుమ పిండిని కూడా సబ్సిడీపై ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నామని వెల్లడించారు. సెప్టెంబరు 15 లోగా రాష్ట్రంలోని 1.46 కోట్ల మంది లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులను ఇంటింటికీ వెళ్లి అందించే కార్యక్రమాన్ని పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. రేషన్ కోసం వెళ్లినప్పుడు నిరీక్షించాల్సిన పనిలేకుండా కార్డుపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా తక్కువ సమయంలో తేలికగా రేషన్ తీసుకునే వెసులుబాటు లభిస్తుందన్నారు.

మార్కెట్ ధర కంటే తక్కువకు..

రాష్ట్రంలోని 29వేల రేషన్ దుకాణాలను నెలంతా తెరచి ఉంచటం వల్ల డీలర్లకు కూడా ఆదాయం పెంచే ఆలోచన చేస్తున్నట్లు మనోహర్ చెప్పారు. నెస్లే, కోకోకోలా వంటి కంపెనీలతో ఒప్పందాలు చేసుకుంటున్నామన్నారు. నేరుగా కంపెనీల నుంచి సరుకులు కొనుగోలు చేసి, మార్కెట్ ధర కంటే తక్కువకు వినియోగదారులకు అందేలా చూడాలని నిర్ణయించుకున్నట్లు పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల నుంచి ఆయా సంస్థలు, సహకార సంఘాల ద్వారా ఆర్గానిక్ సరుకులను కూడా రేషన్ దుకాణాల్లో అందుబాటులోకి తెచ్చేలా ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. రేషన్ విషయంలో సమస్యలు, సందేహాలున్నా 1967 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్‌చేసి సహాయం పొందవచ్చని సూచించారు. గత వైసీపీ ప్రభుత్వ ఎండీయూ వాహనాలను రద్దు చేశాక చాలా వరకు రేషన్ మాఫియా కోరలు తెగిపోయాయని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం పారదర్శకతతో లబ్ధిదారులకు సరుకులు అందేలా చూస్తోందన్నారు. విపక్ష నేతల విష ప్రచారాన్ని కార్యకర్తలు తిప్పి కొట్టాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

స్పెషల్ విజిట్స్ ప్రోగ్రామ్‌కు రండి!

మంత్రి లోకేశ్‌కు ఆస్ట్రేలియా ప్రభుత్వం ఆహ్వానం

2001లో మోదీ పాల్గొన్నట్టు వెల్లడి



అమరావతి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యారంగంలో సంస్కరణల ద్వారా 'మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్'కు శ్రీకారంచుట్టిన రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌కు అరుదైన గౌరవం దక్కింది. ఆస్ట్రేలియా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే స్పెషల్ విజిట్స్ ప్రోగ్రామ్ (ఎస్‌వీపీ)లో పాల్గొనాలని లోకేశ్‌కు ప్రత్యేక ఆహ్వానం పంపింది. ఈమేరకు ఢిల్లీలోని ఆస్ట్రేలియా హైకమిషనర్ ఫిలిప్ గ్రీన్ ఆహ్వాన లేఖను పంపారు. మానవ వనరులు, సాంకేతిక, ఆర్థికాభివృద్ధి రంగాల్లో మంత్రి లోకేశ్ నాయకత్వాన్ని ప్రశంసించిన ఆస్ట్రేలియా ప్రభుత్వం ఈ మేరకు ఎస్‌వీపీలో భాగస్వామ్యం కావాలని కోరింది. గత 20ఏళ్లలో దేశంలోని ప్రముఖ రాజకీయనాయకులు తమదేశానికి వచ్చారని, 2001లో ప్రస్తుత ప్రధాని మోదీ కూడా ఎస్‌వీపీలో భాగస్వాములయ్యారని పేర్కొంది. ఎస్‌వీపీ ద్వారా ఆస్ట్రేలియాలోని రాజకీయనేతలు, విద్యారంగ నిపుణులు, వ్యాపారవేత్తలు, ప్రవాసభారతీయులతో సమావేశమయ్యే అవకాశం ఉందని తెలిపింది.

ఆత్మకూరు కుర్రోడికి రూ.52 లక్షల ప్యాకేజీ



ఆత్మకూరు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా ఆత్మకూరు పట్టణంలోని రామాలయం వీధికి చెందిన పురోహితుడు గరుడాద్రి వెంకటేశ్వర శర్మ, శ్రీవాణి దంపతుల కుమారుడు మైత్రేయశర్మ రూ.52 లక్షల ప్యాకేజీతో ఐటీ ఉద్యోగం సాధించి ఔరా అనిపించాడు. శర్మ 1 నుంచి 5వ తరగతి వరకు ఆత్మకూరులోని శ్రీసత్యవాణి విద్యా మందిరంలో, 6 నుంచి 10వ తరగతి వరకు నారాయణ విద్యా విహార్‌లో విద్యనభ్యసించాడు. తర్వాత విజయవాడలోని నారాయణ జూనియర్ కళాశాలలో ఎంపీసీలో 933 మార్కులతో రాణించాడు. కర్నూలులోని పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్(ఈసీఈ) పూర్తి చేశాడు. గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్ (గేట్) ద్వారా కాన్పూర్ ఐఐటీలో ఎంటెక్(వైర్‌లెస్ సిగ్నల్ ప్రాసెసింగ్ అండ్ కమ్యూనికేషన్) సీటు సాధించాడు. కోర్సు ఇంకా ఆరు నెలలు మిగిలి ఉండగానే క్వాంటమ్ ఇంటర్నేషనల్ కంపెనీ రూ.52 లక్షల వార్షిక ప్యాకేజీతో మైత్రేయ శర్మను ఉద్యోగిగా ఎంపిక చేసుకుంది.

టెండర్లలో

గూడుపుఠాణి!

- ఆరోగ్య శాఖలో ప్రహసనంలా మారిన ప్రక్రియ
- నచ్చిన సంస్థకు కట్టబెట్టడానికి అధికారుల పాట్లు
- పరికరాలు, మందుల కంపెనీలతో ముందే బేరాలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఆరోగ్య శాఖలో టెండర్ల ప్రక్రియ ప్రహసనంలా మారింది. ఆస్పత్రులకు అవసరమైన మందులు, వైద్య, సర్జికల్ పరికరాల కోసం పిలిచే టెండర్లలో కంపెనీల ప్రతినిధులతో కుమ్మక్కై ఏపీఎంఎస్ఐడీసీ (ఏపీ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) అధికారులు అక్రమాలకు పాల్పడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆస్పత్రులకు అవసరమైన మందులు, వైద్య పరికరాల కోసం ప్రభుత్వం ఏటా దాదాపు రూ.2 వేల కోట్ల వరకూ బడ్జెట్ కేటాయిస్తోంది. ఈ నిధులతో ఏపీఎంఎస్ఐడీసీ ద్వారా కొనుగోళ్లు చేపట్టాల్సి ఉంటుంది. దీనిలో భాగంగా కార్పొరేషన్ టెండర్లు పిలిచి ఎల్-1గా వచ్చిన కంపెనీల నుంచి కావాల్సిన మందులు, పరికరాలు సేకరించడం కొన్నేళ్ల నుంచి జరుగుతున్నదే. అయితే ఇప్పుడు ఈ టెండర్ల ప్రక్రియ పూర్తిగా దారితప్పింది. ఈ ఏడాది జూన్‌లో డీఎంఈ పరిధిలోని ఆస్పత్రులకు పీడియాట్రిక్ వెంటిలేటర్లు, సాధారణ వెంటిలేటర్లు, అనస్థీషియా వర్క్ స్టేషన్, ఓ.టి. లైట్లు కావాలని కార్పొరేషన్‌కు లేఖ రాశారు. దాదాపు రూ.20 కోట్లు విలువైన ఈ వస్తువుల కోసం కార్పొరేషన్‌లోని ఎక్విప్‌మెంట్ విభాగం టెండర్ పిలిచింది. టెండర్‌లో పాల్గొన్న కంపెనీలు తాము సరఫరా చేసే వస్తువులకు సంబంధించిన డెమోలు ఇచ్చాయి. ఇక ఎల్-1 కంపెనీని ఎంపిక చేసి, పర్చేజ్ ఆర్డర్లు ఇవ్వడమే మిగిలింది. ఇంతలోనే అకస్మాత్తుగా టెండర్లు రద్దు చేసిన ఎక్విప్‌మెంట్ విభాగం.. వెంటనే రీ-టెండర్లు పిలిచింది. తాము ముందుగా బేరాలు కుదుర్చుకున్న కంపెనీకి చెందిన పరికరాలు ఎంపిక కాకపోవడం వల్లనే టెండర్ రద్దు చేశారన్న విమర్శలొస్తున్నాయి.

బేరం కుదిరిన కంపెనీకే...

నిబంధనల ప్రకారం బలమైన కారణం ఉంటే తప్ప టెండర్లు రద్దు చేయడానికి వీల్లేదు. కానీ ఎక్విప్‌మెంట్ విభాగం అధికారులకు ఇవన్నీ పట్టవు. మరోవైపు మొదటిసారి టెండర్లు పిలిచినప్పుడు పీడియాట్రిక్ వెంటిలేటర్లు, సాధారణ వెంటిలేటర్లు, అనస్థీషియా వర్క్ స్టేషన్, ఓ.టి.లైట్లకు వేర్వేరుగా టెండర్లు పిలిచారు. ఇప్పుడు రీ-టెండర్లలో మాత్రం అన్నీ కలిపి ఒకే ప్యాకేజీ కింద పేర్కొన్నారు. తొలుత ఒక్కో పరికరానికి ఒక్కో కంపెనీ టెండర్‌లో పాల్గొనే అవకాశం ఉండేది. ఇప్పుడు మార్చిన నిబంధన ప్రకారం అన్ని పరికరాలు సరఫరా చేయగలిగిన కంపెనీ మాత్రమే టెండర్ వేసే వెసులుబాటు ఉంటుంది. ముందుగా బేరం కుదుర్చుకున్న కంపెనీకి అన్ని పరికరాలు సరఫరా చేసే ఆప్షన్ ఉండటంతో, దానికే టెండర్ కట్టబెట్టేందుకే ఎక్విప్‌మెంట్ విభాగం ఈ నిర్ణయం తీసుకుందని విమర్శలు వస్తున్నాయి.

స్థానిక టెండర్లలోనూ ఇష్టారాజ్యం

ఏపీఎంఎస్ఐడీసీ సరఫరా చేయని మందులు, సర్జికల్ పరికరాలను ఆస్పత్రుల సూపరింటెండెంట్లే కొనుగోలు చేసుకునే వెసులుబాటు ఉంది. వీటికోసం స్థానికంగానే టెండర్లు పిలుస్తారు. ఇటీవల కర్నూలు ఆస్పత్రి అధికారులు స్థానిక కొనుగోలుకు సీల్డ్ టెండర్లు ఆహ్వానించారు. టెండర్ నోటిఫికేషన్‌లో మందులు, సర్జికల్ వస్తువులు, ల్యాబ్ రీఏజెంట్స్ ఆర్థో, న్యూరో ఇంప్లాంట్స్, కార్డియాలజీ ఐటమ్స్ కొనుగోలుకు ప్రకటన ఇచ్చారు. టెండర్లలో పాల్గొనేందుకు 10రోజుల సమయం మాత్రమే ఇచ్చారు. పైగా టెండర్లలో పాల్గొనే ప్రతి కంపెనీ రూ.5లక్షలు డిపాజిట్ కట్టాలన్న నిబంధన విధించారు. రూ.కోట్ల విలువైన టెండర్లు ఆహ్వానించే ఏపీఎంఎస్ఐడీసీ కూడా కంపెనీలకు దాదాపు నెల రోజుల సమయం ఇస్తుంది. ఇక్కడ రూ.3 లక్షల డిపాజిట్ చెల్లిస్తే సరిపోతుంది. కర్నూలు అధికారులు మాత్రం రోజులను కుదించడంతో పాటు డిపాజిట్ భారీగా పెంచేశారు. పేపర్ ప్రకటన ఆధారంగా కర్నూలు వెళ్లిన ఆయా కంపెనీల ప్రతినిధులకు ఒక పెన్‌డ్రైవ్ ఇచ్చి, అందులో ఉన్న ప్రకారం బిడ్‌లు దాఖలు చేయాలని సూచించారు. తీరా ఆ పెన్‌డ్రైవ్ తెరిస్తే అందులో ఉన్న పత్రాల్లో కేవలం ఎన్టీఆర్ వైద్య సేవ నిధులకు సంబంధించిన పరికరాలు మాత్రమే సరఫరా చేసేందుకు బిడ్ దాఖలు చేయాలని పేర్కొన్నారు. వాటిపై సూపరింటెండెంట్ సంతకం కూడా లేకపోవడం విశేషం. పాదర్శకంగా నిర్వహించాల్సిన టెండర్ ప్రక్రియను ఇంత రహస్యంగా ఎందుకు చేస్తున్నారని విమర్శలొస్తున్నాయి. ఈ వ్యవహారంపై డీఎంఈ అధికారులు దృష్టి సారించాలని కంపెనీలు డిమాండ్ చేస్తున్నాయి.



ఇదేం.. 'ఎం'మాయ!

గిరిజన సంక్షేమ శాఖ ఈఎన్‌సీ అరాచకాలు

- ఏసీబీ దాడికి ముందు ఎంబుక్‌లో మార్పులు
- అధికారులను పిలిచి తప్పు చేయించిన ఈఎన్‌సీ
- లంచం ఇవ్వని కాంట్రాక్టర్లే లక్ష్యంగా మార్పులు
- 25 మంది ఇంజనీరింగ్ అధికారులకు నోటీసులు
- నేడు విచారించనున్న ఏసీబీ

(ఆంధ్రజ్యోతి - విజయవాడ)

ఆయన అడిగినంత చేతిలో పెడితే సరే సరి.. లేకపోతే కీలకమైన 'ఎంబుక్'లో అంకెలు మార్చేస్తారు. కొలతలకు కోతలు వేస్తారు. రికార్డులను మార్పించేస్తారు. ఇదీ.. గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ ఇన్ చీఫ్(ఈఎన్‌సీ) సబ్బవరపు శ్రీనివాసరావు వ్యవహారం. ఈఎన్‌సీ సీట్లో కూర్చుని ఆయన చేసిన అరాచకాలు తవ్వేకొద్దీ బయట పడుతున్నాయి. ఏసీబీకి చిక్కడానికి 2 నెలల ముందు శ్రీనివాసరావు రికార్డులను మార్చేసినట్టు అధికారులు గుర్తించారు. ముఖ్యంగా ఇంజనీరింగ్ విభాగంలో కీలకమైన ఎంబుక్‌లో భారీగా మార్పులు చేసినట్టు తెలిసింది. ప్రధానంగా తాను డిమాండ్ చేసిన మొత్తం ముట్టజెప్పని కాంట్రాక్టర్లకు సంబంధించిన ఎంబుక్‌లో బలవంతంగా మార్పులు చేశారని సమాచారం. ఈ మార్పులు చేసిన ఈఈ, డీఈ, ఏఈలను ఏసీబీ అధికారులు విచారణకు పిలిచారు. రాష్ట్రవ్యాప్తంగా 25 మంది ఇంజనీరింగ్ అధికారులకు నోటీసులు ఇచ్చారు. సోమవారం విచారణకు హాజరుకావాలని పేర్కొన్నారు.

మాయలు ఇలా..

ఏ ప్రభుత్వ శాఖలో అయినా ఇంజనీరింగ్ విభాగంలో ఎంబుక్ చాలా కీలకం. ఒక కాంట్రాక్టర్ చేసిన పనులకు ఇదే ప్రామాణికం. ఎంబుక్ సక్రమంగా ఉంటేనే బిల్లులు చేస్తారు. గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ విభాగంలో ఈఎన్‌సీగా వ్యవహరించిన శ్రీనివాసరావు సరిగ్గా ఈ ఎంబుక్‌లను టార్గెట్ చేసుకుని కాంట్రాక్టర్లను పీడించారని తెలుస్తోంది. గిరిజన ప్రాంతాల్లో చేపట్టే అభివృద్ధి పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్లకు అధికారులు 'వర్క్ ఆర్డర్' ఇస్తారు. ఆ తర్వాత కాంట్రాక్టర్లు పనులు మొదలుపెడతారు. భూమి పూజ జరిగినప్పటి నుంచి దశలవారీగా జరిగే పనుల వివరాలను కాంట్రాక్టర్లు ఎంబుక్‌లో నమోదు చేయించుకోవాలి. ఎంబుక్‌లో నమోదు చేసిన కొలతలు, వివరాల ప్రకారం పనులు పూర్తయి ఉండాలి. అప్పుడు మాత్రమే ఇంజనీరింగ్ అధికారులు వాటిపై సంతకాలు చేస్తారు. ఈఎన్‌సీ శ్రీనివాసరావు ఆగస్టు 8న ఒక కాంట్రాక్టర్ నుంచి రూ.5 కోట్ల లంచం డిమాండ్ చేశారు. దీనిలో భాగంగా రూ.25 లక్షలు తీసుకుంటూ ఏసీబీకి దొరికిపోయారు. ఈ ఘటన జరగడానికి 2 నెలల ముందు కాంట్రాక్టర్‌ను దారిలోకి తెచ్చుకునేందుకు ఆయన ఎంబుక్‌లను పూర్తిగా మార్చేసినట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఆ కాంట్రాక్టర్ ఎక్కడ పనులు చేశారో ఆ ప్రాంతానికి చెందిన ఇంజనీరింగ్ అధికారులను శ్రీనివాసరావు విజయవాడకు పిలిపించుకుని, వారితో ఎంబుక్‌ల్లో రాసిన కొలతలు, వివరాలను మార్పించినట్టు తెలిసింది.

కీలక విషయాలపై దర్యాప్తు

శ్రీనివాసరావు గత చరిత్రను అధ్యయనం చేసిన ఏసీబీ అధికారులు కీలక విషయాలపై లోతైన దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో వారికి ఎంబుక్‌ల వ్యవహారం కనిపించింది. ఈ కాంట్రాక్టర్‌నే కాకుండా ఇంకా మరికొంత మంది కాంట్రాక్టర్లను ఎంబుక్‌ల ద్వారా శ్రీనివాసరావు దారికి తెచ్చుకున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఈ నేపథ్యంలో మార్పులు చేసిన సదరు ఇంజనీరింగ్ అధికారులను ఏసీబీ అధికారులు విచారణకు పిలిచారు.

చెరగని ముద్ర.. ఆరుద్ర!

తెలుగు సాహిత్యంలో నవ్యత కోసం పరితపించిన నిత్య పరిశోధకుడు

- కవి, పండితుడు, గేయ రచయిత, మాటల మరాఠీగా గుర్తింపు
- తెలంగాణ పోరాట ఇతివృత్తంతో 'త్వమేవాహం'తో సాహితీ ప్రస్థానం
- వందలాది రచనలు, వేలాది సినీ గీతాలు, నవలలు రాసిన ప్రజ్ఞాశాలి
- ఆరుద్ర శతజయంతి సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం

(విశాఖపట్నం, చెన్నై- ఆంధ్రజ్యోతి)

తెలుగు సాహితీ రంగంలో ఆరుద్ర ముద్ర చెరిగిపోనిది. ఆంధ్ర సాహిత్యానికి ప్రాపంచిక దృష్టితో పాటు భౌతిక దృక్పథాన్ని పరిచయం చేసిన వ్యక్తిగా, అభ్యుదయ సాహిత్యంలో పరిచయం అవసరం లేని సాహితీ మూర్తుల్లో ఒకరిగా గుర్తింపు పొందారు. ఆయన చేయని ప్రయోగం లేదు, చేపట్టని ప్రక్రియ కానరాదు. హేతువాది అయిన ఆరుద్ర... కవి, పండితుడు, పరిశోధకుడు, గేయ రచయిత, మాటల మరాఠీ, సాహితీ పరిశోధకుడు, విమర్శకుడు, నాటక కర్త, నవలాకారుడు, ఇంద్రజాలికుడు, సంగీతం, నృత్యం, చదరంగ నిపుణుడు... వెరసి బహుముఖ ప్రజ్ఞాశాలి. నిజాం పాలనలో తెలంగాణలో రజాకార్ల దోపిడీ, మహిళలపై జరిగిన అరాచకాలపై రాసిన తొలి కావ్యం 'త్వమేవాహం' ఆయనకు ఎంతగానో పేరు తెచ్చింది. దీన్ని చదివిన శ్రీశ్రీ.. ఇక తాను పద్యాలు రాయకపోయినా ఫర్వాలేదని వ్యాఖ్యానించారంటే ఆరుద్ర రచనల్లో లోతు ఎంతటిదో అర్థమవుతుంది. శ్రీశ్రీ తరువాత అప్పటి యువతరంపై ఎక్కువ ప్రభావం చూపించిన కవిగా పేరుగాంచారు. ఆరుద్ర శతజయంతి సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

కలం పేరే అసలు పేరుగా... : ఆరుద్ర అసలు పేరు భాగవతుల సదాశివ శంకరశాస్త్రి. 1925 ఆగస్టు 31న విశాఖలో జన్మించారు. తల్లిదండ్రులు భాగవతుల వెంకట జోగమ్మ, నరసింగరావు. చదువుకొనే సమయంలో ఎర్రగా ఉన్న ఆయన్ను కొందరు స్నేహితులు ఆరుద్ర పురుగుతో పోల్చి పిలిచేవారు. తరువాత కాలంలో తన కలానికి ఆరుద్ర అని పేరు పెట్టుకుని రచనలు సాగించారు. అదే ఆయన అసలు పేరుగా నిలిచిపోయింది. క్విట్ ఇండియా ఉద్యమ సమయం లో చదువుకు స్వస్తి చెప్పిన ఆరుద్ర కొన్నాళ్ల పాటు రాయల్ ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ లో గుమస్తాగా పని చేశారు. ఆ తరువాత సంగీతంపై దృష్టి సారించిన ఆయన చెన్నై నుంచి వెలువడే వారపత్రిక ఆనందవాణిలో పని చే శారు. ఈ పత్రికకు సంపాదకుడి గా కూడా వ్యవహరించారు. అభ్యుదయ రచయితల సంఘం(అర సం) వ్యవస్థాపకుల్లో ఒకరైన ఆరు ద్ర ఆ సంస్థ అభివృద్ధికి విశేష కృషి చేశారు. 1949లో తొలిసారి రాసిన త్వమేవాహంతో ఆయన సాహితీ ప్రయాణం సుదీర్ఘకాలం పాటు సాగింది.

> 'ఆంధ్ర సాహిత్య వారధిని ఆంధ్రులు దాటగలిగేలా వారధి కట్టినవాడు ఆరుద్ర'
> - వీఏకే రంగారావు, ప్రముఖ సినీ సాహిత్య విమర్శకులు



శ్రీశ్రీ మేనల్లుడే ఆరుద్ర

ప్రముఖ సాహితీకారుడు శ్రీశ్రీ మేనల్లుడే ఆరుద్ర. అయినప్పటికీ తనదైన పంథాలో రచనలు సాగిస్తూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్నారు. ఆరుద్రను ఆంధ్ర విశ్వవిద్యాలయం 1985లో కళాప్రపూర్ణ బిరుదుతో సత్కరించింది. గురజాడ గురుపీఠం అనే వ్యాసానికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం అందుకున్నారు. రచనలతో పాటు పదునైన, వాక్పటిమతో ప్రసంగాలు చేయడంలో ఆరుద్ర దిట్ట. ఆరుద్ర భార్య రామలక్ష్మి కూడా రచయిత్రిగా మంచి పేరు సంపాదించుకున్నారు. వీరికి ముగ్గురు కుమార్తెలు.

సమగ్ర ఆంధ్ర సాహిత్యంతో గుర్తింపు

వందలాది గేయాలు, గేయ నాటికలు, కథలు, సాహిత్య పరిశోధక వ్యాసాలు, వ్యంగ్య వ్యాసాలు, పుస్తకాలకు పీఠికలు, పుస్తకాలపై విమర్శలు, సినీ గీతాలు రాశారు. సినీవాలి, కూనలమ్మ పదాలు, ఇంటింటి పద్యాలు వంటి కావ్యాలు, వెన్నెల-వేసవి, దక్షిణ వేదం, జైలు గీతాలు వంటి అనువాద రచనలు, రాదారి బంగళా, శ్రీకృష్ణదేవ రాయ, కాటమరాజు కథ వంటి అనేక రూపకాలు, నవలలు ఆయనకు మంచి పేరుతెచ్చాయి. సమగ్ర ఆంధ్ర సాహిత్యం(14 సంపుటాలు) ఆరుద్రకు సాహిత్య రంగంలో విశేషమైన గుర్తింపుతో పాటు గౌరవాన్ని తెచ్చింది. రెండు వేలకు పైగా సినీ గీతాలు రాసిన ఆయన ఇతర భాషల సినిమాలకు డబ్బింగ్ చెప్పడంతో పాటు మాటలు, కథలు రాశారు. 8 డిటెక్టివ్ నవలలు రాయగా, 'పలకల వెండిగ్లాస్' బహుళ ప్రాచుర్యం పొందింది. చెస్‌ను ఇష్టపడే ఆరుద్ర చదరంగం పేరుతో పుస్తకాన్ని రాశారు. ఇంద్రజాలికుడు కూడా అయిన ఆరుద్ర.. మహేంద్రజాలం పేరుతో పుస్తకాన్ని రాశారు. ఆరుద్ర మార్క్సిజం, కమ్యూనిజం సిద్ధాంతాలను బలంగా విశ్వసించారు. సిద్ధాంత రీత్యా నాస్తికుడు అయినప్పటికీ అనేక ఆధ్యాత్మిక పాటలు కూడా రాశారు. కవిత్వం, పరిశోధనా రెండింటినీ వినియోగిస్తూ కవి పరిశోధకుడిగా నవ్యత కోసం పరితపించిన నిత్య పరిశోధకుడిగా పేరుగాంచారు.

పేరు తెచ్చిన రచనలు ఎన్నో..

ఆరుద్రకు పేరుతెచ్చిన రచనలు ఎన్నో ఉన్నాయి. తెలుగు సాహిత్య చరిత్రను తెలియజేసేలా రాసిన సమగ్రాంధ్రసాహిత్యం ఆరుద్ర ప్రతిభను తెలియజేసింది. అహింసా రౌడీ, రెండురెళ్ల ఆరు, దెయ్యాల కొంప వంటి డిటెక్టివ్ నవలలు, రాముడికి సీత ఏమవుతుంది వంటి పుస్తకాలు ఆయన్ను ఉన్నత స్థాయికి తీసుకెళ్లాయి.

జర్నలిస్టు అవుదామని వచ్చి..!

ఆరుద్రకు మొదట్లో సినీ పరిశ్రమపై అంతగా ఆసక్తి ఉండేది కాదు. జర్నలిస్టు అవుదామని 1946లో మద్రాస్ చేరిన ఆయన.. బతుకుతెరువు కోసం మొదట్లో 'ఢంకా' పత్రికలో ప్రూఫ్ రీడర్‌గా పనిచేసేవారు. అక్కడ రోజంతా పనిచేయగా వచ్చిన ఒక్క రూపాయిని ఆంగ్ల సినిమాలు చూసేందుకు ఖర్చు చేసేవారు. ఆ విధంగా ఏర్పడిన అవగాహనతో ఆయన సినిమాలపై విమర్శనా వ్యాసాలు రాయడం మొదలుపెట్టారు. ఆ సమయంలో పరిచయమైన న్యాపతి నారాయణమూర్తి.. రాజరాజేశ్వరీ ఫిలిం కంపెనీ వారికి ఆరుద్రను పరిచయం చేశారు. అప్పుడే ఆ సంస్థ తీసిన 'సౌదామని' చిత్ర స్టోరీ డిపార్ట్‌మెంట్‌లో పని చేశారు. అనంతరం ఆ చిత్ర సెట్‌లోనూ పనిచేసి, మన్ననలు పొందారు. కేవీ నాగభూషణం కంపెనీలో చేరి, ప్రప్రథమంగా 'పరోపకారం' అనే చిత్రానికి మాటలు అందించారు. అది మొదలు ఆరుద్ర వెనుదిరిగి చూడలేదు. మద్రాస్ వచ్చాకే సినీ, సాహితీలోకంలో ఆరుద్ర వెలుగు ప్రారంభమైంది. శ్రీశ్రీతో కలిసి తెలుగు డబ్బింగ్ సినిమాలకు మాటలు, పాటలు రాశారు. ద్రావిడ భాషలన్నింటినీ ఆయన స్పృశించారు. ఆంగ్లం, హిందీ, సంస్కృతం, ఫ్రెంచి భాషలపైనా ఆయనకు మంచి పట్టుంది. తమిళులు పవిత్రంగా భావించే 'తిరుక్కురళ్'ను 'దక్షిణ వేదం'గా, జయంకొండాన్ రాసిన 'కళింగత్తుపరణి' శృంగార కావ్యాన్ని 'వెన్నెల వేసవి'గా తెలుగులోకి అనువదించి తమిళుల హృదయాల్లోనూ స్థానం పొందారు. 80వ దశకంలో సినీ పరిశ్రమ అంతా తరలిపోయినా, ఆరుద్ర మాత్రం ఇక్కడే ఉండిపోయారు. మద్రాస్ నగరం ఒడిలోనే 1998, జూన్ 4న తుదిశ్వాస విడిచారు.

హోం మంత్రినవుతా

- పోలీసు విచారణలో కి'లేడీ' షాక్
- వైసీపీ ప్రభుత్వంలో అరుణకు తెల్లరేషన్ కార్డు
- మళ్లీ కస్టడీకి తీసుకుని ప్రశ్నించే అవకాశం

అమరావతి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): 'ఆమె మాటలతోనే మాయ చేస్తుంది. నెట్‌వర్క్ పెంచుకునేందుకు ఎన్ని దారుల్లో అయినా వెళ్తుంది. తెల్లరేషన్ కార్డుదారు అయి ఉండీ ముప్పై లక్షల ఖరీదు చేసే కారులో తిరుగుతుంది. ఎలాంటి ఆదాయం లేకున్నా అత్యంత సంపన్న వర్గాల వారిలా జీవిస్తుంది. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే అవుతా.. రాష్ట్రానికి హోంశాఖ మంత్రిని అవుతా.. మీకు పోస్టింగ్‌లలో సాయం చేస్తా అంటోంది. ఆమెకు మతి భ్రమించిందా.. ఏంటాని నవ్వుకున్నాం' అని లేడీ డాన్ నిడిగుంట అరుణను విచారించిన ఓ పోలీసు అధికారి తన సహచరులతో ఈ వివరాలు పంచుకున్నారు. అరుణకు ఆదాయ మార్గాలేంటని నెల్లూరు జిల్లా పోలీసులు మూడు రోజుల కస్టడీలో ప్రశ్నించారు. మొదటి రెండు రోజుల పాటు పొంతనలేని సమాధానాలు చెప్పిన ఆమె మూడో రోజు కాస్త నోరు విప్పింది. అత్యంత సామాన్య కుటుంబంలో జన్మించిన ఆమెకు ప్రభుత్వంలో అత్యంత కీలక స్థానాల్లో ఉన్న వ్యక్తుల వద్ద పైరవీలు చేసే స్థాయి ఎలా వచ్చిందని పోలీసులు ప్రశ్నించారు. తాను సామాన్యురాలినని, తనకున్న తెల్లరేషన్ కార్డు ఇందుకు నిదర్శనమని, ఒక పేపర్ వాళ్లు తనపై వార్తలు రాసి లేడీ డాన్‌ను చేశారని చెప్పింది. వీఆర్‌వోను పోలీసులు సంప్రదించగా.. ఆమెకు 2024వరకూ గత ప్రభుత్వంలో తెల్లరేషన్‌కార్డు ఉన్నమాట వాస్తవమేనని చెప్పారు. ప్రభుత్వం మారిన తర్వాత కార్డు రద్దయిందని చెప్పారు. నాలుగు కార్లు ఎలా వచ్చాయని అరుణను పోలీసు అధికారులు ప్రశ్నించగా.. తన పేరుతో ఏవీ లేవని, మరొకరి పేరుతో ఉన్నాయని చెప్పింది. 'పేరు ఎవరిదైనా వాడుతున్నది నువ్వేగా'.. అని పోలీసులు ప్రశ్నించారు. తనకు ఎలాంటి ఆదాయం లేదని, చెల్లెలు ఒక ఇంజనీరింగ్ కాలేజీలో ఏవోగా పనిచేస్తూ నెలకు లక్షన్నర జీతం తీసుకుంటుందని, కొంత తనకు ఇస్తుందని ఆమె చెప్పింది. అయితే ఇవన్నీ పోలీసు విచారణలో అబద్ధాలుగా తేలాయి. కారు ఈఎంఐలతో పాటు తిరగడానికి డీజిల్, డ్రైవరు జీతం ఇతరత్రా ఖర్చులు ఎలా భరిస్తున్నావని ప్రశ్నించారు. పెద్దవాళ్లు తనకు సాయం చేసేవారని చెప్పిన అరుణ.. ఆ పెద్దలు ఎవరో వెల్లడించలేదు. అబలలకు అండగా నిలిచేందుకు తానే దిశ ఫౌండేషన్ స్థాపించానని, మహిళలకు ఎక్కడ అన్యాయం జరిగినా ప్రభుత్వంలోని పెద్దల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే క్రమంలో పలువురు పరిచయమయ్యారని చెప్పింది. ప్రజలకు సేవ చేసి గూడూరు నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచి రాష్ట్రానికి హోం మంత్రిని అవ్వాలని ప్రణాళిక సిద్ధం చేసుకుంటే, పేపర్ వాళ్లు తన జీవితాన్ని రోడ్డుకు లాగారని వెల్లడించింది. 'ఏపీలో టీడీపీ లేదా వైసీపీ అధికారంలోకి వస్తాయి. ఆ రెండు పార్టీలు ఎస్సీ మహిళకే హోంశాఖ మంత్రి పదవి ఇస్తాయి. నా కన్నా బాగా మాట్లాడేవారు ప్రస్తుతం ఆ రెండు పార్టీల్లో లేరు. శ్రీకాంత్‌కు రెమిషన్(అక్టోబరు 2న) తెచ్చుకోవడానికి అంతా సిద్ధం చేసుకున్నా. అతను బయటికి వచ్చుంటే పెళ్లి చేసుకుని ఎక్కడికైనా వెళ్లి బతకాలనే ఆలోచన ఉండేది' అని అరుణ చెప్పింది. కొన్నాళ్ల పాటు ఎటైనా వెళ్లిపోయి ఎన్నికలకు ముందు గూడూరులో మకాం వేయాలని అనుకున్నట్లు వివరించింది.



సోషల్ మీడియా ద్వారానే..

తనకు సోషల్ మీడియా ద్వారానే ఎక్కువ మంది పరిచయమయ్యారని, తాను అందంగా ఉన్నందున రీల్స్ చేసి ఫేస్‌బుక్, ఇన్‌స్టాలో పోస్టు చేసేదాన్నని అరుణ చెప్పింది. పలువురు లైక్‌లు కొట్టి ఫ్రెండ్ రిక్వెస్ట్ పెట్టేవారని, ప్రముఖుల్ని కలిసిన ఫొటోలు పోస్టు చేయడంతో ఇంకా కొంతమంది ఫ్రెండ్స్ అయ్యారని వెల్లడించింది. నెల్లూరులో గత కొంతకాలంగా జరిగిన వరుస హత్యల గురించి ప్రస్తావించగా.. తనకు ఏమీ తెలియదని చెప్పింది. ఆమె ఫోన్లో ట్రాన్స్‌జెండర్ హత్యకు సంబంధించిన వివరాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఫోన్‌లో సమాచారం విశ్లేషించిన తర్వాతమరోమారు లేడీ డాన్‌ను కస్టడీకి తీసుకుని పోలీసులు ప్రశ్నించే అవకాశముంది. మూడు రోజుల కస్టడీలో అనుకున్నంత సమాచారం రాలేదని తెలుస్తోంది. ఆమెతో ఫొటోలు దిగిన వ్యక్తులు, ఆర్థిక లావాదేవీలు జరిపినవారు, తరచూ ఫోన్లలో మాట్లాడినవారి వివరాలను.. డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా తిరుపతి వెళ్తూ నెల్లూరు పోలీసులను ఆరా తీశారు.

'సమాచారం' ఇవ్వం..!


- దేవదాయ శాఖలో అధికారుల వింత ప్రవర్తన
- ఆర్టీఐ దరఖాస్తులకు కనీస స్పందన కరువు

అమరావతి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):దేవదాయ శాఖలో ఆర్టీఐ (సమాచార హక్కు) విభాగాన్ని ప్రక్షాళన చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది..! కమిషనరేట్‌లో ఆర్టీఐ దరఖాస్తుదారులకు చిన్న సమాచారం ఇవ్వడానికి కూడా అధికారులు ఇష్టపడడం లేదు. దీంతో ప్రతి కేసు విషయంలోనూ ఆర్టీఐ కమిషనర్ (రెండో అప్పీలేట్ అథారిటీ) వద్దకు వెళ్లాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఇటీవల ఒక వ్యక్తి దేవదాయ శాఖలో పదోన్నతులకు సంబంధించిన రోస్టర్ రిజిస్ట్రర్, క్యాడర్ స్ట్రెంత్ సమాచారం కోరారు. అధికారులు స్పందించకపోవడంతో రెండో అప్పీలేట్ అథారిటీని ఆశ్రయించారు. ఈ సందర్భంగా జరిగిన విచారణలో దేవదాయ శాఖ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ అధికారి (పీఐవో) చెప్పిన సమాధానంతో కమిషనర్ షాక్ అయ్యారు. ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగం వారిని ఎన్నిసార్లు అడిగినా సమాచారమివ్వడం లేదని ఆ అధికారి తన గోడు వెళ్లబోసుకున్నారు. దీంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన కమిషనర్.. తదుపరి విచారణకు ఎస్టాబ్లిష్‌మెంట్ అధికారులను తీసుకురావాలని ఆదేశించారు. దేవదాయ శాఖలో ప్రతి విభాగం అధికారులు నిత్యం ఆర్టీఐ విచారణలకు హాజరుకావడం పరిపాటిగా మారింది. శాఖలో పదోన్నతులు, పోస్టింగ్స్‌లో నిబంధనలు పాటించడం లేదు. ఈ విషయాలు బయటకొస్తే సమస్యలు వస్తాయనే కొన్ని విభాగాల అధికారులు ఫైల్స్ బయటకు రానివ్వకుండా జాగ్రత్త పడుతున్నారన్న ఆరోపణలున్నాయి.



తొలిసారి సీఎంగా చంద్రబాబుతో ప్రమాణం చేయిస్తున్న గవర్నర్ కృష్ణకాంత్ (ఫైల్)

నారా చంద్రబాబునాయుడు అనే నేను..!



తొలిసారి ముఖ్యమంత్రి అయి నేటికి 30 ఏళ్లు



'ప్రజల వద్దకు పాలన'కు అమితాదరణ

'జన్మభూమి'తో పల్లెల్లో వెలుగులు

పేదరికం లేని సమాజ స్థాపనకు విజన్-2020కి రూపకల్పన

చంద్రబాబు తొలిసారి సీఎం పగ్గాలు చేపట్టి సోమవారానికి సరిగ్గా 30 ఏళ్లవుతుంది. పార్టీనే ప్రాణంగా నమ్ముకుని సాగుతున్న ప్రస్థానానికి ఒక్కసారిగా విఘాతం కలిగితే.. పార్టీని రక్షించుకునే దిశగా చేసిన పోరాట ఫలితంగానే ఆయనకీ పీఠం దక్కింది. సానుకూల దృక్పథం ఉన్నవారెవరూ విఫలమైనట్లు చరిత్రలో లేదు. చంద్రబాబుకు ఉన్న మంచి లక్షణాల్లో సానుకూల దృక్పథం ఒకటి. అదే ఆయనకు 1999 ఎన్నికల్లో విజయం చేకూర్చిపెట్టింది. అసలైన ఎన్టీఆర్ వారసులెవరో ప్రజలు తమ ఓటుతో తేల్చిచెప్పిన ఎన్నికలవి. ఆ ఎన్నికల్లో చంద్రబాబు 44.14 శాతం ఓట్లతో 181 సీట్లను కైవసం చేసుకుని ఉమ్మడి రాష్ట్ర సీఎంగా రెండోసారి ప్రమాణ స్వీకారం చేశారు. తర్వాత 2004, 09ల్లో వరుస ఓటముల తర్వాత 2014లో విభజిత ఆంధ్రప్రదేశ్‌కు తొలి సీఎంగా.. మొత్తంగా మూడోసారి ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టారు. ఆ తర్వాత 2019లో ఓటమి పాలై జగన్ ఐదేళ్ల ఏలుబడిలో ఎన్నో అవమానాల పాలైనా అన్నిటినీ అధిగమించి తిరిగి 2024లో నాలుగోసారి సీఎంగా బాధ్యతలు చేపట్టారు.

గతంలో ముఖ్యమంత్రులుగా చేసినవారిది ఒక తీరయితే.. చంద్రబాబుది మరో తీరు. ఆయన పరిపాలన మిగిలినవారికంటే భిన్నం. తొలిసారి సీఎం అయ్యాక ఎన్నో విప్లవాత్మక పాలనా సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. అప్పటి వరకు కార్యాలయాలకే పరిమితమైన అధికారులను ప్రజల వద్దకు పంపి.. వారి సమస్యలను తెలుసుకోవడం, వివిధ పథకాల కింద లబ్ధిదారులను గుర్తించడం కోసం చేపట్టిన 'ప్రజల వద్దకు పాలన' విశేష జనాదరణ పొందింది. ప్రతి ఒక్కరూ జన్మభూమి రుణం తీర్చుకోవాలనే ఉద్దేశంతో 1997 జనవరి 1న ఆయన ప్రవేశపెట్టిన 'జన్మభూమి' కార్యక్రమం ఎన్నో పల్లెల్లో వెలుగులు తీసుకొచ్చింది. ప్రవాసాంధ్రులను సైతం కదలించి జన్మభూమివైపు చూసేలా చేసింది. పేదరికం లేని సమాజ స్థాపన దిశగా విజన్-2020కి రూపకల్పన చేశారు. జలసంరక్షణ కోసం నీరు-మీరు ప్రారంభించారు. చెట్ల పెంపకాన్ని పెంచేందుకు పచ్చదనం- పరిశుభ్రత కార్యక్రమాన్ని తీసుకొచ్చారు. ప్రభుత్వ వ్యవస్థలను సరళీకృతం చేయడం, పాలనలో పారదర్శకత తీసుకొచ్చేందుకు ఈ-గవర్నెన్స్(సుపరిపాలన) తీసుకురావడం కీలకం. 1997 ఏప్రిల్లో 'ప్రజలతో ముఖ్యమంత్రి' పేరుతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. దూరదర్శన్ ద్వారా ప్రతి సోమవారం నేరుగా జనంతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకునేవారు. పరిష్కరించేవారు. తొలి విడత పాలనలో చంద్రబాబు సీఎంగా కాక ఆంధ్రప్రదేశ్ సీఈవోగా పేరుపొందడం విశేషం.

మహిళల కోసం డ్వాక్రా.. పేదల కోసం వెలుగు



ప్రభుత్వాలు ఎన్ని పథకాలను ప్రవేశపెట్టినా వాటి ద్వారా సమాజంలో అందరినీ ఆర్థికంగా ఆదుకోవడం అసాధ్యం. స్వయంపోషకత్వమే దానికి పరిష్కారం. ఈ ఆలోచనతోనే చంద్రబాబు 'డెవలప్‌మెంట్ ఆఫ్ ఉమెన్ అండ్ చిల్డ్రన్ ఇన్ రూరల్ ఏరియాస్ (డ్వాక్రా)' పేరుతో మహిళా స్వయంసహాయక సంఘాలను ప్రవేశపెట్టారు. ఇవి అత్యుత్తమ ఫలితాలను ఇచ్చాయి.. నేటికీ ఇస్తూనే ఉన్నాయి. పేదరిక నిర్మూలన కోసం చేపట్టిన కార్యక్రమాల్లో మంచి ఫలితాలు ఇచ్చిన పథకాల్లో 'వెలుగు' మరొకటి. ఈ పథకం వల్ల చంద్రబాబు తొలిదశ పాలనలో గ్రామీణ పేదరిక నిష్పత్తి జాతీయ స్థాయి కన్నా.. అనేక రాష్ట్రాల కన్నా.. ఏపీలో చాలా తక్కువగా నమోదైంది.

ప్రతికూలతలను అధిగమించి సుపరిపాలన..

చంద్రబాబు 1999లో రెండోసారి ముఖ్యమంత్రి అయిన తర్వాత వరుసగా మూడేళ్లు రాష్ట్రాన్ని కరువు వెంటాడింది. మరోవైపు విద్యుత్ సంస్కరణల కారణంగా కరెంటు చార్జీల పెంపుతో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు వెల్లువెత్తాయి. ఈ ప్రతికూలతల నడుమే సుపరిపాలన దిశగా చంద్రబాబు అడుగులు వేశారు. గతంలో ఎవరూ చేయని విధంగా రైతుల శ్రమకు తగిన గుర్తింపు తేవడానికి ప్రయత్నించిన తొలి ముఖ్యమంత్రి చంద్రబాబు. ఆ ప్రయత్న ఫలితమే రైతు బజార్లు. దళారుల ప్రమేయానికి అడ్డుకట్ట వేసి.. రైతులు తాము పండించిన కూరగాయలను ప్రజలకు నేరుగా విక్రయించేందుకు వీటిని ఏర్పాటు చేశారు. ఈ ఆలోచన, అమలు విజయవంతమయ్యాయి. ఇప్పటికీ రైతు బజార్లు అటు రైతులకు.. ఇటు ప్రజలకు సేవలందిస్తూనే ఉన్నాయి. సంక్షేమ పథకాల విషయంలో చంద్రబాబు తీసుకున్న నిర్ణయాల్లో హైలెట్ కోటి వరాల ప్రకటన. 2003లో తిరుపతి మహానాడులో ఈ ప్రకటన చేసి అమలుకు శ్రీకారం చుట్టారు. బలహీన వర్గాలకు ఇళ్లు, ఇళ్లపట్టాలు, రేషన్ కార్డులు, దీపం పథకం కింద గ్యాస్ కనెక్షన్లు, మైనారిటీలకు దుకాన్ ఔర్ మకాన్, సౌకర్యం పథకం కింద గ్రామీణ పేద ఆడపిల్లలకు సైకిళ్లు వంటి ఎన్నో వరాలు ఇందులో ఉన్నాయి. అయినా 2004, 2009 ఎన్నికల్లో వరుస పరాజయాలే చంద్రబాబుకి దక్కాయి.

ముచ్చటగా మూడోసారి..

2014లో ముచ్చటగా మూడోసారి చంద్రబాబు సీఎం అయ్యారు. అయితే ఈసారి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కాదు. విభజిత ఆంధ్రప్రదేశ్‌కు. రాజధాని లేని రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఆయన తొలి ప్రాధాన్యం.. దేశంలో ఏ రాష్ట్రానికీ లేని విధంగా రాజధాని నిర్మాణం చేయడం. ఆ ఆలోచన నుంచి రూపుదిద్దుకున్నదే అమరావతి. రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసేందుకు పోలవరం ప్రాజెక్టును పట్టాలెక్కించారు. సముద్రంలోకి వృథాగా పోయే నీటిని ఒడిసిపట్టేందుకు నదుల అనుసంధానానికి శ్రీకారం చుట్టారు. గోదావరి జలాలను కృష్ణా నదిలోకి ఎత్తిపోసేందుకు ప్రారంభించిన పట్టిసీమ ప్రాజెక్టును శంకుస్థాపన చేసిన ఆరు నెలల్లోనే అందుబాటులోకి తెచ్చారు. ఇన్ని చేసినా 2019 ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో వ్యక్తిగతంగా ఆయనకు ఎన్నో నిర్బంధాలు.. అవమానాలు. అన్నింటినీ తట్టుకుని నిలబడి రాజకీయ వ్యూహంతో, చాతుర్యంతో జనసేన, బీజేపీలను కలుపుకొని 2024 ఎన్నికల్లో అఖండ ప్రజాదరణతో నాలుగోసారి సీఎం బాధ్యతలు చేపట్టారు. ఈసారి వైసీపీ పాలనలో విధ్వంసమైన రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేసే బాధ్యతను తలకెత్తుకుని ముందుకు సాగుతున్నారు. ఇంకోవైపు.. పెద్దఎత్తున సంక్షేమమూ అమలు చేస్తున్నారు.

5,442 రోజులు సీఎంగా

1995 సెప్టెంబరు 1న చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఇది జరిగి సోమవారానికి 30 ఏళ్లు పూర్తవుతుంది. ఆయన ఇప్పటికి 5,442 రోజుల పాటు సీఎంగా పనిచేసి నేడు 5,443వ రోజుకు అడుగుపెడుతున్నారు.

1995.. బెంచ్ మార్క్ పాలన

చంద్రబాబు తొలిసారి సీఎం అయ్యేనాటికి ఆయన వయసు 45 ఏళ్లు. తెలుగు నేలపై అతిపిన్న వయసులో ముఖ్యమంత్రి అయిన రెండో వ్యక్తిగా పేరుగాంచారు. ఆ సమయంలో ఆయన తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలు వ్యక్తిగతంగా ప్రత్యేక గుర్తింపు తెచ్చాయి. ఓ వైపు పార్టీని పటిష్ఠం చేసుకుంటూనే పాలనపై పట్టుబిగించి ప్రభుత్వాన్ని నడిపించారు. ఇప్పటికీ పలు సమావేశాల్లో ఆయనే స్వయంగా '95 సీఎం'ను చూస్తారని చెబుతుంటారు. కానీ మూడు విడతలతో పోలిస్తే ఈసారి తనదైన మార్కును చూపించలేకపోతున్నారన్న విమర్శలూ ఉన్నాయి. అటు పార్టీపై గానీ, ఇటు ప్రభుత్వంపై గానీ పూర్తిస్థాయిలో పట్టు సాధించడంలో విఫలమవుతున్నారన్న వ్యాఖ్యలు తరచూ వినవస్తున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు అంతర్జాతీయ ప్రశస్తి తెచ్చిన చంద్రబాబు.. విభజిత ఆంధ్రప్రదేశ్‌కూ అదే గౌరవాన్ని తీసుకొస్తారన్న ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా మరోసారి 95నాటి సీఎంగా తనదైన ముద్రతో అటు పార్టీని, ఇటు ప్రభుత్వాన్ని గాడినపెడతారని టీడీపీ శ్రేణులు.. రాష్ట్ర ప్రజలు ఎదురుచూస్తున్నారు.

హైదరాబాద్ దిశను మార్చేసిన హైటెక్ సిటీ



చంద్రబాబు విజన్‌కు నిదర్శనం హైటెక్ సిటీ(హైదరాబాద్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ ఇంజనీరింగ్ కన్సల్టెన్సీ- హెచ్ఐటీఈసీ). ఆయన తొలిసారి ముఖ్యమంత్రి అయినప్పుడే హైటెక్ సిటీ నిర్మాణానికి బీజం పడింది. కొండలు, గుట్టలతో నిండి ఉన్న ప్రాంతంలో కేవలం 14 నెలల్లో దాని నిర్మాణం పూర్తి చేసి.. 1998 నవంబరు 22న నాటి ప్రధాని వాజపేయితో ప్రారంభింపజేశారు. బిల్ గేట్స్‌ను ఒప్పించి మెప్పించి మైక్రోసాఫ్ట్‌ను భాగ్యనగరానికి తీసుకొచ్చారు.

విడత	సంవత్సరం	కాలం	రోజుల్లో
మొదటిసారి, రెండో సారి	1995 సెప్టెంబరు1-2004 మే 29	8 ఏళ్ల 8 నెలల 13 రోజులు	3,178
మూడోసారి	2014 జూన్ 8-2019 మే 29	4 ఏళ్ల 11 నెలల 22 రోజులు	1,817
ప్రస్తుతం	2024-జూన్ 12- ఇప్పటివరకూ	సంవత్సరం 2 నెలల 21 రోజులు	447
మొత్తం		14 సంవత్సరాల 11 నెలలు	5,442

విలక్షణ రాజకీయం!



చంద్రబాబు జీవితంలో ఎన్నో మలుపులు.. మరెన్నో మజిలీలు

- సంక్షోభాల నుంచి ప్రపంచ స్థాయికి ఎదిగిన వైనం
- పాతాళానికి పడినా.. తర్వాత ఆకాశమే హద్దుగా ఎదిగే తత్వం

ఎవరైనా రాజకీయాల్లో గెలుస్తుంటారు.. ఓడిపోతుంటారు. మళ్లీ ప్రజాదరణ పొంది అధికార పీఠం అధిష్ఠిస్తారు. అయితే చంద్రబాబు అలా కాదు. సంక్షోభాల నుంచి ప్రపంచ స్థాయికి వెళ్లడం.. ఓటమితో చతికిలబడడం.. ఆ తర్వాత ఆకాశమే హద్దుగా ఎదగడం ఆయన రాజకీయ శైలి. ఆయనది ఆది నుంచీ విలక్షణమైన రాజకీయ జీవితం. మలుపులు.. మజిలీలు ఎన్నెన్నో ఉన్నాయి. అతి సాధారణ కుటుంబంలో జన్మించి.. విద్యార్థి దశలోనే గెలుపోటములు ఒంటబట్టించుకున్నారు. 1978లో తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికై.. అంజయ్య హయాంలో మంత్రివర్గంలో చేరారు. టీడీపీలోకి వచ్చాక చాలాకాలం మంత్రి కావాలన్న ఆలోచనే చేయలేదు. 1983లో ఎన్టీఆర్ మొదటిసారి సీఎం అయ్యాక చంద్రబాబు టీడీపీలోకి వచ్చారు. 1984 ఆగస్టు సంక్షోభంలో తాను మామ చాటు అల్లుడిని కాదని.. నాయకత్వ పటిమ పదునుగా ఉందని నిరూపించుకున్నారు. 1985లో మళ్లీ ఎన్టీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక.. అవకాశమున్నా.. ఎమ్మెల్యే, మంత్రి పదవుల జోలికి వెళ్లలేదు. కానీ రాష్ట్ర గతినే ఒక మలుపుతిప్పిన కర్షక పరిషత్ చైర్మన్‌గా దాదాపు ముఖ్యమంత్రికి ఉన్నంత అధికారాన్ని ఆయనకు కట్టబెట్టారు. దీంతో 1989లో టీడీపీ ఓడిపోయిన తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు ఈయనే టార్గెట్ అయ్యారు. ఎన్ని రకాలుగా వేధించాలో.. ఎన్ని విధాలుగా మానసిక క్షోభ కలిగించాలో అన్నీ చేశారు. 1994లో టీడీపీ అప్రతిహత విజయంతో మళ్లీ అధికారంలోకి వచ్చాక.. 1995 సెప్టెంబరు వరకు ఆయన కల్లోల దశనే ఎదుర్కొన్నారు. పేరుకు మంత్రిగా ఉన్నప్పటికీ లక్ష్మీపార్వతి ప్రభావం పడింది. అప్పుడే సరికొత్త రాజకీయ సంక్షోభం నుంచి ఆయన వినూత్న నాయకుడిగా రూపాంతరం చెందారు. అదే.. 1995 సెప్టెంబరు 1న ఆయన ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయడం..! ఎవరైనా ముఖ్యమంత్రి అయితే మహా ఆనందపడిపోతారు. ఆయన మాత్రం తీవ్ర విమర్శలు ఎదుర్కోవలసి వచ్చింది. ఎన్టీఆర్ నుంచి అధికారం లాగేసుకున్నారన్న అపఖ్యాతి చుట్టుముట్టింది.

పడిపడి లేచిన బాబు..

పడి.. లేవడం చంద్రబాబు నైజం. నాలుగు సార్లు సీఎంగా పనిచేసిన ఆయన.. ప్రతిపక్ష నేతగానూ సుదీర్ఘకాలం పనిచేశారు. 2004, 09ల్లో వరుస పరాజయాలతో పదేళ్లు ప్రతిపక్షంలోనే కూర్చున్నారు. 2014లో కొత్త రాష్ట్రాన్ని నిలబెట్టేందుకు అనుభవజ్ఞుడు కావాలని జనం ఆశించి ఆయనకే పట్టం కట్టారు. మళ్లీ 2019లో ఓడిపోయి ఐదేళ్లు ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నారు. అయితే ఈ ఐదేళ్లలో ఆయన రాజకీయ నాయకత్వానికే సవాల్ ఎదురయ్యే అనుభవాలు ఎదురయ్యాయి. ప్రజల్లోకి వెళ్లకుండా నాటి సీఎం జగన్ ఆయన్ను కట్టడి చేశారు. ఇంట్లో నుంచి బయటకే రానివ్వలేదు. ఆయన సహచరులను తప్పుడు కేసుల్లో ఇరికించి జైళ్లకు పంపారు. చివరకు చంద్రబాబును సైతం అక్రమ కేసులో ఇరికించి.. అక్రమంగా అరెస్టు చేసి జైలు పాల్జేశారు. అదే జగన్‌కు అశనిపాతమైంది. 30 ఏళ్లు రాష్ట్రాన్ని ఏకచత్రాధిపత్యంతో ఏలతానని కలలుగన్న జగన్‌కు జనం కర్రుగాల్చి వాతపెట్టారు. కనీసం ప్రతిపక్ష నేత హోదా లేకుండా చేశారు. చంద్రబాబును మళ్లీ సీఎం కుర్చీలో కూర్చోబెట్టారు. ఇలా ఎన్ని సార్లు ఆయన కింద పడినా.. మళ్లీ జనం అండతో పైకి లేస్తూనే ఉన్నారు.

కానీ 1999 ఎన్నికల్లో ప్రజలు చంద్రబాబుకు జైకొట్టడంతో విమర్శకుల నోళ్లు మూతపడ్డాయి.

ఊహకు అందని ఆలోచనలు..

1995లో ముఖ్యమంత్రి అయిన తర్వాత టెక్నాలజీ వైపు చూసిన చంద్రబాబు 1999 తర్వాత దానిని కొత్త పుంతలు తొక్కించారు. ప్రపంచస్థాయి నేతలతో పరిచయాలు పెంచుకోవడం, ఆ పరిచయాలను రాష్ట్రం కోసం ఉపయోగించడం ద్వారా.... ఎవరు అవునన్నా...కాదన్నా చంద్రబాబు ఈ విషయంలో గ్రేట్ అని చంద్రబాబు బద్ధ విరోధులు సైతం ప్రశంసించేలా చేసుకోగలిగారు. అందరూ ఒక దిశలో ఆలోచిస్తే.. ఆయన అందుకు భిన్నకోణంలో ఆలోచించి.. ఊహకు అందనంత దూరంలో ప్రణాళికలు రూపొందించేవారు. అందులో కొన్ని ప్రజలకు సరైన రీతిలో దక్కకపోవడంతో 2004లో ఓటమి పాలయ్యారు. వరుసగా పదేళ్లు అధికారం కోల్పోయినా.. ఎక్కడా నిరుత్సాహపడకుండా 2014లో నవ్యాంధ్రకు తొలి ముఖ్యమంత్రి అయ్యారు. రాజధాని గానీ, చెప్పుకోదగ్గ పరిశ్రమలు గానీ ఏవీ లేని విభజిత రాష్ట్రాన్ని నిలబెట్టే క్రమంలో ఆయన చేసిన ప్రయోగాలు ప్రజలకు రుచించలేదు. దాంతో మళ్లీ ఓటమి పాలయ్యారు.

ఆ ఐదేళ్లూ వేధింపులు.. కక్షసాధింపులు

2019లో అధికారంలోకి వచ్చింది జగన్ కావడంతో వేధింపులు, సాధింపుల స్థానంలో కక్ష సాధింపులు మొదలయ్యాయి. చంద్రబాబు చుట్టూ మనుషులు లేకుండా చేయాలన్న జగన్ ప్రయత్నం కొంత వరకు ఫలించింది. అధికారంలో ఉన్నప్పుడు వీరుడు, శూరుడు, విక్రమార్కులు అన్నవారు సైతం ఇంట్లో పెళ్లికి కార్డు ఇవ్వడానికి కూడా చంద్రబాబు వద్దకు వెళ్లలేదు. ఎంత కిందకు పడితే అంత పైకి లేస్తారనే పేరున్న చంద్రబాబును మరింత కఠినంగా తొక్కేయడం కోసం జగన్ తన ఒరిజినల్ రూపాన్ని బయటపెట్టుకున్నారు. 70 ఏళ్లు పైబడిన వ్యక్తి అని చూడకుండా అమానుష పద్ధతిలో తప్పుడు కేసులో అరెస్టు చేశారు. 53 రోజుల పాటు జైలు జీవితం గడిపిన చంద్రబాబు.. ఒక్కసారిగా ప్రజల గుండెల్లోకి దూసుకుపోయారు. కళ్లుదిరిగే మెజారిటీతో 2024లో ఘన విజయం సాధించారు. ఒక వ్యక్తి అధికారం కోల్పోవడం, మళ్లీ తిరిగి రావడం సాధారణం.. కానీ ఇన్ని సార్లు అధికారం పోయినా మళ్లీ మళ్లీ రెట్టింపు ఉత్సాహంతో విజయతీరాలకు చేరుకోవడం అసాధారణ విషయం. ఇది చంద్రబాబుకే చెల్లింది.

పది నిమిషాలిస్తే..



ఒక చిన్న అవకాశం దొరకాలే గాని.. దానినెలా సద్వినియోగం చేసుకోవాలో చంద్రబాబుకు తెలిసినంత మరెవరికీ తెలియదేమో? మైక్రోసాఫ్ట్ సహవ్యవస్థాపకుడు బిల్‌గేట్స్‌ను హైదరాబాద్‌కు రప్పించడమే అప్పట్లో పెద్ద చర్చనీయాంశమైంది. దటీజ్ చంద్రబాబు అని దేశమంతా ప్రశంసించింది. ఆ సమయంలోనే మరో విశేషం చోటుచేసుకుంది. అంతటి బిల్‌గేట్స్ వచ్చినప్పుడు అలా వచ్చి ఇలా వెళ్లిపోతే మనకేముంటుంది.. మనమేంటో, మనకేం కావాలో చెప్పుకోవాలని చంద్రబాబుకు అనిపించింది. ఎవరెవరినో పట్టుకున్నారు.. బిల్‌గేట్స్‌తో పది అంటే పదే నిమిషాలు విడిగా మాట్లాడేందుకు అనుమతి పొందారు. సాధారణంగా బిల్‌గేట్స్ ఎంత సమయమిస్తే ఆ సమయానికి కార్యక్రమం ముగిసిపోవాలి. కానీ చంద్రబాబుతో పది నిమిషాల కోసం కూర్చుంటే వారి చర్చలు ఏకంగా 40 నిమిషాలు కొనసాగాయి. అమెరికా నుంచి వచ్చిన బిల్‌గేట్స్ సిబ్బంది కూడా ఆశ్చర్యపోయారు. మహా అయితే ఐదు నిమిషాలు ఎక్కువ కొనసాగవచ్చు.. అరగంట ఎక్కువ సేపు మాట్లాడడం వారినే కాదు, పారిశ్రామికవేత్తలనూ విస్మయపరిచింది.

ఎక్కడున్నా కింగ్ మేకర్....

చంద్రబాబు ఎక్కడున్నా కింగ్‌మేకరే. అటల్ బిహారీ వాజపేయి ప్రధానిగా ఉన్నప్పుడు ఎన్డీయే కన్వీనర్‌గా వ్యవహరించిన ఆయన.. ప్రఖ్యాత క్షిపణి శాస్త్రవేత్త అయిన ఏపీజే అబ్దుల్ కలాంను రాష్ట్రపతిగా ఎంపిక చేయడంలో కీలక భూమిక పోషించారు. అదే విధంగా ప్రముఖ జన్యు శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్‌ను, డీఆర్‌డీవో మాజీ చైర్మన్ సతీశ్‌రెడ్డి లాంటి వారిని సలహాదారులుగా నియమించుకోవడం ద్వారా.. శాస్త్ర సాంకేతిక రంగాల పరిజ్ఞానాన్ని రాష్ట్రప్రభుత్వం వినియోగించుకునేలా ఏర్పాట్లు చేశారు. ప్రపంచ స్థాయి కార్పొరేట్ దిగ్గజాలను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఆహ్వానించి రాష్ట్ర ప్రతిష్ఠను ఇనుమడింపజేశారు. అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్ ఏపీకి రావడం చంద్రబాబు వల్లే సాధ్యమైంది. కర్షక పరిషత్ చైర్మన్‌గా ఉన్నప్పుడు.. క్షీర విప్లవ పితామహుడు వర్గీస్ కురియన్‌ను పిలిపించి పాడి ఉత్పత్తిలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన ఘనత కూడా ఆయనదే.

హుద్‌హుద్.. బుడమేరు ముంపు.. కుదుటపడ్డాకే తిరిగి వెళ్లింది..!

రాష్ట్రంలో ఏదైనా విపత్కర పరిస్థితి తలెత్తితే చంద్రబాబు అది తన ఇంట్లో జరిగినట్లుగా భావిస్తారు. ముఖ్యంగా తుపాన్లు, వరదలొస్తే హెలికాప్టర్‌లో ఓ రౌండ్ వేసి వచ్చే ముఖ్యమంత్రులను చూస్తాం. కానీ ఆ ప్రాంతాల్లోనే తిష్ఠ వేసి.. పనులను పర్యవేక్షించే ముఖ్యమంత్రి బహుశా ఈయనొక్కరే కావొచ్చు. 2014 అక్టోబరులో విశాఖలో హుద్‌హుద్ తుఫాను సంభవించినప్పుడు.. తిరిగి సాధారణ పరిస్థితి నెలకొనేదాకా ఆయన అక్కడి నుంచి కదల్లేదు. సరిగ్గా ఏడాది కిందట బుడమేరు వరదకు విజయవాడలోని కొన్ని ప్రాంతాలు ముంపునకు గురైనప్పుడు కలెక్టర్ కార్యాలయంలోనే కూర్చుని దాదాపు వారం రోజుల పాటు ముంపు ప్రాంతాల్లో తిరిగి.. సహాయ పునరావాస కార్యక్రమాలను స్వయంగా పర్యవేక్షించి.. పరిస్థితులు పూర్తిగా చక్కదిద్దిన తర్వాత ఇంటికి వెళ్లారు. సొంత ఇంట్లో సమస్యలు వస్తే స్పందిస్తారో తెలియదు గానీ.. ఇలాంటి పరిస్థితుల్లో మాత్రం చంద్రబాబు 'ది బెస్ట్' అనిపించుకుంటారు.



హుద్‌హుద్ విలయంపై చిత్ర ప్రదర్శనను చూస్తున్న మోదీతో బాబు(ఫైల్)

అభివృద్ధి, సంక్షేమంలో ఆయనకు సాటిలేరు!

అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాల అమల్లో దేశంలో ఏ ముఖ్యమంత్రీ చంద్రబాబుకు సాటిరారంటే అతిశయోక్తి కాదు. ఏదో కంటితుడుపుగా ఇస్తున్న పెన్షన్‌ను మొదట రూ.500కు, ఆ తర్వాత రూ.వెయ్యికి, అనంతరం రూ.2,000కి, గత ఏడాది రూ.4 వేలకు పెంచి రాష్ట్రంలో వృద్ధులకు పెద్దకొడుకుగా భరోసాగా నిలిచారు. సంక్షేమం, అభివృద్ధికి సమప్రాధాన్యమిస్తూ ముందుకు నడుస్తున్నారు.

15 నెలల్లో 9 లక్షల కోట్లు

ఓ వైపు రాష్ట్ర ప్రతిష్ఠను పెంచుతూనే.. పెట్టుబడులను ఆకర్షించడంలో చంద్రబాబు కృషి అనిర్వచనీయం. కేంద్రం నుంచి నిధులు రాబట్టడంలోనూ ఆయన చతురత మరువలేనిది. ముఖ్యమంత్రిగా ఢిల్లీ వెళ్లిన ప్రతిసారీ కేంద్రంలో మంత్రులను కలవడం.. రాష్ట్ర సమస్యలను ఏకరువు పెట్టడం.. కేంద్ర పెద్దల వద్ద తన పరపతి ఉపయోగించి నిధులు తీసుకురావడంలో ఆయన చాణక్యమే వేరు. ఏ ముఖ్యమంత్రి కూడా ఢిల్లీకి ఇన్నిసార్లు వెళ్లి ఉండరు. ఆయనకు వాక్చాతుర్యం, ఆంగ్ల భాషాపరిజ్ఞానం అంతగా లేదు. కానీ తనకున్నంత పరిజ్ఞానంతోనే ఎంతటి వారినైనా కన్విన్స్ చేయగల సామర్థ్యం ఆయనకుందని రాజకీయ ప్రముఖులు, ఉన్నతాధికారులు సైతం అంటారు. 2019-24 నడుమ జగన్ ఏలుబడిలో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఒక్కరు కూడా ముందుకు రాలేదు. ఉన్న పరిశ్రమలనూ తరిమివేశారు. కొన్నిటిని సొంతం చేసుకున్నారు. కొత్తగా పెట్టుబడి అనవాళ్లే లేకుండా చేశారు. కానీ చంద్రబాబు గత ఏడాది మళ్లీ సీఎంగా వచ్చాక పెట్టుబడులను ఆకర్షించే పనిలో పడ్డారు. ఇందుకోసం రాత్రింబవళ్లూ కృషిచేస్తున్నారు. ఏడాదిన్నర కాకముందే రూ.9 లక్షల కోట్లకుపైగా పెట్టుబడుల కోసం కంపెనీలతో ఎంవోయూలు కుదుర్చుకున్నారు. ఇవన్నీ సాకారమైతే యువతకు లక్షల ఉద్యోగాలు లభిస్తాయి.పెట్టుబడులు రావాలంటే శాంతిభద్రతలు పటిష్ఠంగా ఉండాలని చంద్రబాబు ప్రగాఢంగా విశ్వసిస్తారు. తనను, టీడీపీ కార్యకర్తలను ఐదేళ్లపాటు ఎనలేని వేధింపులు, ఆస్తుల ధ్వంసం, తప్పుడు కేసులు, అక్రమ అరెస్టులతో వేధించిన వైసీపీ నేతలపై చట్టప్రకారమే చర్యలు తీసుకోవాలన్నది ఆయన విధానం. అధికారం ఉందని ప్రత్యర్థులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడడం ఆయన సహించరు. ఇలాంటి చర్యలతో పెట్టుబడిదారులు పరిశ్రమల స్థాపనకు ముందుకు రారన్నది ఆయన ఉద్దేశం. అందుకే జగన్ హయాంలో జరిగిన కుంభకోణాల విషయంలోనూ చట్టపరంగానే ముందుకెళ్తున్నారు. పకడ్బందీగా దర్యాప్తు జరిపిస్తూ.. అన్ని ఆధారాలూ దొరికాకే అరెస్టుల వరకు వెళ్తున్నారు. టీడీపీ శ్రేణులు, నేతలకు ఈ విషయంలో అసంతృప్తి ఉన్నా.. ఆయన చెప్పిందీ వాస్తవం కావడంతో సమాధానపడుతున్నారు.

పోలవరం, రాజధాని, విశాఖ ఉక్కుకు నిధులు..

గత ఏడాది గద్దెనెక్కాక చంద్రబాబు పోలవరం ప్రాజెక్టుకు ముందస్తు నిధులు సాధించారు. అంతకుముందు రాష్ట్రప్రభుత్వం ఖర్చుచేస్తే కేంద్రం రీయింబర్స్ చేసేది. అయితే రాష్ట్రం అప్పుల పాలై ఆర్థిక సంక్షోభంలో ఉన్నందున.. అడ్వాన్సుగా నిధులిచ్చేలా కేంద్రాన్ని ఒప్పించారు. రాజధాని నిర్మాణానికి కూడా ఎప్పటికప్పుడు నిధులు రప్పిస్తున్నారు. విశాఖ ఉక్కు కర్మాగారానికి కేంద్రం వేల కోట్ల ఆర్థిక సాయం అందించేలా చేశారు. విభజన హామీ విశాఖ రైల్వేజోన్‌ను సాకారం చేస్తున్నారు. రామాయపట్నం వద్ద బీపీసీఎల్ రూ.వేల కోట్లతో ఆయిల్ రిఫైనరీ పెట్టబోతోంది.

బాబు కృషితోనే ఏపీలో ముంపు మండలాల విలీనం

చంద్రబాబు కార్యదక్షత, పట్టుదల ఎనలేనివని ఆయన రాజకీయ జీవితం తెలిసిన వారందరికీ ఎరుకే. పట్టుబడితే సాధించే దాకా వెనుదీయరు. విభజిత ఆంధ్రప్రదేశ్‌లో 2014లో టీడీపీ గెలిచాక ఆయన పదవీ బాధ్యతలు చేపట్టడానికి 23 రోజులు ఆలస్యమైయింది. విభజిత ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి నాడు ఆయన ముందు నాడు సవాళ్లు నిలిచాయి. రాజధాని నిర్మాణం, పోలవరం. ఈ ప్రాజెక్టు పూర్తి చేయాలంటే తెలంగాణలోని ముంపు మండలాలను ఆంధ్రలో విలీనం చేయాలి. లేకపోతే అంతర్రాష్ట్ర సమస్యల సుడిగుండంలో పడుతుంది. అందుకే ముంపు మండలాలను విలీనం చేసేదాకా సీఎంగా ప్రమాణ స్వీకారం చేయనని చంద్రబాబు భీష్మించారు. మే 16న ఎన్నికల ఫలితాలు వెలువడగా.. మోదీ ప్రభుత్వం స్పందించి విలీనంపై రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ద్వారా ఆర్డినెన్స్ విడుదల చేయించే వరకు ఆయన ప్రమాణ స్వీకారం చేయలేదు. విలీనానికి గ్రీన్‌సిగ్నల్ వచ్చాక జూన్ 8న పదవీప్రమాణం చేశారు.

ఆంధ్రజ్యోతి, అమరావతి





విజయవాడ ప్రకాశం బ్యారేజీపై ఆదివారం నిమజ్జన సందడి

గంగ ఒడికి గణనాథుడు!

- పలుచోట్ల ఐదో రోజునే గణేశ్ నిమజ్జనాలు

ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్: రాష్ట్రవ్యాప్తంగా గణేశ్ నిమజ్జనాలను ఘనంగా నిర్వహించారు. ఐదు రోజుల పాటు పూజలందుకున్న గణనాథుడికి ఆదివారం పలు ప్రాంతాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి వీడ్కోలు పలికారు. వినాయక నిమజ్జనాలతో విజయవాడలో నగరం సందడిగా మారింది. స్నేహితులు, బంధువులు, కుటుంబసభ్యులు పాల్గొని ఆనందంగా వినాయకుడికి వీడ్కోలు పలికారు. నగరంలోని ప్రధాన ప్రాంతాలు, నదీతీరాలు గణేశ నామస్మరణతో మార్మోగాయి. వందల సంఖ్యలో విగ్రహాలు నిమజ్జనానికి రావడంతో కృష్ణానదీ తీరం భక్తులతో సందడిగా మారింది. ఇక నంద్యాల శివారులోని చిన్న చెరువు వినాయక ఘాట్ వద్ద న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, జిల్లా కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా నిమజ్జన ఉత్సవాలను ప్రారంభించారు. ముందుగా వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఘాట్ వద్ద జెండా ఎగురవేశారు. అలాగే బనగానపల్లె, డోన్, నందికొట్కూరుల్లోనూ నిమజ్జనాలు వేడుకగా నిర్వహించారు. కర్నూలు జిల్లా ఆదోనిలో నిమజ్జనోత్సవాలను ఎమ్మెల్సీలు బీటీ నాయుడు, మధుసూదన్, కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, ఆదోని మాజీ ఎమ్మెల్యేలు మీనాక్షినాయుడు, సాయిప్రసాద్‌రెడ్డి తదితరులు ప్రారంభించారు.



10,019 డాలర్లకు లడ్డూను కైవసం చేసుకున్న మెల్‌బోర్న్ టీడీపీ అధ్యక్షుడు లగడపాటి సుబ్బారావు

గణేశ్ లడ్డూ @ రూ.5.76 లక్షలు

నూజెండ్ల, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన లడ్డు వేలం పాటలో పల్నాడు జిల్లా నూజెండ్లకు చెందిన మెల్‌బోర్న్ టీడీపీ అధ్యక్షుడు లగడపాటి సుబ్బారావు 10,019 డాలర్లకు (సుమారు రూ.5.76లక్షలు) లడ్డూను కైవసం చేసుకున్నారు.

ఉల్లి రైతు బేజారు

- మహారాష్ట్ర ఉల్లికే వ్యాపారుల మొగ్గు
- కర్నూలు ఉల్లి కొనేందుకు ముందుకు రాని వైనం
- కిలో రూ.5కు అడుగుతున్న వ్యాపారులు

(తాడేపల్లిగూడెం-ఆంధ్రజ్యోతి)

ఆరుగాలం కష్టించి పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించక రాష్ట్రంలోని ఉల్లిరైతు విలవిలలాడుతున్నాడు. సాధారణంగా అక్టోబరు మాసంలో మార్కెట్‌కు కర్నూలు ఉల్లి రావాల్సి ఉంది. కానీ, ఈ సంవత్సరం ఉల్లిని ముందుగానే సాగుచేయడంతో జూలైలోనే మార్కెట్‌కు వచ్చేసింది. జూలై, ఆగస్టు నెలల్లో కురిసిన వర్షాలకు 30 శాతం వరకు ఉల్లి దెబ్బతింది. ఎకరాకు రూ.90 వేల నుంచి రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టి పండించగా.. అమ్ముదామంటే అయినకాడికి అడుగుతున్నారని రైతులు వాపోతున్నారు. పంటను పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మార్కెట్‌కు తీసుకురాగా, కొనుగోలు చేయడానికి వ్యాపారులు ముందుకు రావడం లేదు. ఉల్లి తీయడానికే ఎకరాకు రూ.15వేలు ఖర్చుచేసినట్లు రైతులు చెబుతున్నారు. వ్యాపారులు క్వింటా రూ.500 నుంచి రూ.600 మధ్య అడుగుతున్నారని వాపోతున్నారు. కనీసం క్వింటా రూ.2వేలకు అమ్మితే లాభాలు లేకపోయిన చేసిన ఖర్చులు వస్తాయని అంటున్నారు. గతేడాదితో పోల్చితే ఉల్లి ధర 10 రెట్లు పడిపోయింది. గతేడాది కర్నూలు ఉల్లి క్వింటా రూ.4500 నుంచి రూ.6000 మధ్య విక్రయించారు. గతేడాది మహారాష్ట్రలో వర్షాలకు అక్కడ ఉల్లి పంట దెబ్బతింది. దీంతో కర్నూలు ఉల్లి హాట్‌కేకులా అమ్ముడుపోయింది. దీన్ని దృష్టిలో పెట్టుకుని కర్నూలు రైతులు ఉల్లి సాగు విస్తీర్ణాన్ని పెంచారు. సుమారు 15వేల హెక్టార్లలో ఉల్లిసాగు చేశారు. దిగుబడి కూడా ఆశాజనక ంగా వచ్చింది. ఎకరాకు 50 నుంచి 60 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. పంట చేతికందే సమయంలో వరుణుడు కాటేశాడు. దీంతో నాణ్యత లోపించింది. ఇదే అదనుగా దళారులు సిండికేట్‌గా మారి కర్నూలు ఉల్లిని కొనడం మానేశారు. రైతులు అయినకాడికి అమ్ముకుందామన్నా కొనేవారు లేరు.

మహారాష్ట్ర ఉల్లిని నిలుపుదల చేయాలి

మహారాష్ట్ర నుంచి వచ్చే ఉల్లిని ఏపీలోకి రాకుండా చేస్తే కర్నూలు ఉల్లి కొనుగోలుకు వ్యాపారులు ముందుకొస్తారని రైతులు చెబుతున్నారు. ఇప్పుడు మహారాష్ట్ర నుంచి పెద్ద ఎత్తున రాష్ట్రానికి ఉల్లి వస్తోంది. అక్కడ కూడా ఉల్లి నిల్వలు పేరుకుపోయాయని వ్యాపారులు చెబుతున్నారు. దీనికి ప్రధాన కారణం విదేశాలకు ఎగుమతులను నిలిపివేయడమేనని చెబుతున్నారు. ఏటా ఆగస్టు నెలాఖరు నాటికి మహారాష్ట్ర నుంచి ఉల్లి దిగుమతి అయ్యేది కాదు. అదే సమయంలో కర్నూలు ఉల్లి మార్కెట్లోకి వచ్చేసేది. ఈ ఏడాది మహారాష్ట్రలోనూ ఉల్లి సాగు విస్తీర్ణం పెంచడం, దిగుబడులు పెరగడం, ఎగుమతికి అనుమతి ఇవ్వకపోవడం తదితర కారణాలతో నిల్వలు పెరిగాయి. మహారాష్ట్ర ఉల్లికి నాణ్యత ఉండటంతో ఏపీలో ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. కర్నూలు ఉల్లికి ఘాటు ఎక్కువగా ఉన్నప్పటికీ వండే సమయంలో ఎరుపురంగు ఉండటం వల్ల దీన్ని కొనుగోలు చేయడానికి ఎక్కువ మంది ఇష్టపడటం లేదు.



బస్తాల్లోంచి తీసిన కుళ్లిన ఉల్లిపాయలను చూపిస్తున్న వ్యాపారులు

కర్నూలు టు హైదరాబాద్

కర్నూలు ఉల్లి తాడేపల్లిగూడెం మార్కెట్‌కు రావడం తగ్గింది. తాడేపల్లిగూడెం మార్కెట్‌కు ప్రతిరోజు 50 నుంచి 60 లారీల ఉల్లి కర్నూలు నుంచి వచ్చేది. ఇప్పుడు ఆ పరిస్థితులు లేవు. ధర పతనంతో రైతులు రవాణా వ్యయం తక్కువగా ఉండే హైదరాబాద్‌ను ఎంచుకుంటున్నారు. ఇప్పుడు ప్రతి రోజు 60 నుంచి 100 లారీల వరకు కర్నూలు నుంచి హైదరాబాద్‌కు ఉల్లి లోడ్‌తో వెళ్తున్నాయి. తాడేపల్లిగూడెం మార్కెట్ 10లోపు లారీలు మాత్రమే వస్తున్నాయి. ఆదివారం 6 లారీలు మాత్రమే వచ్చాయి. నాసిరం ఉల్లి క్వింటా రూ.400 నుంచి రూ.600 మధ్య ధర పలికింది. కొద్దిపాటి నాణ్యతతో పొడిగా ఉన్న ఉల్లి మాత్రం రూ.700 నుంచి రూ.900 మధ్య విక్రయాలు జరిగాయి.

నిల్వ ఉండే సామర్థ్యం లేదు



కర్నూలు నుంచి వస్తున్న ఉల్లికి నిల్వ ఉండే సామర్థ్యం లేదు. రెండు రోజులు ఉంచితే బస్తాలో డ్యామేజ్ కనిపిస్తోంది. వర్షాల వల్ల ఈ పరిస్థితి నెలకొంది. నాణ్యత ఉన్న ఉల్లి కొనుగోలుకు చిరువ్యాపారులు ముందుకు వస్తారు. ఆ దిశగా రైతులు ప్రయత్నించాలి. - కొట్టు అంజిబాబు, హోల్‌సేల్ ఉల్లి వ్యాపారి, తాడేపల్లిగూడెం

మహారాష్ట్ర ఉల్లికే..



మహారాష్ట్ర ఉల్లి మార్కెట్లో అందుబాటులో ఉంది. నాణ్యత వల్ల దాన్నే ఇక్కడి ప్రజలు ఇష్టపడతారు. కర్నూలు ఉల్లి కూరకు అంతగా బాగుండదని భావిస్తారు. దీనికి తోడు కర్నూలు ఉల్లి తడిసి వేస్టేజ్ ఎక్కువగా వస్తోంది. నిల్వ ఉండటం లేదు.

- యర్రా అయ్యప్ప, రిటైల్ వ్యాపారి, తాడేపల్లిగూడెం





నరసాపురంలో ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్, అల్లూరి జిల్లా పాడేరులో జనంపైకి దూసుకొచ్చిన స్కార్పియో

నిమజ్జన వేడుకల్లో అపశ్రుతి

- వేర్వేరు జిల్లాల్లో 9 మంది దుర్మరణం
- నరసాపురంలో ట్రాక్టర్ ఢీకొని నలుగురు..
- పాడేరులో స్కార్పియో ఢీకొని ఇద్దరు..
- నెల్లూరు జిల్లాలో ఇద్దరు, అనంతలో ఒకరు..

నరసాపురం, కావలి రూరల్, పాడేరు రూరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఆదివారం జరిగిన గణేశ్ నిమజ్జన వేడుకల్లో అపశ్రుతులు చోటుచేసుకున్నాయి. వాహనాలు ఢీకొని 8 మంది దుర్మరణం పాలవగా, సముద్రంలో మునిగి ఓ యువతి చనిపోయింది. వివరాలివీ.. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం మండలం తూర్పుతాళ్ళు పంచాయతీ పరిధి ఈవనవారి మెరకలో 15 అడుగుల గణనాథుడి విగ్రహాన్ని నరసాపురం వశిష్ఠ గోదావరిలో నిమజ్జనం చేసేందుకు సాయంత్రం 5 గంటల సమయంలో ఊరేగింపు చేపట్టారు. అయితే, అక్కడి సిమెంటు రహదారి మార్జిన్ సక్రమంగా లేకపోవడంతో పాటు డ్యాన్సులు చేస్తున్న యువకుల అత్యుత్సాహంతో వినాయకుడి విగ్రహం ఉన్న ట్రాక్టర్ ఒక్కసారిగా ముందుకు దూసుకుపోయింది. ఈ ఘటనలో యివన సూర్యనారాయణ (58), తిరుమల నర్సింహమూర్తి (35), గురుజు మురళి (38), కడియం దినేశ్ (9) అక్కడికక్కడే మృతి చెందారు. మరో వ్యక్తి తీవ్ర గాయాలపాలై పాలకొల్లు ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీనిపై మొగల్తూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్, జిల్లా కలెక్టర్ నాగరాణి, ఎస్పీ నయామ్, అడిషనల్ ఎస్పీ భీమారావు ఘటనా స్థలానికి చేరుకుని సంఘట ప్రమాదంపై ఆరా తీశారు. అలాగే అల్లూరి జిల్లా కేంద్రమైన పాడేరు సమీప చింతలవీధి ప్రధాన రహదారిపై ఊరేగింపుగా వెళ్తున్నవారిపై స్కార్పియో కారు వేగంగా దూసుకువచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో చింతలవీధికి చెందిన కొర్రా సీతారామ్ (61), గంట కొండబాబు (35) అక్కడికక్కడే మృతిచెందగా, కొర్రా విశ్వ, వంతాల దాలిమ్మలకు తీవ్రగాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. వారి పరిస్థితి విషమం గా ఉంది. మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. అలాగే, నెల్లూరు జిల్లా కావలి మండలం చెన్నాయపాలెం సముద్రతీరంలో సాయంత్రం వినాయక నిమజ్జన సమయంలో పులి నాగలక్ష్మి(16) సముద్రంలో కొట్టుకుపోయి మృతి చెందింది. అలాగే, శ్రీసత్యసాయి జిల్లా పెద్దిరెడ్డిపల్లి ఊరేగింపులో ట్రాక్టర్ ఢీకొని మారుతి (30) అనే వ్యక్తి మృతి చెందారు. మరో 11 మంది గాయపడ్డారు.

విగ్రహం ఉన్న ట్రాక్టర్ ఎక్కుదామనుకుంటే..

కొండాపురం మండలం రామాంజీపురానికి చెందిన వెంగయ్య తన కుమారుడు ప్రసాద్‌తో కలిసి మోటారుబైక్‌పై కావలి తుమ్మలపెంట తీరంలో జరిగే నిమజ్జనానికి బయలుదేరాడు. మార్గమధ్యంలో కావలి సమీపంలో బైక్‌ను ఆపి.. 'నువ్వు బైక్‌లో వెళ్లి పో.. నేను వెనుక విగ్రహం వస్తున్న ట్రాక్టర్‌లో వస్తా'నని చెప్పి కుమారుడ్ని పంపించాడు. అనంతరం ట్రాక్టర్‌ను ఆపే క్రమంలో వెంగయ్యను ట్రాక్టర్ ఢీకొంది. ఆయన కాలికి తీవ్రగాయాలు కాగా, ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు.

అవి 'మెలియోయిడోసిస్' జ్వరాలు

- బర్కోల్డేరియా సూడోమల్లీ బ్యాక్టీరియానే కారణం
- తురకపాలెం మరణాలపై వైద్యుల అభిప్రాయం
- 'ఆంధ్రజ్యోతి' కథనంతో కదిలిన యంత్రాంగం



బర్కోల్డేరియా సూడోమల్లీ బ్యాక్టీరియా

గుంటూరు మెడికల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మిస్టరీ మరణాల గుట్టు వీడింది. గుంటూరు జిల్లా తురకపాలెంలో సంభవించిన వరుస మరణాలకు మెలియోయిడోసిస్ జ్వరాలే కారణమని వైద్యులు తేల్చారు. బర్కోల్డేరియా సూడోమల్లీ అనే బ్యాక్టీరియా వల్ల ఈ జ్వరాలు సంభవిస్తాయని చెప్పారు. తురకపాలెం గ్రామంలో విషజ్వరాల బారినపడి 30 మంది మృతిచెందిన విషయంపై ఆదివారం నాటి 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో 'వరుస మరణాల మిస్టరీ ఏంటి?' అనే శీర్షికన వార్తాకథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. ఈ కథనం జిల్లా వైద్య వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అయితే తురకపాలెంలో పెద్దఎత్తున ప్రబలిన జ్వరాలకు బర్కోల్డేరియా సూడోమల్లీ బ్యాక్టీరియానే కారణమని, దీనివల్ల మెలియోయిడోసిస్ జ్వరాలు వస్తాయని ప్రైవేటు వైద్యులు చెప్పారు. ఈ ప్రాంతంలో ఇవి కొత్త జ్వరాలని అన్నారు. దక్షిణాసియా వంటి ఉష్ణ మండల ప్రాంతాల్లో ఈ జ్వరాలు సాధారణంగా కనిపిస్తుంటాయని, ఈ జ్వరం వచ్చిన వెంటనే రోగులు వైద్యనిపుణుల పర్యవేక్షణలో తగిన చికిత్స పొందాలని సూచించారు. ఆలస్యమైతే బ్యాక్టీరియా తీవ్రత వల్ల ఇన్ఫెక్షన్‌కు గురై వివిధ అవయవాలు దెబ్బతిని మరణించే ప్రమాదం ఉందని తెలిపారు. ఈ బ్యాక్టీరియా మట్టిలో, కలుషిత నీటిలో ఉంటుందని.. ఈ నీళ్లు తాగినా, మట్టిలో చెప్పులు లేకుండా నడిచినా బ్యాక్టీరియా శరీరంలోకి ప్రవేశించి మెలియోయిడోసిస్ జ్వరాలు కలిగిస్తాయని డాక్టర్లు చెప్పారు.

వివిధ అవయవాలు దెబ్బతింటాయి..

తురకపాలెంలో నమోదైన 30 మిస్టరీ మరణాల విషయం 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చేంతవరకు తమకు తెలీదని వైద్యవర్గాలు ఆశ్చర్యం వ్యక్తం చేశాయి. కొంతమంది డాక్టర్లు ఫోన్ ద్వారా 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. పలువురు రోగులు.. జ్వరం, కీళ్ల నొప్పులు, ఆయాసం, కిడ్నీ, కాలేయ సంబంధిత సమస్యలతో తమ దగ్గరకు వచ్చి చికిత్స పొందారని తెలిపారు. బ్లడ్ కల్చర్ పరీక్షల్లో 80 శాతం మందికి బర్కోల్డేరియా సూడోమల్లీ బ్యాక్టీరియా ఇన్‌ఫెక్షన్ ఉన్నట్లు నివేదికలు వచ్చినట్లు తెలిపారు. బ్యాక్టీరియా తీవ్రత పెరిగి ఇన్ఫెక్షన్ వల్ల వివిధ అవయవాలు దెబ్బతిని వచ్చిన రోగులు చికిత్సలు పొందుతూ ప్రాణాలు కోల్పోయినట్లు వివరించారు. జ్వర ప్రారంభ దశలోనే వచ్చిన రోగులను మాత్రం కాపాడినట్లు వివరించారు. ఇదే జ్వరంతో మృతిచెందిన శౌరి బాబు బ్లడ్ కల్చర్ రిపోర్ట్‌ను ఆయనకు వైద్యం చేసిన డాక్టర్ కే కల్యాణ్ చక్రవర్తి 'ఆంధ్రజ్యోతి'కి అందజేశారు. గుంటూరు జిల్లాతో పాటు బాపట్ల, పల్నాడు జిల్లాల నుంచి కూడా మెలియోయిడోసిస్ జ్వర కేసులు గుంటూరులో పలు ప్రైవేటు వైద్యశాలలకు వస్తున్నట్లు తెలిసింది. మధుమేహ బాధితుల్లో తీవ్రత అధికంగా ఉంటున్నట్లు గుర్తించారు.

బ్లడ్ కల్చర్ పరీక్షలో నిర్ధారణ: కల్యాణ్ చక్రవర్తి

తురకపాలెంలో ప్రబలిన మెలియోయిడోసిస్ జ్వరాలకు బర్కోల్డేరియా సూడోమల్లీ అనే బ్యాక్టీరియానే కారణమని గుంటూరులోని ఇన్‌ఫెక్షియస్ డిసీజెస్ స్పెషలిస్ట్ డాక్టర్ కే కల్యాణ్ చక్రవర్తి చెప్పారు. 'మెలియోయిడోసిస్ జ్వరం షుగర్, లివర్, కిడ్నీ సంబంధిత దీర్ఘకాలిక వ్యాధులున్న వారిలో ఎక్కువ ప్రభావం చూపుతుంది. జ్వరం, దగ్గు, కీళ్ల నొప్పులు వంటి లక్షణాలతో రోగులు వస్తున్నారు. లక్షణాలు క్షయను పోలి ఉంటాయి. వైద్యపరీక్షల్లో టీబీ కాదని తేలితే మెలియోయిడోసిస్‌గా అనుమానించాలి. సరైన పద్ధతిలో బ్లడ్ కల్చర్ పరీక్ష ద్వారా మాత్రమే ఇది నిర్ధారణ అవుతుంది. నెల రోజులుగా నలుగురు రోగులు ఈ జ్వరాలతో మా ఆస్పత్రిలో చేరారు. వీరికి రెగ్యులర్ యాంటీబయాటిక్స్ పని చేయవు' అని ఆయన తెలిపారు.

'బీచ్‌శాండ్'పై కదలిక

- టెండర్లు ఖరారు చేయనున్న సర్కారు
- ముందు వరుసలో అదానీ కంపెనీలు
- హైకోర్టు సూచనల మేరకు నిబంధనల్లో మార్పులకు అవకాశం
- మరో 16 వేల హెక్టార్లలో లీజులకు కేంద్రాన్ని కోరిన రాష్ట్ర ప్రభుత్వం



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

బీచ్‌శాండ్ మైనింగ్‌లో కదలిక మొదలైంది. న్యాయపరమైన చిక్కులు తొలగిపోవడంతో టెండర్లు ఖరారు చేసే పనిలో ఏపీ ఖనిజాభివృద్ధి సంస్థ (ఏపీఎండీసీ) నిమగ్నమైంది. గత జగన్ ప్రభుత్వ హయాంలోనే రెండు ప్రాంతాల్లో వెయ్యి హెక్టార్లలో రెండు మైనింగ్ లీజులు చేపట్టేందుకు అవసరమైన డెవలపర్ ఎంపిక కోసం టెండర్లు పిలిచారు. ఇప్పుడు ఆ టెండర్లకు సంబంధించిన న్యాయపరమైన చిక్కులు తొలగిపోయాయి. టెండర్లు ఖరారు చేసుకోవచ్చని హైకోర్టు ఇటీవల అనుమతిచ్చింది. ఈ నేపథ్యంలో గతంలో నిర్వహించిన టెండర్లలో కంపెనీలు దాఖలు చేసిన ఆర్థిక, సాంకేతిక బిడ్లను అధికారులు పరిశీలించారు. బిడ్డింగ్‌లో అర్హత సాధించిన కంపెనీల వివరాలను త్వరలో ప్రకటించనున్నట్లు తెలిసింది. ఇందులో అదానీ గ్రూప్‌నకు చెందిన రెండు కొత్త కంపెనీలు బిడ్‌లు దాఖలు చేసిన విషయాన్ని గతంలోనే 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకొచ్చింది. శ్రీకాకుళం జిల్లా గార, విశాఖ జిల్లా భీమిలిలో మైనింగ్‌కు జరిగిన టెండర్లలో అదానీ గ్రూప్ కంపెనీలే ముందువరసలో ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. హైకోర్టు సూచనల మేరకు ప్రాజెక్టు డెవలపర్ విధులు, ఏపీఎండీసీ బాధ్యతల విషయంలో కొన్ని నియమ నిబంధనలు మార్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఈ విషయాలపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు గనుల శాఖ నివేదిక సమర్పించినట్లు తెలిసింది. గతంలో వచ్చిన న్యాయపరమైన చిక్కులు జూలై 31తో తొలగిపోయాయని, ఇక టెండర్ల ఖరారు ప్రక్రియను వేగవంతం చేయాల్సి ఉందని ఆ నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం. తొలిదశలో శ్రీకాకుళం జిల్లా గారలో 909.85 హెక్టార్లు, విశాఖ జిల్లా భీమిలిలో 90.15 హెక్టార్లలో విడివిడిగా డెవలపర్ కోసం టెండర్లు పిలిచినట్లు పేర్కొన్నారు. వాస్తవానికి ఏపీలో ఇంకా 16 వేల హెక్టార్ల పరిధిలో బీచ్‌శాండ్ మినరల్స్ నిక్షేపాలున్నాయని, ఈ మేరకు ఏపీఎండీసీకి లీజులు ఇవ్వాలని కేంద్రాన్ని కోరినట్లు ఆ నివేదికలో తెలిపారు. అయితే కేంద్రం కేవలం వెయ్యి హెక్టార్లకే లీజులు ఇచ్చిందని నివేదించారు. ఈ అంశాలపై గతంలో అణుశక్తి విభాగం లేవనెత్తిన అంశాలు, ఏపీఎండీసీ ఇచ్చిన వివరణలు, ఇతర సాంకేతిక అంశాలను కూడా ప్రస్తావించినట్లు తెలిసింది. అయితే కోర్టు చిక్కులు తొలగినందున తొలుత వెయ్యి హెక్టార్ల పరిధిలో టెండర్లు ఖరారు చేయాలని సీఎం ఆదేశించినట్లు సమాచారం.

కేంద్రానికి ఏపీ సర్కారు లేఖ

16,004 హెక్టార్ల పరిధిలోని 16 లీజులను కూడా ఏపీఎండీసీకి కేటాయించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల మరోసారి కేంద్రానికి లేఖ రాసింది. బీచ్‌శాండ్ మైనింగ్, ఇందులోని ఖనిజాలైన ఇలిమినైట్, రుటైల్, గార్నెట్, సిలిమినైట్, జిర్కాన్, మోనోజైట్‌లను ప్రాసెస్ చేసే ప్లాంట్ల ఏర్పాటు కోసం కనీసం 2 వేల కోట్ల పెట్టుబడులు ఉంటాయని గనుల శాఖ చెబుతోంది. మొత్తంగా విలువ ఆధారిత ప్రాజెక్టులపై కనీసం 15 వేల కోట్ల రూపాయల పెట్టుబడులు వస్తాయని అంచనా వేసింది. ఈ నేపథ్యంలో తమ వద్ద ఉన్న నిక్షేపాల మేరకు 16 వేల హెక్టార్ల పరిధిలోని మరో 16 లీజులను ఏపీఎండీసీ పేరిట కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ఏపీ విన్నపం మేరకు కేంద్రం ఈ 16 లీజులను కూడా ఏపీఎండీసీకి అప్పగిస్తే మరోదఫా ప్రాజెక్టు డెలపర్ల ఎంపిక కోసం భారీ టెండర్లు నిర్వహించాల్సి ఉంటుంది.

నెలాఖరులోపు జగన్ జైలుకు: గోనె

తిరుపతి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): 'మద్యం కుంభకోణం జగన్‌రెడ్డి మెడకు చుట్టేసుకుంది. జగన్ సెప్టెంబరు నెలాఖరులోపు అరెస్టవడం పక్కా' అని మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ నేత గోనె ప్రకాశరావు అన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'మద్యం కుంభకోణంలో దర్యాప్తు సంస్థ వద్ద స్పష్టమైన ఆధారాలున్నాయి. జగన్ అరెస్టు కోసం బీజేపీ అనుమతితో కూడా అవసరం ఉండదు. ఈ వ్యవహారంపై సీఎం చంద్రబాబు ఆచితూచి వ్యవహరిస్తున్నారు' అని పేర్కొన్నారు. 'వైసీపీ హయాంలో టీడీఆర్ బాండ్ల జారీ వందలకోట్ల అవినీతిపై సమగ్ర విచారణ జరగాలి" అని కూటమి నేతలను డిమాండ్ చేశారు. ఇక, ఉపరాష్ట్రపతి ఎన్నిక నేపథ్యంలో ఎన్డీఏకు వ్యతిరేకంగా ఉండాల్సిన జగన్ ఎన్డీఏ వైపు ఉండడం ఆశ్చర్యంగా ఉందన్నారు. 'అటూ, ఇటూ కానివాళ్ల'లాగా వ్యవహరిస్తున్నాడని విమర్శించారు.

మోదీ తల్లిపై విమర్శలు సిగ్గుచేటు: యామిని

విజయవాడ, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): రాహుల్ గాంధీ బిహార్ పర్యటనలో కాంగ్రెస్ కార్యకర్తలు ప్రధాని మోదీ తల్లిని తీవ్రంగా అవమానించడం.. దేశంలోని తల్లులు, మహిళలందరినీ అవమానించినట్టేనని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సాధినేని యామిని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారమిక్కడ ఆమె ఆదివారం మీడియాతో మాట్లాడుతూ, 'సాక్షాత్తూ దేశ ప్రధాని తల్లిని తూలనాడడం సిగ్గుచేటు. ఇలాంటి వ్యాఖ్యలు చేసిన నాయకులపై కాంగ్రెస్ అధిష్ఠానం చర్యలు తీసుకోకపోవడం ఆ పార్టీకున్న కుసంస్కారాన్ని తెలియజేస్తోంది. రాహుల్ తల్లి, సోదరిపై ఎవరైనా ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే రాహుల్ ఊరుకుంటారా? దీనిపై సోనియా, షర్మిల ఇప్పటివరకు స్పందించకపోవడమేంటి?' అని యామిని ప్రశ్నించారు.



పోలవరం స్పిల్‌వే వద్ద గోదావరి వరద జలాల ఉధృతి

ఉధృతంగానే గోదావరి!

- పోలవరం నుంచి 10.84 లక్షల క్యూసెక్కులు దిగువకు
- ధవళేశ్వరంలో కొనసాగుతున్న మొదటి ప్రమాద హెచ్చరిక
- లంక, లోతట్టు ప్రాంతాల నుంచి ప్రజలను తరలించిన అధికారులు

రాజమహేంద్రవరం/పోలవరం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): గోదావరి ఉధృతి కొనసాగుతోంది. ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో గోదావరికి భారీస్థాయిలో వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో నీటిమట్టం మరింత పెరిగింది. మహారాష్ట్ర, ఒడిశా, చత్తీస్‌గఢ్ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి ఉపనదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పోలవరం ప్రాజెక్టులోకి అదనంగా వస్తున్న 10,84,329 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 48.10 మీటర్లకు చేరుకుంది. ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 33.050 మీటర్లు, స్పిల్‌వే దిగువన 24.470 మీటర్ల నీటిమట్టం నమోదైనట్టు జలవనరులశాఖ అధికారులు తెలిపారు. భద్రాచలంలో రెండో ప్రమాద హెచ్చరిక, ధవళేశ్వరంలో మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతున్నాయి. రాజమహేంద్రవరం అఖండ గోదావరి వద్ద లంక, లోతట్టు ప్రాంతాల నుంచి ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. ప్రస్తుతం ధవళేశ్వరం వద్ద నీటిమట్టం 12.80 అడుగులుగా ఉంది. ఈ నీటిమట్టం 13.75 అడుగులకు చేరితే రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేయనున్నట్టు అధికారులు తెలిపారు. ప్రస్తుతం వరద నిలకడగా ఉండడంతో ఆ పరిస్థితి రాకపోవచ్చునని పేర్కొన్నారు. మరోవైపు ధవళేశ్వరం నుంచి 11 లక్షల 35 వేల 249 క్యూసెక్కుల మేరకు సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. ఎగువ భాగంలోని ఏటూరు నాగారం వద్ద వరద తగ్గుముఖం పట్టగా, కూనవరం, ధవళేశ్వరం వద్ద పెరుగుతున్నట్టు అధికారులు తెలిపారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.